ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-7-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 166 పేజీలు: 10+4 వెల: 6.50



ట్రంప్ చిత్రంతో డాలర్‌ను విడుదల చేసిన అమెరికా మింట్ 3

కాపునేత ముద్రగడకు కన్నీటి వీడ్కోలు 7


# 'ఫ్యూచర్'లో అమెజాన్

## 2047కు 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

### కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్

### 'ఇవి'ల రిజిస్ట్రేషన్‌లో జీరో టాక్స్

**ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన సిఎం రేవంత్**



బుధవారం ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 15:** ఫ్యూచర్ సిటీలో అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 2047 కల్లా 3 ట్రిలియన్ ఎకానమీకి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. భారత జీడీపీకి 10శాతం అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. నగరంలో ఉన్న పరిశ్రమలను బయటకు తరలిస్తామన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టామని, డీజిల్ నుంచి ఈవీలుగా బస్సులను మారుస్తామని వెల్లడించారు. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నామని అన్నారు. ఫార్చ్యూన్ కంపెనీలకు హబ్‌గా

>>2



# 'సర్' 10 రోజులు పెంపు

**ఆగస్టు 3 దాకా ఇంటింటి సర్వే**

**అక్టోబరు 12న తుది ఓటరు జాబితా: ఇసి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 15:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రస్తుతం తెలంగాణలో కొనసాగు తోంది. జులై 24వ తేదీవరకు ఎన్యూమరేషన్ పత్రాన్ని సంబంధిత బీఎల్‌వోలకు ఇవ్వాలని ఎన్నికల సంఘం ఇదివంకే తెలిపింది. అయితే

>>2

# ఇక వానలే..

**13 రాష్ట్రాల్లో భారీ వర్షాలు**

**తెలంగాణలోనూ చురుకుగా రుతుపవనాలు**

**వాతావరణ శాఖ అంచనా**



**న్యూఢిల్లీ, జూలై 15:** పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన వాతావరణ వ్యవస్థ ప్రస్తుతం బంగాళాఖాతం వైపు పయనిస్తున్నట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో ఇటీవల బలహీనపడిన నైరుతి రుతుపవనాలు మళ్లీ చురుకుగా మారే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. బంగాళాఖాతంలో సముద్రపు గాలులు బలపడటంతో దట్టమైన మేఘాలు ఏర్పడి, రానున్న రెండు మూడు రోజుల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ అల్పపీడనం క్రమంగా ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల వైపు కదులుతూ తూర్పు భారతదేశంలో విస్తృత వర్షాలకు కారణమవుతుందని అధికారులు పేర్కొన్నారు. జులై మొదటి వారంలో దేశవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసినప్పటికీ, ఆ తర్వాత రుతుపవనాల్లో స్తబ్ధత నెలకొని వర్షపాతం గణనీయంగా తగ్గిపోయింది. ఫలితంగా అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరిగి ఎండ తీవ్రత అధికమైంది. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో చోటుచేసుకుంటున్న తాజా వాతావరణ మార్పులు ఉపశమనం కలిగించే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. నైరుతి రుతుపవనాల్లో మళ్లీ కదలిక ప్రారంభమైన నేపథ్యంలో ఢిల్లీతో సహా 13రాష్ట్రాలు, కేంద్రపాలిత

>>2

# పాలమూరు ఎత్తిపోతలకు 90 టిఎంసిల నీరు సాధిస్తాం

**ఇతర రాష్ట్రాలు, కేంద్రంతో చర్చిస్తున్నాం: ముఖ్యమంత్రి రేవంత్**

**మహబూబ్ నగర్ బ్యూరో, జులై 15, ప్రభాతవార్త:** 2047 నాటికి 3 ట్రిలియన్ ఎకానమీ సాధించడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా, దివిటిపల్లి సమీపంలోని అమరరాజా గిగా కారిడార్

>>2


కోస్గి ప్రాజెక్టు కె-100లో 100 మంది రైతులు 3

100 వినూత్న వ్యవసాయ కార్యక్రమాలు




బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రి కుమారస్వామితో భేటీ అయిన మాజీ మంత్రి కెటిఆర్

# ఆదిలాబాద్ సిసిఐని వెంటనే తెరిపించాలి

**కేంద్ర మంత్రి కుమారస్వామితో కెటిఆర్, నేతల భేటీ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై15:** ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ప్లాంట్‌ను పునరుద్ధరించాలని కోరుతూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, జోగురామన్న, రాజ్యసభ బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర నేతృత్వంలో సిసిఐ సాధన సమితి సభ్యుల బృందం బుధవారం ఢిల్లీలో కేంద్రహెవీ ఇండస్ట్రీస్ మంత్రి కుమారస్వామిని కలిసి వినతిపత్రం సమర్పించింది. దాదాపు అరగంటసేపు సాగిన ఈసమావేశంలో ప్లాంట్ పునరుద్ధరణకు ఉన్న అవకాశాలు, ఎదురవుతున్న ఆటంకాలపై క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా కెటిఆర్, నేతలు కేంద్రమంత్రికి వివరిస్తూ, 1980వదశకంలో ఏర్పాటైన ఆదిలాబాద్ సిసిఐ ప్లాంట్ ఒకప్పుడు 6000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పించి ఆ ప్రాంతానికి జీవనాధారంగా నిలిచిందని గుర్తుచేశారు. నేతలవిజ్ఞప్తిపై కేంద్ర మంత్రి కుమారస్వామి సానుకూలంగా స్పందించారని కెటిఆర్ తెలిపారు. సిసిఐ సాధన సమితి చేస్తున్న పోరాటం అభినందనీయమని ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ ప్లాంట్‌ను మళ్లీ నడపాలనే బలమైన కోరికతోనే ఉందని, అందుకోసం ఖచ్చితంగా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. అక్కడ 2300ఎకరాల భూమి అందుబాటులో ఉందని, అందులో 770 ఎకరాలు కంపెనీకి చెందిన పట్టా ల్యాండ్ కాగా, 1500పైచిలుకు ఎకరాలు లీజ్‌ల్యాండ్ రూపంలో ఉందనిపేర్కొన్నారు. ఇక్కడ రూ. 2000 కోట్ల పెట్టుబడితో సరికొత్తఫ్యాక్టరీని పెట్టినట్టయితే చాలా బాగుంటుందని కేంద్ర మంత్రి అభిప్రాయపడ్డారు. కాగా, ఈ ప్లాంట్ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వమే ప్రధాన ఆటంకంగా మారిందని నేతలు ఆరోపించారు.

## ప్రభుత్వ,ప్రైవేట్ భాగస్వామ్యంతో
# నియోజకవర్గాల అభివృద్ధి

**స్పీకర్ ప్రసాద్, ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో అసెంబ్లీ సచివాలయం, ఈక్విప్ సిడిఎక్స్ కుదుర్చుకున్న ఎంఒయు**



హైదరాబాద్‌లో జరిగిన ఎంఒయు కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై15:** నియోజకవర్గాల అభివృద్ధి కోసం కొత్త అడుగులు పడుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర శాసనసభ సచివాలయం, ఈక్విప్ (ఈక్యూయుపిపిపి) సోషల్ ఇంపాక్ట్ టెక్నాలజీస్ లిమిటెడ్ మధ్య (కాన్‌స్టిటెన్సీ డెవలప్‌మెంట్ ఎక్స్‌చేంజ్-సిడిఎక్స్)పై అవగాహన ఒప్పందం జరిగింది. బుధవారం శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ ఎంఒయు కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనసభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్ బాబు, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, కౌన్సిల్ సెక్రటరీ డా. వి.నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, ఈక్విప్ డైరెక్టర్ వింద్యా ధర్మరాజు, ఈక్విప్ ఫౌండర్ లక్ష్మీ నారాయణ, ఐ ల్యాబ్స్ చైర్మన్ శ్రీని రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 119 నియోజకవర్గాల్లో ప్రజల సంక్షేమం కోసం సరికొత్తగా ఈక్విప్ సోషల్ ఇంపాక్ట్ టెక్నాలజీ లిమిటెడ్ సంస్థతో ఎంఒయు జరగడం శుభపరిణామం.ప్రస్తుత రాజకీయాల్లో చాలా మార్పులు వచ్చాయి, చట్టాలు తయారు చేసే ఎమ్మెల్యేలు నియోజకవర్గ స్థాయిలో అన్ని పనులు చేసే భాద్యుడుగా మారారు అని చెప్పారు. ఏ చిన్న సమస్య ఉన్న స్థానిక ఎమ్మెల్యే

>>2

ఫడ్నవిస్‌తో శరద్ పవార్ రహస్య భేటీ 3



# 7 గంటలు హోరాహోరీ

**ఇరాన్‌పై సెంట్‌కామ్ దాడులు**

**పోరు మరింత ఉధృతం**

**సిచ్యుయేషన్‌రూమ్‌లో సీనియర్లతో ట్రంప్ భేటీ**

**వాషింగ్టన్,జులై 15:** శాంతిచర్చలు విఫలమైన నేపథ్యంలో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధకాండ వేగవంతం అవుతోంది. ఖమేనీ అంత్యక్రియల తర్వాత ఇరాన్ వైఖరిలో మార్పులు కనిపిస్తున్నాయి. శత్రువులపై కాలు దువ్వుతున్నట్లుగా కనిపిస్తోంది. శాంతి ఒప్పందం పేరుతో చర్చలు జరుపుతున్నా దాడులకు మాత్రం ఏ మాత్రం వెనకాడడం లేదు. ఇరు పక్షాలు కూడా పరస్పర దాడులకు దిగుతున్నాయి.దీంతో మధ్య ప్రాచ్యం మరోసారి అట్టుడుకుతోంది.గత రాత్రి ఇరాన్‌లోని ప్రధాన లక్ష్యాలపై అమెరికా ఏడు గంటల పాటు భీకర దాడులు చేసింది. ఇప్పుడు మరోసారి అత్యంత భీకర స్థాయిలో దాడులు చేసేందుకు అమెరికా సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోని అత్యంత భద్రత కలిగిన సిచ్యుయేషన్ రూమ్‌లో అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఇరాన్‌కు భారీ నష్టం కలిగించి, హార్ముజ్ జలసంధిని తిరిగి

>>2

# పాత యూనిఫాంతోనే పాఠశాలకు!

**కొత్త దుస్తులకోసం ఆగస్టుదాకా ఆగాలట!**

**ఈ నెలలో రెసిడెన్షియల్ స్కూళ్లకు అందే అవకాశం**



**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 15:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ ఆచరణలో అది అంతగా కనిపించడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 15న పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేయలేదు. పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు కావస్తోంది.. కానీ ఇప్పటి వరకు విద్యార్థులకు ఒక్క జత కూడా యూనిఫామ్ ఇవ్వలేదు. కొత్త యూనిఫామ్స్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు పాత యూనిఫామ్స్‌తోనే పాఠశాలలకు వస్తున్నారు. యూనిఫామ్స్ లేని వారు మాత్రం సివిల్ డ్రస్ ఈ ఏడాది రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల స్కూల్స్‌కి యూనిఫామ్స్ అందించడానికి సెంట్రలైజ్డ్ టెండర్ల ద్వారా యూనిఫామ్స్ గుడ్డను సేకరించాలని భావించిన నేపథ్యంలో టెండర్లను ఖరారు చేయడంలో ఆలస్యమైంది. టెండర్లలో ఆలస్యం కావడంతో యూనిఫామ్స్ కుట్టించి విద్యార్థులకు ఇవ్వడంలోనూ ఆలస్యం అవుతోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో యూనిఫామ్స్ అందజేయడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. శనివారం రెవిన్యూశాఖ మంత్రి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సందర్భంగా సెర్ప్ సీఈవో విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేయడంపై మాట్లాడారు. వారు మాట్లాడిన సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థుల యూనిఫాంలన్నీ స్వయం సహాయక

>>2

## యువకుడి ప్రాణం తీసిన
# కులాంతర ప్రేమ!

**మాదాపూర్ ఐటి కారిడార్‌లో దారుణ హత్య**

**కుమార్తెను వేధిస్తున్న యువకుని కత్తులతో పొడిచి హత్య చేసిన తండ్రి**

**పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు**

**పరువు హత్యేనని మృతుని బంధువుల ఆరోపణ**



భాస్కర్ (ఫైల్)

**సైబరాబాద్ ప్రతినిధి / వర్ధన్నపేట, జులై 15 ప్రభాతవార్త:** మాదాపూర్ ఐటీ కారిడార్ పరిధిలో అర్ధరాత్రి దారుణ హత్య జరిగింది. తన కుమార్తెను వేధింపులకు గురిచేస్తున్నాడని కక్ష పెంచుకున్న ఓ తండ్రి తన బావమరిది, మరో ముగ్గురితో కలిసి ఓ యువకుడిని కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్‌జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన పినపల్లి రాములు, సోమక్క దంపతుల చిన్న కుమారుడు పినపల్లి భాస్కర్(32) గత 8 సంవత్సరాల క్రితం బ్రతుకుదెరువు

>>2



5

# సెమికాన్ 2.0కు గ్రీన్‌సిగ్నల్

**రూ.1.28 లక్షల కోట్లు కేటాయింపు**

**ఫోన్ల తయారీకి రూ.62,500 కోట్లు**

**రైల్వే విస్తరణ, ఎరువుల ఉత్పత్తి తదితర 7 కీలకప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ ఆమోదం: వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్**



# బోనాల జాతర

**16, 19, 23, 26 తేదీల్లో గోల్కొండ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు**

## హైదరాబాద్‌లో నేటి నుంచి మొదలు

**హైదరాబాద్, జులై 15, ప్రభాతవార్త:** నగరంలోని గోల్కొండ కోటలో గల ప్రసిద్ధ జగదాంబ అమ్మవారి బోనాల వేడుకలు గురువారం నుంచి మొదలుకానున్నాయి. ఈ సందర్భంగా గోల్కొండ పరిధిలో గల పలు మార్గాలలో ఈ నెల 16, 19, 23, 26వ తేదీల్లో ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ సిటీ ట్రాఫిక్ చీఫ్ జోయల్ డేవిస్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రాందేవ్‌గూడ నుంచి మక్కయ్ దర్వాజ మీదుగా గోల్కొండ కోట వరకు, లంగర్ హౌజ్ నుంచి ఫతే దర్వాజ మీదుగా గోల్కొండ కోట వరకు, షేక్‌పేట్ నాలా నుంచి బంజారా దర్వాజ మీదుగా గోల్కొండ కోట వరకు గల మార్గాలలో ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమయంలో ఈ మార్గాలలో ప్రయాణించే

>>2




బుధవారం న్యూఢిల్లీలో ఐసిఎఆర్ టెక్నాలజీ పోర్ట్‌ఫోలియో ఫర్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కాంక్లేవ్ 2026ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

# ఇక వానలే..

>> ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) హెచ్చరించింది. ఉత్తర, తూర్పు భారతదేశంపై రుతుపవన వ్యవస్థలు బలపడుతున్నందున, రాబోయే కొద్ది రోజులలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు వీస్తాయని ఐఎమ్‌డి హెచ్చరించింది. ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, బీహార్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, పంజాబ్, హర్యానా, జమ్మూ, కాశ్మీర్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో గంటకు 50-70 కిలోమీటర్ల వేగంతో గాలులతో కూడిన భారీ వర్షాలు, అప్పుడప్పుడు మెరుపులు సంభవించే అవకాశం ఉంది. భారీ వర్షాల వల్ల హిమాలయ ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు సంభవించవచ్చు. అలాగే హిమాలయ రాష్ట్రాలలోని లోతట్టు పట్టణ కేంద్రాలలో నీరు నిలిచిపోయే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఐఎండి అంచనా ప్రకారం, జులై 20 వరకు చురుకైన రుతుపవన దశలో అనేక ఉత్తర, తూర్పు, మధ్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యంగా ఉత్తర తెలంగాణ, పశ్చిమ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం అక్కడక్కడ పారంభమైన వర్షాలు గురువారం నాటికి మరింత జోరందుకుని జులై 19 వరకు కొనసాగవచ్చని అంచనా వేశారు. అయితే రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మరో వారం రోజుల పాటు గణనీయమైన వర్షాలు కురిసే సూచనలు కనిపించడం లేదని కూడా అధికారులు పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులతో ఎండలు మళ్లీ వేసవిని తలపిస్తున్నాయి. దీంతో కొద్దిరోజులుగా వినియోగం తగ్గిన కూలర్లు, ఫ్యాన్లు మళ్లీ పూర్తి స్థాయిలో వినియోగంలోకి వస్తున్నాయి.

## పాత యూనిఫాంతోనే పాఠశాలకు!

>> సంఘాల మహిళా టైలర్ల ద్వారానే కుట్టిస్తున్నామని, టెండర్ ఆలస్యంతో వస్త్రం ఆలస్యంగా వచ్చినప్పటికీ జూలై 15లోపు రెసిడెన్షియల్ బాలికలకు, జూలై 30లోపు బాలురకు యూనిఫాంలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని ప్రతివిద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా కలెక్టర్లు, డీఆర్‌డీఏ, గురుకులాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. దీన్నిబట్టి చూస్తే రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యూనిఫామ్స్ రావడానికి చాలా సమయంపట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఫస్ట్ ప్రయారిటీలో రెసిడెన్షియల్ విద్యార్థులకు అందజేసిన అనంతరం ఇతర విద్యార్థులకు ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. యూనిఫామ్స్‌కి సంబంధించిన బట్ట వచ్చినప్పటికీ వాటిని కుట్టించడానికి స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)కి ఇచ్చి కుట్టించాల్సి ఉంటుంది. కాబట్టి యూనిఫామ్స్ కోసం వచ్చిన బట్టను ఎస్‌హెచ్‌జీలకు అందజేసినట్టు తెలుస్తోంది.

వారు యూనిఫామ్స్ కుట్టిన తరువాత వాటిని విద్యార్థులకు సరఫరా చేయనున్నారు. రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల స్కూల్స్‌లో కలిపి సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాం అందించేందుకుగాను 2.97 కోట్ల మీటర్ల వస్త్రాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో మఫత్‌లాల్ కంపెనీ 2.41 కోట్ల మీటర్లను, తెలంగాణ రాష్ట్ర చేనేత కార్మికుల సహకార సంఘం (టెస్కో) 55.32 లక్షల మీటర్లను సరఫరా చేస్తున్నాయి. స్థానిక చేనేత కార్మికులను, ప్రభుత్వ రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ ఆర్డర్లలో ప్రాధాన్యత ఇచ్చింది. మొత్తం యూనిఫాం బెడ్డింగ్ ఆర్డర్లలో 25 నుంచి 30 శాతం వరకు రాష్ట్ర చేనేత కార్మికుల సహకార సంఘానికి అప్పగించారు. ఇందులో 56 లక్షల మీటర్ల యూనిఫాం వస్త్రంతో పాటు, 6.5 లక్షల దుప్పట్లు, 3 లక్షల బెడ్‌షీట్లు, 2.29 లక్షల కార్పెట్లు ఉన్నాయి. అలాగే విద్యార్థులకు అవసరమైన టైలు, బెల్టులు, ఐడీ కార్డుల తయారీ ఆర్డర్‌ను తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్‌కు కేటాయించారు. ఈ విద్యా సంవత్సరం 2026-27 నుంచి విద్యార్థుల యూనిఫాం రంగుల్లో మార్పులు చేశారు. డే స్కాలర్స్‌కు టాప్ లైట్ బ్లూ, లోయర్ డార్క్ బ్లూ రంగుల్లో యూనిఫాంలు ఉంటాయి. అలాగే గురుకులాల్లోని విద్యార్థులకు టాప్‌లో మెరూన్ చెక్, లోయర్ మెరూన్ రంగుల డ్రెస్‌లను కేటాయించారు. ఈ యూనిఫాంల కుట్టు పని బాధ్యతను పూర్తిగా మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. వారు రోజుకు 75 వేల నుంచి లక్ష యూనిఫాంలు కుట్టే సామర్థ్యం కలిగి ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఒక్కో యూనిఫామ్ కుట్టడానికి రూ. 75 చొప్పున ప్రభుత్వం చెల్లించనుంది.

## నియోజకవర్గాల అభివృద్ధి

>> పైన ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో నియోజకవర్గాల అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ప్రైవేట్ సంస్థలు కూడా అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యం కావాలని కోరుతున్నామన్నారు. ఈక్విప్ సంస్థ తీసుకువచ్చిన కాన్స్టిటెన్సీ డవలప్‌మెంట్ ఎక్స్‌చేంజ్(సిడిఎక్స్) అనే కార్యక్రమం విజయవంతం అవుతుందని ఆశిస్తున్నాం. ఈ ఎంఓయు చారిత్రాత్మక ఘట్టం అవుతుందని గర్విస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటుగా ప్రవేటు రంగం, పౌర సమాజం, విద్యా సంస్థలు, దాతలను, ఎన్‌జిఓలను,సిఎస్ఆర్ నిధులను సమీకరించి వారిని అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో విప్లవాత్మకమైన ఫలితాలను సాదించవచ్చునని చెప్పారు.

తెలంగాణ రాష్ట్ర శాసనసభ సచివాలయం, ఈక్విప్ సంస్థల మధ్య కుదుర్చుకున్న ఎంఓయు అనేది భవిష్యత్తులో నూతన ఆవిష్కరణలు, సహకారం, పౌర భాగస్వామ్యం ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలలో అభివృద్ధికి ఒక మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిధుల అవసరం లేకుండా నియోజకవర్గాల వారిగా అభివృద్ధికి ఒక వేదికగా ఈక్విప్ సంస్థ నూతన ఆలోచనతో ముందుకు రావడం సంతోషం అని చెప్పారు. ఇలాంటి నూతన ఆలోచనలతో క్షేత్ర స్థాయిలో ఇబ్బందులను గుర్తించడంతో పాటుగా, స్థానికంగా ఉన్న అవకాశాలను, రిసోర్స్‌లను పారిశ్రామిక స్థాయిలో అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు సృష్టించడంతో పాటుగా ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించవచ్చునని చెప్పారు. నియోజకవర్గాల వారిగా రూట్ మ్యాప్ రూపొందించుకుని పనిచేయడం ద్వారా రాష్ట్రం, దేశం కూడా అభివృద్ధి చెందుతుంది ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రభుత్వం తరుపున అన్ని విదాలుగా సహకారం అందిస్తామన్నారు.

## 10 రోజులు పెంపు

>> ఎన్యుమరేషన్ పత్రాలు ఓటర్లు సబ్మిట్ చేయడంలో ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పెంచుతూ ఎన్నికల సంఘం బుధవారం నిర్ణయం తీసుకుంది. సవరించిన షెడ్యూల్ ప్రకారం, బీఎల్వోలు ఇంటింటి సర్వేను ఆగస్టు 3 వరకు నిర్వహించనున్నారు. కాగా, సర్ గడువును పొడిగించాలంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విజ్ఞప్తి చేసింది. దీంతో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం సవరించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి (సీఈఓ) కేంద్ర ఎన్నికల సంఘం లేఖ పంపింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం, బీఎల్వోలు ఇంటింటి సర్వేను ఆగస్టు 3 వరకు నిర్వహించనున్నారు. ఆగస్టు 10న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తారు. అదే రోజు నుంచి సెప్టెంబర్ 9 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరించనున్నారు. వాటి పరిష్కార ప్రక్రియ అక్టోబర్ 8 వరకు కొనసాగుతుంది. అనంతరం అక్టోబర్ 12న తుది ఓటరు జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. ఈ సవరించిన షెడ్యూల్‌ను అధికారులు, రాజకీయ పార్టీలకు తెలియజేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

## బోనాల జాతర

>> సాధారణ వాహనదారులు వేరే మార్గాలను ఎంచుకోవాలని ఆయన కోరారు. ఇదిలావుండగా గోల్కొండ కోటలో గల జగదాంబ అమ్మవారి బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులు, సందర్శకుల కోసం సిటీ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేకంగా పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి వివరాలు ఇలావున్నాయి. రాందేవ్‌గూడ నుంచి మక్కయ్ దర్వాజ మీదుగా గోల్కొండ కోట వరకు వచ్చే భక్తులు తమ వాహనాలను ఎటిసి కేంద్రం (మిలటరీ గ్రౌండ్) వద్ద నిలపాల్సి వుంటుంది. లంగర్ హౌజ్ నుంచి ఫతే దర్వాజ మీదుగా గోల్కొండ కోట వరకు వచ్చే భక్తులు తమ వాహనాలను రాందేవ్‌గూడ వద్ద గల ఎటిసి కేంద్రం (మిలటరీ గ్రౌండ్) వద్ద నిలపాల్సి వుంటుంది. ఈ మార్గంలో వచ్చే టూ, త్రి వీలర్లను అనుమతిస్తారు. షేక్‌పేట్ నాలా నుంచి బంజారా దర్వాజ మీదుగా గోల్కొండ కోట వరకు భకు _లు తమ ద్విచక్ర వాహనాల ఇదే ప్రాంతంలోని గోల్ఫ్ కోర్టులో, ఇతర వాహనాలను డెక్కన్ పార్క్‌లో నిలపాల్సి వుంటుంది. కాగా భక్తులతో పా టు వేడుకలు చూసేందుకు వచ్చే వారు తమ వాహనాలను పోలీసులు సూచించిన ప్రాంతాలలోనే నిలపాలని సిటీ ట్రాఫిక్ చీఫ్ జోయల్ డేవిస్ కోరారు. ట్రాఫిక్‌కు సంబంధించి సమస్యలు తలెత్తితే 9010203626 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

### వారం - వర్జ్యం

16-07-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పునర్వసు కార్తె
విదియ ఉ.8.55
ఆశ్లేష రా.7.57
వర్జ్యం : ఉ.9.38-ఉ.11.06
దు.ఉ.10.02-ఉ.10.54, 2) మ.3.15-సా.4.07
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - ఉ.10.30-12.00

### వార్తాఫలం

**మేషం:** చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తి చేసుకుంటారు. ఆస్తి వివాదాలు తీరుతాయి. కొత్త కాంట్రాక్టులు లాభిస్తాయి.

**వృషభం:** స్త్రీలవలన చిక్కు సమస్యలు ఏర్పడతాయి. రాజకీయ పరపతి పెరుగుతుంది. కీళ్ళబాధలు కలుగుతాయి.

**మిథునం:** దూరప్రాంత ప్రయాణాలలో వస్తు భద్రత వల్ల విశేష జాగ్రత్తలు పాటించండి. పోటీపరీక్షలలో పాల్గొంటారు.

**కర్కాటకం:** ఉద్యోగులకు పదోన్నతులు పొందుతారు. సంతాన విషయమై ప్రత్యేకమైన శ్రద్ధను కనబరుస్తారు.

**సింహం:** కాలానుగుణంగా పరిస్థితులను మార్చుకోగలుగుతారు. అనుకూలాంశాలు ఉంటాయి. స్పెక్యులేషన్ లాభించదు.

**కన్య :** చిన్ననాటి మిత్రుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. భూ వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందుతారు.

**తుల:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఇతరుల విషయంలో జోక్యంవద్దు. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**వృశ్చికం:** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆ పరిచయా లను మీకు అనుకూలంగా మార్చుకుంటారు.

**ధనుస్సు:** నైపుణ్యంతో ప్రతిభతో మెదడుకు పదునుపెట్టి వ్యాపారంలో రావలసిన నష్టముల నుండి తప్పుకోగలుగుతారు.

**మకరం:** ఉత్తర ప్రత్యుత్తరములకు, ప్రకటనలకు, పత్రికలవారితో సంబంధ బాంధవ్యాలు పెంచుకొనుటకు అనుకూలం.

**కుంభం:** రావలసిన బాకీలు కొంత ఆలస్యంగా అందుతాయి. ఇతరులకు మీరు ఇచ్చే సలహాలు వారికి ఎంతో ఉపకరిస్తాయి.

**మీనం:** గృహోపకరణాలకు, సౌందర్య సాధన సామాగ్రికి అధికంగా ఖర్చుచేస్తారు. మనస్సు మారుమూలలోని ఆశ నెరవేరేట్లు తోస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోటి, హైదరాబాద్

# 'ఫ్యూచర్'లో అమెజాన్

>> హైదరాబాద్ మారనుందని, ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన నగరాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని, పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు రూపొందించామని తెలిపారు. పాలసీలపై ఎప్పటికప్పుడు రివ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీకి అమెజాన్ డేటా సెంటర్ స్టెప్పింగ్ స్టోన్‌గా ఉంటుందన్నారు. ఫ్యూచర్ సిటీకి రాబోయే రోజుల్లో మరిన్ని పెట్టుబడులు రానున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అమెజాన్ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమం ఫ్యూచర్ సిటీకి వచ్చే పెట్టుబడులు, పరిశ్రమలకు మంచి ప్రోత్సాహకంగా ఉపయోగపడనుందని చెప్పారు.

ఫ్యూచర్ సిటీలో అత్యంత అధునాతనమైన నగరాన్ని నిర్మించాలని, ఫార్చ్యూన్500 కంపెనీల పెట్టుబడులను ఆకర్షించడానికి 2025 డిసెంబర్ లో తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్ ను నిర్వహించాం,108 దేశాల నుంచి మూడు వేల మంది వివిధ దిగ్గజ కంపెనీల నుంచి కార్పొరేట్ ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే "తెలంగాణ రైజింగ్2047" లక్ష్యం అని చెప్పారు. వికసిత భారత్ 2047 లక్ష్యం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ గా భారత్ ను నిలపాలన్న లక్ష్యంలో భాగంగా జాతీయ జీడీపీలో తెలంగాణ తన వాటాను ప్రస్తుతం ఉన్న 5 శాతం నుంచి 10 శాతానికి పెంచుకోవాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు.

ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి పెట్టుబడులు, ఉద్యోగ కల్పన కీలకం.. ఇందులో భాగంగా, పరిశ్రమల కల్పనకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, సౌకర్యాలు, అనుమతులను ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

2034 నాటికి అమెజాన్ సంస్థ లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టాలి

ప్రతి నెలా పరిశ్రమల స్థాపనకు సంబంధించి అన్ని అంశాలపై సమగ్ర రివ్యూ నిర్వహిస్తున్నామని చెప్పారు. అమెజాన్ సంస్థ పెట్టుబడులకు సంబంధించి ప్రతి నెలా ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి కి నమూనాగా నిలపాలనే ఆలోచనతో తెలంగాణ రైజింగ్ పాలసీ విధానాన్ని, పరిశ్రమలు, పర్యాటకం, ఎనర్జీ, ఆరోగ్యం, స్పోర్ట్స్ లాంటి రంగాల్లో నిర్దిష్టమైన పాలసీలు రూపొందించుకున్నామని చెప్పారు.

ద్యోగ కల్పన కోసం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ను ఏర్పాటు చేసుకున్నామన్నారు. అమెజాన్ లాంటి సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తే ఆ ప్రాంతాల్లో ఇతర కంపెనీలు, పరిశ్రమల ఏర్పాటుకు దోహద పడుతుందన్నారు. హైదరాబాద్ నగరంలో ఔటర్ రింగ్ రోడ్డు, ఐటీ, ఫార్మా కంపెనీలు, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌తో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల 1.34 కోట్ల మంది నివసిస్తున్నారు.. ఉద్యోగ అవకాశాలు కల్పించడం తోపాటు కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలి.

నగరంలో ఉన్న పరిశ్రమలను తరలించే అవసరం ఉందన్నారు. మూసి నది ప్రక్షాళన, మెట్రో రైలు విస్తరించడం అవసరం ఉందన్నారు. మూడు లక్షల ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులు గా మార్చడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.. నగరంలో డీజిల్ మీద ఆధార పడి నడుస్తున్న 2 లక్షల ఆటోలను రెట్రో ఫిట్టింగ్ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల రిజిస్ట్రేషన్ కు టాక్స్ ను పూర్తిగా మినహాయించి హైదరాబాద్ ను కాలుష్య రహితంగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఏడాదికి రూ 1,500 కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోయినప్పటికీ ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

దేశంలో ఇతర నగరాల్లో ఉన్న కాలుష్య సంబంధిత సమస్యలను హైదరాబాద్‌లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా రాష్ట్రాన్ని విభజించాం.. సమగ్ర ప్రణాళికతో అభివృద్ధిలో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ ప్రాంత రైతులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల కోస భూములను త్యాగం చేసిన రైతులను ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటుందన్నారు.

భవిష్యత్ తరాలకు ఒక అద్భుతమైన నగరాన్ని నిర్మించడానికి ముందుకు వచ్చి సహకరించిన వారిని అభినందిస్తున్నట్లు ప్రకటించారు. చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుకుంటూ అవసరమైన నష్ట పరిహారాన్ని అందించాలని అధికారులకు ఆదేశాలిస్తున్నానని చెప్పారు. భూమి ఇచ్చి అభివృద్ధికి సహకరించిన రైతులను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది, ఆందోళనలు చేపడుతున్న రైతులతో చర్చించాలని మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే కె లక్ష్మారెడ్డికి సూచిస్తున్నానని తెలిపారు. భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు ఉపాధి అవకాశాలను కల్పించాలి,మంచి నష్ట పరిహారాన్ని అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఫ్యూచర్ సిటీలో 202 ఎకరాల్లో డేటా సెంటర్ ను అమెజాన్ నిర్మించనుంది. 12 సంవత్సరాల్లో దీని కోసం అమెజాన్ రూ.60 వేల కోట్లు వెచ్చించనుంది. చందనవెల్లిలో మరో 98 ఎకరాలను అమెజాన్‌కు తెలంగాణ ప్రభుత్వం కేటాయించింది. అతి పెద్ద హైపర్ స్కేల్ డేటా సెంటర్ గా దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇది హైదరాబాద్‌లో అమెజాన్ రెండో క్లౌడ్ రీజియన్‌గా ఏర్పాటు కానుంది.

# 90 టిఎంసిల నీరు సాధిస్తాం

>> ప్రాజెక్టులో భాగంగా అమరరాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్‌లో నూతనంగా నిర్మించిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ ( సి క్యు పి )ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరరాజా ప్రపంచస్థాయి సంస్థగా ఎదిగి చైనా, జపాన్, జర్మనీ, దకిణ కొరియా వంటి దేశాల కంపెనీలతో పోటీపడుతున్నదని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో భారత్ ప్రపంచస్థాయిలో ఎదగాలంటే అమరరాజా వంటి సాంకేతిక సంస్థలను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. వాతావరణ మార్పులు, కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం కీలకమని, వాటికి అవసరమైన అత్యాధునిక ఈవీ బ్యాటరీల తయారీలో తెలంగాణ ప్రధాన కేంద్రంగా అవతరిస్తోందని అన్నారు. మహబూబ్‌నగర్‌లో 32 గిగావాట్ గంటల (జిడబ్ల్యుహెచ్) సామర్థ్యంతో అమరరాజా కంపెనీలో ఏర్పాటు చేస్తున్న ఆధునిక ఈవీ బ్యాటరీ తయారీ యూనిట్ రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో కీలక మైలురాయిగా అభివర్ణించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ 2047 పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా అమర్ రాజా కంపెనీ 32 గిగావాట్ల ప్లాంటును ప్రారంభించుకోవడం ఒక నిదర్శనమని అన్నారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధించే లక్ష్యంగా ఎనర్జీ లక్ష్యాన్ని చేపట్టడం జరిగిందని, విద్యుత్ పరిశ్రమలే కాకుండా, ఎనర్జీ పరిశ్రమలు తీసుకురానున్నమని, క్లీన్ గ్రీన్ ఎనర్జీ పాలసీ తీసుకురానున్నట్లు మంత్రి తెలిపారు. 2031 నాటికి ఈవి బ్యాటరీల వినియోగం నాలుగు రెట్లు పెరిగే అవకాశం ఉందని, ప్రస్తుతం ప్రతి ఒక్కరు గ్రీన్ ఎనర్జీ వైపు చూస్తున్నారని, బ్యాటరీ తయారీలో తెలంగాణ అద్భుతంగా ఉందని ,2023లో 6.8 గా ఉన్న పరిశ్రమల అభివృద్ధి 2026 నాటికి 8.1% చేరుకున్నామని, 2034 నాటికి 13 చేరుకునేలా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు డీ.కే అరుణ మాట్లాడుతూ అమర రాజా వంటి కంపెనీ మహబూబ్‌నగర్ ప్రాంతంలో ఉండడం ఈ ప్రాంతాలవాసుల అదృష్టం అని అన్నారు. ప్రస్తుతం మనం విదేశాల నుండి ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నామని, మన డబ్బు విదేశాలకు పోకుండా మనమే అభివృద్ధి చేసుకునేలా ప్రధాన మంత్రి ఆలోచిస్తున్నారని తెలిపారు. అమర రాజా కంపెనీ సీఎండీ గల్లా జయదేవ్, విక్రమాదిత్య లు మాట్లాడారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్ ,యువజన క్రీడల సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి, షాద్‌నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్, అచ్చంపేట శాసనసభ్యులు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు రాజేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 18 రోజులుగా నిరాహార దీక్ష కొనసాగిస్తున్న వాంగ్‌చుక్

# 7 గంటలు హోరాహోరీ

>> తెరవడంతో పాటు అణు కార్యక్రమాన్ని నిలిపివేయాలనే అమెరికా డిమాండ్‌ను అంగీకరించేలా ఒత్తిడి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా చర్చలు జరిగినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. సిచ్యుయేషన్ రూమ్ సమావేశానికి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రుబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్, సీఐఏ డైరెక్టర్ జాన్ ర్యాట్‌క్లిఫ్, వైట్‌హౌస్ ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ సహా పలువురు కీలక అధికారులు హాజరైనట్లు సమాచారం. ఈ సమావేశంలో ఇరాన్‌లోని వ్యూహాత్మక లక్ష్యాలపై తీవ్ర స్థాయి దాడులకు కార్యాచరణ రూపొందించినట్లు తెలుస్తోంది. దీంతో రాబోయే రోజుల్లో యుద్ధం మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. యుఎస్ మీడియా ఆక్సియోస్ ప్రస్తుతం అమెరికా లక్ష్యం హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై దాడులు చేసే ఇరాన్ సామర్థ్యాన్ని తీవ్రంగా బలహీనపరిచేలా కీలక లక్ష్యాలపై భారీ దాడులు నిర్వహించడం టార్గెట్‌గా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందం విఫలమైన తర్వాత ఇరాన్ మళ్లీ దాడులు ప్రారంభించింది. జోర్డాన్, కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ తాజా క్షిపణి దాడులు జరిపింది. దీనికి ప్రతిస్పందనగా అమెరికా మంగళవారం మధ్యాహ్నం నుంచి ఇరాన్ నౌకాశ్రయాలపై నౌకాదళ దిగ్బంధం అమలు ప్రారంభించింది. ఈ పరిణామంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత దిగజారిపోయాయి. ఇక సమావేశానికి ముందుమీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ ఇరాన్‌పై వరుస దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ రాత్రి తీవ్రంగా దాడి చేస్తాం రేపు ఇంకా తీవ్రంగా దాడి చేస్తాం ఆ తర్వాతి రోజు కూడా అదే కొనసాగుతుంది. వచ్చే వారం పరిస్థితి ఇరాన్‌కు మరింత కఠినంగా మారుతుంది, అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, వంతెనలు వంటి కీలక మౌలిక సదుపాయాలపై అమెరికా దాడులు కేంద్రీకృతమవుతాయని తెలిపారు. ఇరాన్ చర్చల బల్లపైకి వచ్చే వరకు ఈ దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అమెరికా ప్రతినిధులు ఇప్పటికే ఇరాన్ అధికారులతో సంప్రదింపులు జరిపారని, ఒప్పందం చేసుకోండి లేకపోతే మీ దగ్గర ఏమీ మిగలదని హెచ్చరించినట్లు ట్రంప్ వెల్లడించారు. ప్రపంచ చమురు, సహజ వాయు రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిపై ఆధిపత్యం కోసం ఇరాన్‌అమెరికా మధ్య పోటీ మరింత తీవ్రరూపం దాల్చడంతో పశ్చిమాసియా మరోసారి పూర్తి స్థాయి యుద్ధం దిశగా వెళ్తుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా ఈ ఏడాది ఏప్రిల్‌లో హార్ముజ్ జలసంధిపై మొదటిసారి దిగ్బంధం అమలు చేసి అనంతరం తాత్కాలిక అణు చర్చల ఒప్పందం తర్వాత జూన్‌లో ఎత్తివేసింది. అయితే చర్చలు నిలిచిపోవడం, జలసంధి ప్రాంతంలో మళ్లీ ఘర్షణలు పెరగడంతో తాజా దిగ్బంధాన్ని మరోసారి అమల్లోకి తీసుకొచ్చింది.

# యువకుడి ప్రాణం తీసిన కులాంతర ప్రేమ!

>> నగరానికి వచ్చాడు. గతంలో ట్రిపుల్‌ఐటి క్యాంటీన్‌లో కుక్‌గా పనిచేసిన భాస్కర్ రెండు సంవత్సరాలుగా మాదాపూర్‌లోని శ్రీ సూట్స్ హోటల్‌లో చెఫ్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఇదే గ్రామానికి చెందిన రాజు పెద్దకుమార్తెతో భాస్కర్‌కు 2020లో పరిచయం ఏర్పడింది. ఇద్దరు తరచూ ఛాటింగ్ చేసుకోవడంతో పాటు ఫోన్లు చేసుకునే వారు. విషయం తెలిసిన పెద్దలు రాజు కుమార్తెను, భాస్కర్‌ను హెచ్చరించారు. కాగా భాస్కర్ తీరు మార్చుకోకుండా తరచూ ఫోన్లు చేస్తుండడంతో రాజు తన కుమార్తెను భాస్కర్ వేధిస్తున్నాడంటూ పర్వతగిరి, వర్ధన్నపేట పోలీస్ స్టేషన్లలో పిర్యాదు చేశాడు. 2021లో హన్మకొండ షీటీంకు సైతం పిర్యాదు చేయగా, పోలీసులు భాస్కర్‌కు కౌన్సిలింగ్ ఇచ్చారు. కాగా 2023లో రాజు తన పెద్దకుమార్తెను ఖాజీపేటకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి ఇచ్చి వివాహం జరిపించాడు. వివాహం అనంతరం రాజు కుమార్తెకు మెసేజ్‌లు చేసిన భాస్కర్ వాటిని స్క్రీన్ షాట్ తీసి ఆమె భర్తకు పంపించాడు. ఈ విషయమై రాజు కుమార్తె, అల్లుడి మధ్య గొడవ జరుగడంతో కుమార్తె పుట్టింటికి వచ్చింది. ఇదే గొడవల నేపథ్యంలో గత నెలరోజుల క్రితం ఇద్దరు విడాకులు తీసుకున్నారు. కాగా భర్తతో విడిపోయిన రాజు పెద్దకుమార్తె యుపిపిఎస్సీ పరీక్షల కోర్సు చదివేందుకు భేగంపేటలో ఉంటున్న తన చెల్లెలు వద్దకు వచ్చింది. రాజు పెద్దకుమార్తె నగరానికి వచ్చిందని తెలుసుకున్న భాస్కర్ మరోసారి వేధింపులు ప్రారంభించాడు. రాజు పెద్దకుమార్తెను ఉద్దేశించి అసభ్యకరమైన మెసేజ్‌ను చిన్నకుమార్తెకు పంపించాడు. దీంతో పాటు చిన్న కుమార్తె ఫోటోలతో సోషల్ మీడియాలో నకిలీ ఐడీ చేసి మార్ఫింగ్ ఫోటోలతో వేధించసాగాడు. భాస్కర్ వేధింపులపై ఇద్దరు కుమార్తెలు రాజుకు చెప్పారు. దీంతో తన కుమార్తెలను వేధిస్తున్న భాస్కర్ మీద కక్ష్య పెంచుకున్న రాజు ఎలాగైనా భాస్కర్‌ను అంతమొందించాలని పథకం వేశాడు. భాస్కర్ పనిచేస్తున్న అడ్రస్ తెలుసుకున్న రాజు మంగళవారం ఓ కారులో తన బావమరిది కుమారస్వామి, మరో ముగ్గురితో కలిసి మాదాపూర్‌కు వచ్చారు. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో కుమారస్వామి, ఇతరులు హోటల్ లోపలికి వెళ్లి భాస్కర్‌తో మాట్లాడేది ఉందంటూ బయటకు తీసుకువచ్చారు. భాస్కర్ హోటల్ బయలకు వచ్చిన వెంటనే తమ వెంట తెచ్చుకున్న కత్తులు, కర్రలతో రాజు, కుమారస్వామి, మరో ముగ్గురు దాడి చేశారు.

భాస్కర్ మీద మూకుమ్మడిగా దాడి చేసి కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని అసస్మారక స్థితిలో ఉన్న భాస్కర్‌ను కొండాపూర్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మ ృతిచెందినట్లు డాక్టర్లు ద ృవీకరించారు. ఈమేరకు భాస్కర్ మ ృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి మ ృతుడి సోదరుడు ఇచ్చిన పిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ, హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హత్యకు పాల్పడిన రాజు, అతని బావమరిది కుమారస్వామి, మరో వ్యక్తిని మాదాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. కాగా భాస్కర్‌ది పరువు హత్య అని, రాజు పెద్దకుమార్తె, భాస్కర్‌లు ప్రేమించుకున్నారని మ ృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. తక్కువ కులం కావడంతో పెళ్లికి ఒప్పుకోని రాజు తన కుమార్తెను మరొకరికి ఇచ్చి వివాహం చేశాడని, ప్రేమ విషయం తెలిసి విడాకులు అయ్యాయని తెలిపారు. నగరానికి వచ్చిన రాజు కుమార్తెను భాస్కర్ బుధవారం ఓ గుడిలో పెళ్లి చేసుకోవాలని అనుకున్నాడని, కానీ విషయం తెలిసి రాజు దారుణ హత్యకు పాల్పడ్డాడని భాస్కర్ బంధువులు ఆరోపిస్తున్నారు.

**ఉప్పరపల్లిలు ఉద్రిక్తత**

భాస్కర్ మృతదేహం గ్రామానికి రానున్న నేపథ్యంలో ఉప్పరపల్లిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బుధవారం ఉదయం నుంచే గ్రామ ప్రధాన కూడలిలో దళిత నాయకులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని బాధిత కుటుంబానికి అండగా నిలిచారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఇది సాధారణ హత్య కాదని, స్పష్టమైన పరువు హత్య అని , నిందితులను వెంటనే అరెస్ట్ చేసి, పీడీ యాక్ట్‌తో పాటు వర్తించే అన్ని కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేయాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిపించి గరిష్ట శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబ సభ్యులు తమ కుమారుడిని అత్యంత దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని, పోలీసులను వేడుకున్నారు.

# హెచ్ఎండిఏ సిఇ రవీందర్‌కు రిమాండ్
## చంచల్‌గూడ జైలుకు తరలింపు

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** అక్రమాస్తుల కేసులో ఏసిబి అరెస్టు చేసిన హెచ్ఎండిఏ సిఇ రవీందర్‌కు నాంపల్లి ఏసిబి కోర్టు బుధవారం రెండు వారాల రిమాండు విధించింది. మంగళవారం ఆయనను ఏసిబి అధికారులు అరెస్టు చేయడం తెలిసిందే. ఆయన వద్ద వంద కోట్ల రూపాయలకు పైగా అక్రమాస్తులు పట్టుబడడం విదితమే. 30 ఏళ్లుగా వివిధ హోదాలలో హెచ్ఎండిఏలో పనిచేస్తున్న రవీందర్‌పై కొంతకాలంగా అవినీతి ఆరోపణలు రావడంతో ఏసిబి అధికారులు పక్కాగా వ్యవహరించి దాడులు చేశారు. కాగా రవీందర్‌ను మంగళవారం రాత్రి నాంపల్లిలోని ఏసిబి కార్యాలయానికి తరలించిన అధికారులు బుధవారం ఉదయం ఉస్మానియా ఆసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించిన తరువాత మధ్యాహ్నం రెండు గంటలకు ఏసిబి కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి రవీందర్‌కు రెండు వారాల రిమాండు విధించారు. అనంతరం ఆయనను సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఏసిబి అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

**రవీందర్‌ను మరింతగా విచారించేందుకు ఏసిబి కస్టడీ పిటిషన్:** ఇదిలావుండగా అక్రమాస్తుల కేసులో అరెస్టయిన హెచ్ఎండిఏ సిఇ రవీందర్‌ను మరింతగా విచారించేందుకు వారం రోజుల పాటు కస్టడీకి కోరుతూ రెండురోజుల్లో ఏసిబి అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసే వీలుంది.

# ఫడ్నవిస్‌తో శరద్‌పవార్ రహస్య భేటీ
## డీలిమిటేషన్ బిల్లు కోసమేనంటున్న పార్టీనేతలు



**ముంబయి,జూలై 15:** కేంద్ర ప్రభుత్వం గత పార్లమెంట్ సమావేశాల్లో మహిళా బిల్లుతో పాటు డీలిమిటేషన్ బిల్లును కలిపి తీసుకొచ్చింది. దీన్ని పార్లమెంట్ లో 2/3 మెజార్టీతో నెగ్గించుకునేందుకు చేసిన ప్రయత్నాల్ని విపక్ష ఇండియా కూటమి విజయవంతంగా అడ్డుకుంది. ఇందులో కాంగ్రెస్ తో పాటు ఎన్సీపీ, ఎస్పీ, డీఎంకే, టీఎంసీ వంటి పార్టీలన్నీ ఈ బిల్లులకు వ్యతిరేకంగా ఓటేశాయి. దీంతో ఇప్పుడు వీటిలో పలు పార్టీల్ని చీల్చి, వాటి మద్దతుతో మరో సారి బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి నెగ్గించుకోవాలని చూస్తున్న ఎన్డీయేకు ఓ గుడ్ న్యూస్ అందింది. గతంలో పార్లమెంట్ లో ఈ బిల్లుల్ని వ్యతిరేకించిన శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ ఈసారి మాత్రం వాటికి మద్దతివ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ కోసం మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన వివాదాస్పద డీలిమిటేషన్ బిల్లుకు మద్దతివ్వాలని పవార్ నిర్ణయించారు. పవార్ నిర్ణయం అమలైతే గత పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు తీసుకున్న నిర్ణయానికి గండి కొట్టినట్లేనని భావిస్తున్నారు. ఎన్సీపీలో రెండు వర్గాలకు చెందిన సీనియర్ నేతలు శరద్‌పవార్, సునేత్ర పవార్ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ తో రహస్యంగా అర్ధరాత్రి సమావేశమైనట్లు వార్తలొస్తున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో ఎన్సీపీ తిరిగి ఏకమై కేంద్రంలోని ఎన్డీయేకు ఏదో ఒక రూపంలో మద్దతు ఇస్తుందనే ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఈ విషయాన్ని నిర్ధారించేందుకు ఇవాళ పవార్ కుమార్తె సుప్రియా సూలే నిరాకరించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో సీట్లను 50శాతం పెంచి, దాని అమలును స్పష్టంగా వివరిస్తే, తాము దానికి మద్దతు ఇస్తామని సుప్రియా సూలే వెల్లడించారు.

# డాలర్‌పై ట్రంప్ చిత్రంతో విడుదల చేసిన అమెరికా మింట్



**వాషింగ్టన్,జులై 15:** అమెరికా స్వాతంత్ర్యానికి 250సంవత్సరాలు పూర్తవు తున్న సందర్భంగా అమెరికా ప్రభుత్వం ప్రత్యేక స్మారక బంగారు నాణెన్ని విడుదల చేయనుంది. అమెరికామింట్ కొత్తగా ఒక డాలర్ బం గారు నాణెం ముద్రణను ప్రారంభించింది. ఈ ప్రత్యేక నాణెంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రం ముద్రించింది. అమెరికా స్వేచ్ఛ, దేశభక్తి, ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా ఈ నాణెన్ని రూపొందించినట్లు అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెసెంట్ వెల్లడించారు. ఈ నాణెం ద్వారా అమెరికాస్వాతంత్ర్య వారసత్వాన్ని, దేశ స్థాపన స్ఫూర్తిని, స్వేచ్ఛను పరిరక్షించాలనే సంకల్పాన్ని ప్రతిబింబించే ప్రయ త్నం చేసినట్లు పేర్కొన్నారు. అమెరికా విలువలు, జాతీయ ఐక్యత, దేశభక్తి భావాలను ఈ స్మారక నాణెం ద్వారా భావితరాలకు చేరవేయాలనే ఉద్దేశంతో దీనిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. బంగారునాణెం ఫస్ట్‌లుక్‌ను స్కాట్‌బెసెంట్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

# నకిలీ నంబర్ ప్లేట్లను వాడుతున్న వాహనదారులపై పోలీసు దాడులు
## వారం రోజుల్లో ఐదుగురిపై క్రిమినల్ కేసులు నమోదు

**హైదరాబాద్, జులై 15, ప్రభాతవార్త:** జంట నగరాలలో నకిలీ నంబర్ ప్లేట్లతో పాటు వాహనాలకు వున్న నంబర్లను ట్యాంపరింగ్ చేస్తున్న వా హనదారులపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేబట్టారు. దీనిపై ఆయా ప్రాంతాల ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు దాడులు చేబట్టినట్లు సి టీ ట్రాఫిక్ బాస్ జోయల్ డేవిస్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాహనదారులు ఈ తరహా ఉల్లం ఘనలు చేయరాదని, ఇది మోటారు వాహనాల చట్టంతో పాటు ఇతర చట్టాల ప్రకారం తీవ్రమైన నేరమని ఆయన తెలిపారు. నకిలీ నంబర్ ప్లే ట్లను ఉపయోగిస్తున్న ఐదుగురు వ్యక్తులపై వారం రోజుల్లో ఐదుచోట్ల క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, దీంతో పాటు వాహనాలను జప్తు చే శామని ఆయన తెలిపారు. ఈ కేసులను ఆయా పోలీసు స్టేషన్లకు బదిలీ చేశామని ఆయన వివరించారు. జుబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్, మలక్‌పేట్ పోలీస్ స్టేషన్, బేగంబజార్ పోలీస్ స్టేషన్, అబిడ్స్ పోలీస్ స్టేషన్, కాచిగూడ పోలీస్ స్టేషన్‌లలో ఆయా వాహనదారులపై కేసులు నమోదు చే సినట్లు జోయల్ డేవిస్ తెలిపారు. ఈ విషయంలో పోలీసులు కఠినంగా వుంటారని, వాహనదారులు తప్పుడు పనులకు పాల్పడి, పోలీసు కేసు ల్లో ఇరుక్కోవద్దని ఆయన కోరారు.

# పెరిగిన విద్యుత్ వినియోగం
## అంతరాయం లేకుండా సరఫరా చేస్తున్నాం
### దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి జితేష్

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, తీవ్ర ఉక్కపోత నేపథ్యంలో ఈ నెలలో తమ సంస్థ పరిధిలో విద్యుత్ డిమాండ్ పెరిగిందని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్ వి పాటిల్ అన్నారు. అయినా డిమాండ్‌కు అనుగుణంగా నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో సాధారణంగా వర్షాకాలంలో విద్యుత్ వినియోగం కొంత తగ్గుముఖం పడుతుందని, అయితే ఈ ఏడాది వర్షాభావం కారణంగా విద్యుత్ డిమాండ్ కూడా పెరిగినట్లు వివరించారు. ఈ నెల14 వరకు నమోదైన గణాంకాల ప్రకారం తమ సంస్థ పరిధిలో మొత్తం విద్యుత్ వినియోగం గత ఏడాది 2,338.79 మిలియన్ యూనిట్లతో పోలిస్తే ఈ ఏడాది 2,510.23 మిలియన్ యూనిట్లకు చేరిందన్నారు.

దీంతో 171.44 మిలియన్ యూనిట్ల అదనపు వినియోగంతో 7.3 శాతం వృద్ధి నమోదైందని వెల్లడించారు. అదేవిధంగా హైదరాబాద్ పరిధిలో విద్యుత్ వినియోగం 957.79 మిలియన్ యూనిట్ల నుంచి 1,071.94 మిలియన్ యూనిట్లకు పెరిగి 114.15 మిలియన్ యూనిట్ల (11.9 శాతం) వృద్ధి నమోదు చేసిందని చెప్పారు. అలాగే ట్రాన్స్‌కో పరిధిలో విద్యుత్ వినియోగం 3,326.29 మిలియన్ యూనిట్ల నుంచి 3,577.04 మిలియన్ యూనిట్లకు పెరిగి 250.75 మిలియన్ యూనిట్ల (7.5 శాతం) వృద్ధి నమోదైందని పేర్కొన్నారు. పెరిగిన విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ కొనుగోలు, సబ్‌స్టేషన్ల సామర్థ్య పెంపు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, ఫీడర్ల పర్యవేక్షణ, లోడ్ మేనేజ్‌మెంట్, విద్యుత్ నెట్‌వర్క్ బలోపేతం వంటి చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

# విద్యా సంస్థల్లో డ్రగ్స్ కట్టడికి కఠిన చర్యలు
## యాంటి డ్రగ్స్ సేఫ్టీ కమిటీలు సవ్యంగా పనిచేసేలా చూడాలి: ఈగల్ అధికారులతో డిజిపి ఆనంద్ సమీక్ష



ఈగల్ అధికారులతో సమీక్ష నిర్వహి స్తున్న డిజిపి సి.వి ఆనంద్. చిత్రంలో ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా తదితరులు

**హైదరాబాద్, జులై 15,ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యా సంస్థల్లో డ్రగ్స్ కట్టడికి ఈగల్ మరింత కఠినంగా వ్యవహరించాలని డిజిపి సి.వి ఆనంద్ అన్నారు. ఈ విషయంలో ఎలాంటి బేషజాలకు తావుండరాదని ఆయన తెలిపారు. విద్యా సంస్థల్లో వున్న యాంటి డ్రగ్స్, సేఫ్టీ కమిటీలు సవ్యంగా పనిచేసేలా చూడాల్సిన బాధ్యత ఈగల్‌దేనని ఆయన చెప్పారు. విద్యా సంస్థల్లో డ్రగ్స్ కట్టడికి చేబట్టాల్సిన చర్యల గురించి డిజిపి ఆనంద్ బుధవారం తన కార్యాలయంలో ఈగల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థల్లో డ్రగ్స్ అనేమాట వినిపించ కూడదని. ఎంతటి వారినైనా సహించవద్దని ఆయన అన్నారు. ఈ విషయంలో సాటి సర్కారీ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని డిజిపి కోరారు. విద్యా సంస్థల పరిసరాలలో డ్రగ్స్‌కు సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు వున్నా ఇం దుకు సంబంధించిన వారిపై కఠినంగా వ్యవహరించాలని డిజిపి ఆదేశించారు. విద్యా సంస్థల్లో యాంటి డ్రగ్స్‌తో పాటు సేఫ్టీ కమిటీల విధివిధానాల రూపకల్పనపై ఈగల్ కీలకంగా వ్యవహరించాలని డిజిపి ఆదేశించారు. విద్యా సంస్థలను డ్రగ్స్ రహితంగా తీర్చి దిద్దాలని సర్కారు నిర్ణయించినందున ఈ విషయంలో పోలీసు శాఖ తనవంతు సహాయం అందించాల ని ఆయన కోరారు. విద్యార్థులు క్రమశిక్షణతో వుంటూ భావి పౌరులుగా మారాల్సిన విద్యా సంస్థల్లో అసాంఘీక కార్యకలాపాలకు తావివ్వ కూడదని ఆయన అన్నారు. యువత డ్రగ్స్ బారినపడకుండా చూడాలని ఆయన ఆదేశించారు. పాఠశాలలు, కాలేజీలలో కచ్చితంగా యాం టిడ్రగ్స్‌తో పాటు సేఫ్టీ కమిటీలు వుండాలని, ఇవిలేని చోట వెంటనే ఏర్పాటు చేయాలని ఆయన ఈగల్ అధికారులను ఆదేశించారు. విద్యా సంస్థల్లో క్యాంపస్ సేఫ్టీ కో ఆర్డినేటర్‌లను వెంటనే నియమించేలా చూడాలని ఆయన కోరారు. విద్యార్థులకు డ్రగ్స్‌పై క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని డిజిపి ఆదేశించారు. ఈ విషయంలో అబ్కారీ, పోలీసు, విద్యాశాఖ సహా ఇతర విభాగాలతో సమన్వయం చేసుకోవాలని ఆయన కోరారు. అంతకు ముందు ఈ గల్ అధికారులు విద్యాసంస్థల్లో డ్రగ్స్ కట్టడికి చేబడుతున్న చర్యలను వివరించారు. ఈ సమా వేశంలో ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా, ఐజి పద్మజారెడ్డి, ఎస్‌పి గిరిధర్ పాల్గొన్నారు.

### షాబాద్‌లో ఆరు హత్యల ఉదంతంలో
# పోలీసుల వైఫల్యంపై ఉన్నతాధికారుల ఆరా
## బాలికను వేధించిన ఘటనలో పోక్సో కేసు నమోదైనా పోలీసుల స్పందన సవ్యంగా లేదనే విమర్శలు


**హైదరాబాద్, జులై 15, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా షాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన ఆరు హత్యల కేసుకు సంబంధించి పోలీసుల వైఫల్యంపై విమర్శలు వెల్లువెత్తుతుండడంతో దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేబట్టారు. రాజ్ కుమార్ (29) అనే ఆటో డ్రైవర్ పె ళ్లయి ఇద్దరు పిల్లలు వున్నా కూడా ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న మైనర్ బాలికను ఏడాదిగా వేధిస్తుండంతో గత మే నెల 16వ తే దీన బాలిక తల్లి షాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అదే రోజున కేసు నమోదయ్యింది. ఏడాదిగా బాలికను వేధిస్తున్న రాజ్‌కుమార్‌ను మొ దట స్థానికులు మందలించగా ఆ తరువాత పోలీసులు కూడా మందలించినా ప్రయోజనం లేకపోవడంతో చివరకు ఫోక్సో కేసు నమోదు చేశారు . అయితే రాజ్‌కుమార్‌పై ఫోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు అతన్ని వెంటనే అరెస్టు చేయడంలో విఫలమయ్యారు. రాజ్‌కుమార్‌పై ఫోక్సో కేసుకు సంబంధించి బెయిల్ రాకుండా వుండే సెక్షన్లకు బదులు, స్టేషన్ బెయిల్ వచ్చేలా సెక్షన్లు నమోదు చేయడం గమనార్హం. ఫోక్సో కేసు అంటేనే మైనర్లపై లైంగిక దాడి లేదా వేధింపులకు సంబంధించినది. దీనికి సంబంధించిన కేసులో స్టేషన్ బెయిల్ వచ్చేలా సెక్షన్లు ఎలా నమో దు చేస్తారని న్యాయ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. దీని తరువాత రాజ్‌కుమార్ తనపై ఫోక్సో కేసు నమోదు కాగానే పారిపోయి హైకోర్టు నుంచి జూన్ 12వ తేదీన ముందస్తు బెయిల్ పొందాడు. దీని తరువాత అతను షాబాద్ పోలీసు స్టేషన్‌కు న్యాయవాదితో కలిసి వచ్చి ముందస్తు బెయి ల్ పత్రాలు ఇచ్చి తిరిగివెళ్లాడు. ఈ సమయంలో పోలీసులు రాజ్ కుమార్‌ను సరిగ్గా మందలించి వుంటే అతను ఈ దారుణాలకు పాల్పడి వుం డేవాడు కాదనే వాదన వుంది. దీని తరువాత అతను తన సొంతవూరు దైవాలపల్లికి చేరుకుని తిరగసాగాడు. తనపై ఫోక్సో కేసు నమోదు కా వడానికి కారణమైన బాలికతో పాటు ఆమె తల్లిపై పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే నెల రోజుల తరువాత అంటే ఈ నెల 10వ తేదీన తన పై ఫిర్యాదు చేసిన బాలిక తల్లిని, ఆమె తల్లిని హత్య చేసి, చివరగా బాలికను చంపేశాడు. దీని తరువాత తన ఇంటికి వెళ్లి భార్యతో పాటు కన్న కొడుకులను చంపాడు. ఇలా ఫోక్సో కేసులో నిందితుడుగా వున్న నేరగాడికి స్టేషన్ బెయిల్ వచ్చేలా సెక్షన్లు నమోదు కావడంతో అతను ముందస్తు బెయిల్ పొంది ఆరుగురిని హత్య చేశాడు. ఒకవేళ రాజ్‌కుమార్‌కు ముందస్తు బెయిల్ రాకుండా చేయగలిగి వుంటే అతను జైలుకు వెళ్లి వుండేవాడు. ఆ తరువాత బెయిల్‌పై బయటకు వచ్చినా కఠిన నిబంధనలు, పోలీసుల నిఘా వుండే వీలుండడంతో ఇన్ని హత్యలకు పాల్పడి వుండేవాడు కాదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడు ఇదే విషయమై ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాయడం సంచలనం రేపింది. రాజ్‌కుమార్ ఆరు హత్యలకు పాల్పడడం రాష్ట్రంలో సంచలనం రేపగా పోలీసుల వైఫల్యం కారణంగా నే ఇవన్నీ జరిగాయని స్థానికులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఈ ఘటనలో షాబాద్ ఎస్ఐ రమేష్‌ను సస్పెండ్ చేయగా సిఐ కాంతారెడ్డిపై శాఖాపర మైన విచారణ చేబట్టారు. ఈ ఉదంతంలో పోలీసుల వైఫల్యంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. దీనిపై మరికొందరు పోలీసులపై వేటుపడే వీలుంది.

# సైబర్ నేరగాళ్ల బాధితులకు నగదు తిరిగి పొందే ప్రక్రియపై టిజిసిఎస్‌బి సూచనలు

**హైదరాబాద్, జులై 15, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల బారినపడి డబ్బులు పోగొట్టుకున్న వారికి కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు తిరిగి అం దుతున్న నగదు విషయంలో బాధితులు కచ్చితమైన విధి విధానాలను పాటించాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) డైరక్టర్ శిఖా గోయల్ తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ (ఎంఆర్‌ఎం) ద్వారా బాధితులకు ఈ చెల్లింపులు జరుగుతున్నట్లు ఆమె తెలిపారు. బాధితులు తమ రీఫండు సంబంధించిన సందహా లు లేదా సహాయం అవసరమైతే 8712665600 నంబర్‌ను ఉదయం ఎనిమిది గంటల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకు పనిచేసే హెల్ప్ డెస్క్‌లో సంప్రదించాలని శిఖా గోయల్ కోరారు. దీంతో పాటు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్. లేదా సంబంధిత సైబర్ నేర కేసును దర్యాప్తు చేస్తున్న దర్యాప్తు అధికారిని సంపదించవచ్చని ఆమె వెల్లడించారు. సైబర్ నేర బాధితులు, తమ రీఫండ్ అభ్యర్థనను నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్లో అందుబాటులో ఉన్న మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ ద్వారా సమర్పించాలని ఆమె తెలిపారు. మనీ రిస్టోరేషన్ మాడ్యూల్ ద్వా రా, చట్ట అమలు సంస్థలు, బ్యాంకులు అవసరమైన ధృవీకరణ పక్రియను పూర్తిచేసిన అనంతరం, అర్హత కలిగిన సైబర్ బాధితులకు వారి నిధులను సులభంగా తిరిగి అందించబడు తుందని ఆమె తెలిపారు. ఇందుకుగానూ బాధితులు సైబర్ క్రైమ్ ఫిర్యాదుకు అనుసంధానమైన సెల్ నంబర్‌ను వాడి లాగిన్ అవ్వాలని, దీంతో పాటు అన్ని అంశాలను ధృవీకరించుకోవాలని, దీని తరువాత బ్యాంకు ఖాతాల వివరాలను తెలపాల ని, అవసరమైన చోట పాన్ కార్డ్ సహా ఇతర వివరాలను అప్‌లోడ్ చేయాలని ఆమె తెలిపారు. దీని తరువాత రీఫండ్ వివరాలను జాగ్రత్తగా సరిచూసుకుని, పోర్టల్ ద్వారా రీఫండ్ అభ్యర్థనను సమర్పించాలని, అభ్యర్థన సమర్పించిన తరువాత, చట్టపరమైన మార్గదర్శకాల పకారం దీ నిని పరిశీలిస్తారని ఆమె తెలిపారు. దీని తరువాత అర్హత కలిగిన బాధితులకు వారు అందించిన బ్యాంకు ఖాతాలో నగదు జమా చేయబడుతుం దని శిఖా గోయల్ తెలిపారు.

కాగా ఈవిషయంలో బాధితులు కొన్ని జాగ్రత్తలు పాటించాలని ఆమె కోరారు. కేంద్ర హోం శాఖ వెబ్‌సైట్‌నే వాడాలని, రీఫండ్ త్వరగా ఇప్పిస్తామని చెప్పే ఎవరితోనూ ఎలాంటి వివరాలు, పాస్వర్డ్లు, బ్యాంకింగ్ వివరాలు లేదా వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని ఆమె తెలిపారు. కాగా ఈ అభ్యర్థన కోసం ఎవరికి ఎలాంటి చెల్లింపులు చేయరాదని ఆమె తెలిపారు.

# కోస్గిలో ప్రాజెక్ట్ కె-100లో 100 మంది రైతులు
## 100 వినూత్న వ్యవసాయ కార్యక్రమాలు, క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కలెక్టర్ ప్రియాంక



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై15:** రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం మరియు గ్రామీణ ప్రాంతాల్లో వినూత్న వ్యవసాయ విధానాలను ప్రోత్సహించడం లక్ష్యంగా నారాయణపేట జిల్లా కొస్గి డివిజన్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "ప్రాజెక్ట్ కె-100 - 100 మంది రైతులు, 100 వినూత్న వ్యవసాయ కార్యక్రమాలు" ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఇప్పటికే 100 మంది ప్రగతిశీల రైతులను గుర్తించి, ప్రతి రైతుకు ఒక ప్రత్యేక వినూత్న వ్యవసాయ కార్యకలాపాన్ని కేటాయించడం జరిగింది. ఈ రైతులు తమ తమ గ్రామాల్లో ఆదర్శ నమూనా క్షేత్రాలను ఏర్పాటు చేసి, ఇతర రైతులకు ప్రత్యక్షంగా కొత్త సాంకేతికతలు, ఆధునిక సాగు పద్ధతులు, ఆదాయాన్ని పెంచే విధానాలను పరిచయం చేస్తున్నారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, మహిళా సంఘాలు, యువ రైతులు మరియు సంబంధిత శాఖలు సమిష్టిగా కృషి చేయాలని వ్యవసాయ శాఖ రైతులను కోరింది. రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులతో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అన్నారు.

నారాయణ పేట్ జిల్లా కొస్గి మండలం మల్లారెడ్డిపల్లి రైతు వేదిక ముషీరిఫా పరిధిలో జిల్లా కలెక్టర్ బుధవారం క్షేత్ర పర్యటన చేశారు. పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన పెంచేందుకు ఉద్దేశించిన ప్రాజెక్ట్ కె-100 చాలా ఉపయోగకరమైందని, ఈ ప్రాజెక్ట్ కు పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తున్న మల్చింగ్ విధానంలో వంకాయ, పచ్చిమిర్చి సాగు, స్టేకింగ్ విధానంలో టమాట సాగు, అలాగే పూల సాగు (ఫ్లోరికల్చర్) పొలాలను ప్రత్యక్షంగా ఆమె పరిశీలించారు. రైతులు అవలంబిస్తున్న ఆధునిక సాగు విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పంటల నిర్వహణ తీరు పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. వినూత్న వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ అధిక దిగుబడులు సాధించే దిశగా ముందుకు సాగుతున్న రైతులను అభినందించారు. ఇతర రైతులు కూడా ఇలాంటి ఆధునిక సాంకేతిక పద్ధతులను అనుసరించాలని సూచించారు. అనంతరం ఎలినినో పరిస్థితులలో ప్రత్యామ్నాయ పంటలు, కరువును తట్టుకునే పంటల రకాలు, స్వల్పకాలిక రకాలు సాగు చెయ్యాలని సూచించారు. వర్షపు నీటిని ఆదా చేసుకోవడానికి ఫారం పాండ్స్ తవ్వుకోవాలని కోరారు. సాంప్రదాయ పంటలతో పాటు ఉద్యాన పంటలు, కూరగాయలు, పూల సాగు వంటి పంటల వైవిధ్యీకరణ ద్వారా రైతులు ఎలా అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, స్థిరమైన వ్యవసాయాభివృద్ధికి "ప్రాజెక్ట్ కె-100" ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతం గా అమలు చేసేందుకు కు జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూరగాయల విత్తనాలు, పత్తి విత్తనాలు రైతులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో కొస్గి డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు (ఎంఏఓ లు), వ్యవసాయ విస్తరణ అధికారులు , ఉద్యాన శాఖ అధికారులు మరియు సిబ్బంది, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్స్, రైతు సోదరులు పాల్గొన్నారు. అలాగే కోస్గి, మద్దూర్, కొత్తపల్లి, గుండుమల్ మండలాలకు చెందిన సుమారు 120 మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని పంటల వైవిధ్యీకరణ, ఆధునిక సాగు పద్ధతులు,ప్రాజెక్ట్ కె-100 ద్వారా లభించే ప్రయోజనాలపై అవగాహన పొందారు.

### పోక్సో చట్టాన్ని సమర్థవంతంగా
# అమలు చేయాలి
## సిఎం రేవంత్‌రెడ్డికి ఎపి డి.సిఎం పవన్ విజ్ఞప్తి

**విజయవాడ,జూలై15,ప్రభాతవార్తప్రతినిధి:** పిల్లలపై లైంగిక నేరాలకు వ్యతిరేకంగా ఉన్న పోక్సో చట్టాన్ని అత్యంత సమర్థవంతంగా అమలు చేయాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పవన్ కల్యాణ్ ఒక అధికారిక లేఖ రాశారు.తెలుగు రాష్ట్రాల్లో బాలల భద్రత, మహిళా రక్షణపై సరికొత్త రాజకీయ చర్చ మొదలైంది. సమాజంలో చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు, చట్టాలను మరింత పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్న ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. బాధితులకు ప్రత్యేక రక్షణ ప్రణాళికతో పాటు, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రత్యేక పోక్సో మానిటరింగ్ సెల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలలు, హాస్టళ్లు, ప్రార్థనా స్థలాల్లో బాలల భద్రతకు ప్రత్యేక ప్రోటోకాల్స్ తీసుకురావాలన్నారు.బాధితులను బెదిరించే నిందితులకు బెయిల్ రాకుండా కఠినంగా వ్యవహరించాలని, నేరస్తులపై రౌడీ షీట్లు తెరిచి నిరంతర నిఘా ఉంచాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రతి చిన్నారికి రక్షణ, న్యాయం కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యలపై 30 రోజుల్లో నివేదిక సమర్పించాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. పోక్సో కేసులో విచారణకు నిర్ణీత గడువు విధించాలని, కేసుల్లో బాధితుల రక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోక్సో కేసులకు ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీంకోర్టు అనేకసార్లు చెప్పిందని గుర్తుచేశారు. లేఖలో షాబాద్ హత్యల ఘటనను ప్రస్తావించారు.

తెలంగాణ ప్రభుత్వము
దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ తాడుబందు వీరాంజనేయస్వామి దేవస్థానము
6-2, కుమ్మరిగుట్ట, తాడుబందు, సికింద్రాబాద్, ఫోన్: 040-27841283

సీల్డ్ టెండర్

ఆర్.సి.నెం. STVSD/37/2026 తేది: 15.07.2026

ఇందుమూలముగా సమస్త భక్త జనులకు తెలియజేయునది ఏమనగా, తేది. 01.10.2026 నుండి 30.09.2027 ఒక సంవత్సరం కాలపరిమితి వరకు దేవాలయములో ఈ దిగువ తెలియపరచిన వాటి నిమిత్తం లైసెన్స్ హక్కుల కొరకై టెండర్‌దారుల నుండి హెచ్చు పాట, తక్కువ పాట విధానంలో సీల్ టెండర్ ద్వారా టెండర్లు కోరనైనది. I. హెచ్చు పాట విధానము కాలపరిమితి. తేది. 01.10.2026 నుండి 30.09.2027 వరకు (ఒక సంవత్సరం). 1. కొబ్బరిచిప్పలు ప్రోగు చేసుకొనుట. (సీల్ టెండర్ మరియు బహిరంగ వేలం). II. తక్కువ పాట విధానం కాలపరిమితి. తేది. 01.10.2026 నుండి 30.09.2027 వరకు (ఒక సంవత్సరం). 1. నిత్యపూజ వారి పూలదండలు సప్లయ్ చేయుట. 2. శని, మంగళవారం రోజులలో పూలదండలు సప్లయ్ చేయుట. 3. అరటి చెట్లు మరియు మామిడి ఆకులు సప్లయ్ చేయుట. 4. విస్తర్లు, దొప్పలు, ప్లాస్టిక్ గ్లాసులు ఇతరములు సప్లయ్ చేయుట. 5. శ్రీ స్వామి వారి స్టిక్కర్లు సప్లయ్ చేయుట. 6. శ్రీ స్వామి వారి లామినేషన్ ఫోటోలు, ఫ్లెక్స్ బ్యానర్లు సప్లయ్ చేయుట. 7. ప్రసాదములు తయారీ (లేబర్, ప్యాకింగ్ చార్జీలతోసహా). 8. పూజ టికెట్స్ (ప్రింటింగ్, క్యాలండర్లు మరియు ఇతరములు సప్లయ్ చేయుట. 9. వస్త్రములు (ప్రింటెడ్ షెల్లాలు) సప్లయ్ చేయుట. 10. కూరగాయలు సప్లయ్ చేయుట. 11. పాలు మరియు పెరుగు సప్లయ్ చేయుట. 12. నిత్య పూజలకు కొబ్బరికాయలు సప్లయ్ చేయుట. 13. ముఖ్యమైన పర్వదినాలలో పూల అలంకరణ చేయుట. 14. ముఖ్యమైన పర్వదినాలలో దేవాలయాలకు విద్యుత్ దీపాలంకరణ మరియు మైక్ సెట్ ఏర్పాటు చేయుట. 15. ముఖ్యమైన పర్వదినాలలో టెంట్ సామాగ్రి (కలకత్తా డెకరేషన్) సప్లయ్ చేయుట. 16. సి.సి. కెమెరాల నిర్వహణ. 17. శ్రీ స్వామివారి ముద్రతో రాగి డాలర్లు సప్లయ్ చేయుట. 18. ముఖ్యమైన పర్వదినాలలో ఫోటోలు మరియు వీడియో తీయుట. 19. ప్రసాదం ప్యాకింగ్‌కు సిల్వర్ కవర్స్ దేవస్థానం పేరుతో ప్రింటింగ్ మరియు లడ్డు పి.పి. కవర్లు సప్లయ్ చేయుట. 20. కంకణ దారములు సప్లయ్ చేయుట. 21. స్టేషనరీ సప్లయ్ చేయుట. 22. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సప్లయ్ చేయుట. గుర్తింపు పొందిన ఏజెన్సీ ద్వారా. 23. సెక్యూరిటీ గార్డ్స్ సప్లయ్ చేయుటకు గుర్తింపు పొందిన ఏజెన్సీ ద్వారా. 24. దేవస్థానములో సి.సి కెమెరాలు అమర్చుటకు (ఒక్కంటికి గాను).

సీరియల్ నెం. 1 హెచ్చుపాట విధానంలో మరియు సీరియల్ నెం.1 నుండి 24 వరకు తక్కువ పాట విధానంలో సీల్ టెండర్ ద్వారా ఉండును. పై టెండర్లకు సంబంధించిన షెడ్యూలు ఫారములు తేది. 25.07.2026 శనివారం నుండి 30.07.2026 గురువారం వరకు టెండర్ షెడ్యూలు ఉదయం 10.30.ని నుండి సాయంత్రం 5.00.గం.ల వరకు దేవస్థానం కార్యాలయంలో జారీ చేయబడును. తేది: 31.07.2026 శుక్రవారం రోజు ఉ.10.00గం. వరకు కొటేషన్స్ (సీల్ టెండర్స్) స్వీకరించబడును. సీల్ టెండర్ తేది : 31.07.2026 ఉ.11.30ని దేవస్థానం కార్యాలయంలో కార్యనిర్వహణాధికారి, పర్యవేక్షణాధికారి, టెండరుదారుల సమక్షంలో తెరువబడును. మిగతా వివరములకు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించగలరు. ఫోన్: 040-27841283, 905905912, 9849253620.

సం/-. కార్యనిర్వహణాధికారి.

DIPR.NO. 6117-PP/CL/ADVT/1/2026-27 తేది: 15.07.2026

AU SMALL FINANCE BANK
నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, జైపూర్, రాజస్థాన్, ఇండియా- 302001
www.au.bank.in

బంగారం పై రుణం "ఎక్కడ ఉందో అలాగే" అనే ప్రాతిపదికన వేలం నోటీసు

AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ("బ్యాంక్") నుండి పొందిన బంగారు సౌకర్యాలపై రుణానికి సంబంధించివారి బకాయి మొత్తాలను చెల్లించమని క్రింద పేర్కొన్న రుణగ్రహీతలకు నోటీసులు జారీ చేయబడ్డాయి. రుణగ్రహీత/లు వారి బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, దిగువ పేర్కొన్న శాఖలలో 17 Aug 2026 ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 3:00 (సమయం) మధ్య పేర్కొన్న పద్ధతి ప్రకారం తాకట్టు పెట్టిన బంగారు వస్తువులు/ వస్తువుల వేలం నిర్వహించాల్సి ఉంటుంది. మరణించిన రుణగ్రహీతల విషయంలో, అన్ని షరతులు చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి. పైన పేర్కొన్న వేలం విఫలమైతే, ముందస్తు సమాచారం లేకుండా మరొక వేలం నిర్వహించే హక్కు బ్యాంకుకు ఉందని దయచేసి గమనించండి.

ప్రత్యక్ష వేలం శాఖ వివరాలు

Thorrur -L25660001972498 L25660001622718 L25660001770368 L25660001650875| Mehboobnagar -L25660001596775 L25660001766876 L26660000750642 L25660001727971 L25660001653039 L25660001766656 L26660000634371| HanamkondaÂ Warangal -L25660001685198 L26660000464880 L25660002193626 L26660000658406 L26660000470078 L25660001578500 L25660001579118 L26660000513229 L25660001635654 L25660001631151| Karimnagar -L26660000478544 L25660001660585 L25660001625313 L25660001704345 L25660001704785 L26660000593496 L25660001703666| MANTHANI -L25660001666255 L25660000559784| Wanaparthy -L25660001796849 L25660000558705 L25660001793395 L25660001759230| Vemulawada -L26660000102043 L25660001723818 L25660001771656 L25660002276491 L26660000185695 L25660001757634 L25660001622588 L25660001602226 L25660001668201 L25660001230935| Narsampet -L25660001661724 L25660000522124 L26660000496129 L25660001673701| MOTHKUR -L25660001687803 L25660002098345|Jagtial -L25660001731833 L25660001603895 L25660001636262 L25660001592093 L26660000737857 L25660001704715 L25660000503040 L25660001688653 L25660001800974 L25660001770768|GHANPUR -L25660001613885 L25660001604643 L25660001605311|PARKAL -L25660001620602 L26660000320872 L25660001574887 L25660001605361 L26660000756651 L25660001792266 L25660001787786 L25660001035533 L25660001030682 L25660001781537 L25660001175318 L25660001783194 L25660001678852 L25660002005583 L25660001640914 L25660001969955 L25660001696607 L25660001665476 L26660000704270|NARAYANAPET -L25660001741514 L25660001785860 L26660000646768 L25660001695219 L26660000719052 L26660000741849 L26660000660791|MAHABUBABAD -L25660001771476 L26660000503408 L25660001730655 L25660000525598 L25660001705843 L26660000623742 L25660002029327 L25660001735645 L25660001730445 L25660001700642 L25660001801682 L26660000762269| Huzurabad Karimnagar -L25660001795731 L25660001613725 L25660001795001 L25660001573209 L25660001657762 L25660001733889 L25660001854191 L25660001796659| Khammam -L25660001574627 L25660000526056 L26660000570900 L26660000570850 L26660000385458| Dharmaram -L25660001763802 L25660001761285| ACHAMPET -L25660001629585 L26660000471616 L26660000660401 L25660001683382 L25660001579098 L25660001620362| Kamareddy -L25660001901384 L25660001637780 L25660001575125 L25660001770978 L25660001611799 L25660001712199|SHADNAGAR -L25660000513471 L25660001741374 L25660001676935 L25660001792776| Siddipet -L25660001622378 L25660001635574 L25660001740795 L25660001656314| Road No.1 Banjara Hills -L9001090156485432 L25660001724036 L25660002160329| KONDA MALLEPALLI -L25660001798445| Kataram -L25660001602666 L25660001630603|Peddapalle -L25660001789813 L25660001624295 L25660001721102| Medak -L25660001728249 L25660001731633 L25660001666845|Sangareddy -L25660001687635 L25660001639876| VANASTHALIPURAM -L26660000610786 L26660000773518| Jogipet -L25660001722690 L25660001734857 L25660001727461 L25660001066284| CHOUTUPPAL -L25660001742252 L26660000773278 L25660001733209 L25660001734847| Miriyalguda -L26660000607523 L26660000902977 L26660000583826 L26660000228816| Nagarkurnool -L25660001749529 L26660000166641 L25660001650185 L25660001680817| Nakkalagutta Warangal -L26660000603860 L25660001769401 L25660000411403 L25660001768033| Nalgonda -L26660000693668 L26660000744764|Kodad -L25660001637590 L25660001707399 L25660001604523|Banswada -L25660001616300 L26660000438590 L26660000671900|Narayankhed -L25660001645315 L25660001747783 L25660001726893 L25660001657262| Madhira -L25660001763452 L25660001732411|MANUGURU -L26660000647786| Sathupalli -L25660001793265| Mulugu -L26660000774166 L26660000537584| Palwancha -L25660001728279| BODHAN -L25660001828851 L26660000663636| Gadwal -L25660001579298| Suryapet -L25660001798225 L25660001646083 L25660001734037 L25660001573759|Jangaon -L26660000493405|THALLADA -L25660002002118| Gajwel -L25660001659408 L25660001754679|KORUTLA -L25660001655935 L25660001627749|YADADRI BHONGIR -L25660001642530| HUSNABAD -L26660000547735

గమనిక: 1. భౌతిక వేలం విఫలమైతే, https://gold.samil.in అనే వెబ్ లింక్ ద్వారా ఇ-వేలం నిర్వహించబడుతుంది.
2. ఒకవేళ ప్రతిపాదిత వేలం విఫలమైతే, ఈ నోటీసును తదుపరి వేలం కోసం ముందస్తు నోటీసుగా పరిగణించగలరు.
3. వేలం బిడ్ ఫారంలో పేర్కొన్న కొన్ని నిబంధనలు మరియు షరతులకు లోబడి ఉంటుంది, ఇది వేలం ప్రారంభానికి ముందు అందుబాటులో ఉంచబడుతుంది.

సం/-మేనేజర్,
AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

వార్త

కలకాలం నిలిచిపోయే పనులు చేయడంలో
ఖర్చు అయిన జీవితమే చాలా
ఉపయోగకరమైన జీవితం.

- విలియం జేమ్స్

# సర్వరక్షకుడు జగన్నాథుడే..



రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము

శ్రీ జగన్నాథుడి ప్రార్థనలు, కీర్తనలు చిన్ననాటి నుంచి నా జ్ఞాపకాల్లో పదిలమై ఉన్నాయి. పాఠశాలలో, కళాశాలలో చదువుకొనేటప్పుడు మహాప్రభు జగన్నాథుని భజనలు పాడటం నాకు చాలా ఆనందాన్నిచ్చేది. మహా ప్రభుకి చాలా సన్నిహితంగా ఉన్నఅనుభూతి కలిగేది. నేనీ మధ్య భజనలు పాడటం లేదు కానీ, ప్రతి రోజూ ఆ మహా ప్రభుని స్మరిస్తాను. భజనలోని ఓ నాలుగు పదాలైనా పలకని రోజుండదు. నిజానికి మహా ప్రభు నాకు దగ్గరగా ఉన్నట్టు భావిస్తుంటాను. కష్ట సమయాల్లో ఆయన నాకు అండగా ఉన్నారు. ఈనాటికీ భక్త కవి మధుసూదనరావు రచించిన పాటను పాడుతూనే ఉంటాను. అంతటా ఉండే ఓ మహాప్రభూ...నువ్వు రాత్రింబగళ్లు నా తోడే ఉన్నావు... ఈ జ్ఞాపకంతో నిన్ను ఎల్లప్పుడూ పూజిస్తాను.. నా పూర్ణ హృదయంతో.. అని ఆ పాటకి అర్థం. లౌకిక విషయాలు అర్థం చేసుకొనే వయసు వచ్చేనాటికి మహాప్రభు జగన్నాథు ని గొప్పదనాన్ని అర్థం చేసుకోవడం ప్రారంభించాను. మహా ప్రభు జగన్నాథుని గురించి ఇంట్లో తరచూ మాట్లాడుకొనే వారు. మా గ్రామంలోనూ ఇలాంటి చర్చలే ఎక్కువగా జరుగుతుండేవి. నేను గ్రామ పాఠశాలలో చదువుతున్నప్పుడు భక్త సాల్బేగ్ రచించిన 'ఆహే నీల శైల'అనే ప్రార్థనను క్రమం తప్పకుండా పఠించేవారు. మహాప్రభు జగన్నాథుని గురించి మా టీచర్ అనేక విషయాలు చెబుతూ ఉండేవారు. పూరీలో పెద్ద ఆలయం ఉంది. అంతటి గొప్ప ఆలయం మరొకటి లేదు! ఆ ఆలయంలో తన చెల్లెలు సుభద్ర, సోదరుడు బలభద్రునితో కలసి మహాప్రభు పూజలందుకుంటారు. మహా ప్రభు జగన్నాథుడు నల్లని రంగులో, గుండ్రని కళ్లతో ఉంటారు. సుభద్ర పసుపు రంగులో, బలభద్రుడు వెన్నెల్లో వికసించిన పుష్పంలా శ్వేతవర్ణంలో ఉంటారు. ఒక్కసారి ఆ మూర్తులను చూస్తే..ఎప్పటికీ మరచిపోం అని చెప్పేవారు. జగన్నాథుడే మహాప్రభువనీ, ఆయన ప్రసాదమే మహాప్రసాదమని కూడా మా టీచర్ చెప్పేవారు. ఆయన ఆలయమే బడ దేవుళ్ల లేదా పెద్ద ఆలయం. ఆయన మార్గమే బడ దాండ. అంటే ఉత్కృష్ట మార్గం. ఆయన సముద్రమే మహోదధి లేదా గొప్ప మహాసముద్రం. మయూర్భంజ్ జిల్లాలోని మా ఊరు ఉపర్‌బేడా నుంచి పురుషోత్తమ క్షేత్రం పూరీ చాలాదూరంలో ఉంటుంది. మరి పూరీని సందర్శించే అవకాశం నాకెలా వస్తుంది? నేను పెద్దయ్యాక, భువనేశ్వర్‌కి వెళ్లాను.అక్కడ బాలికల ఉన్నత పాఠశాలయూనిట్-2లో చేరాను. అక్కడే వసతిగృహంలో ఉండే దాన్ని. అక్కడ ఉన్నప్పుడే పూరీ, భువనేశ్వర్, కోణార్క్ సందర్శించే అవకాశం నాకు లభించింది. మొదటిసారి మహాప్రభును దర్శించుకున్న జ్ఞాపకం ఇప్పటికీ నామదిలో స్పష్టంగాఉంది. ఎంత అద్భుతమైన ఆలయం! ఎంత తేజోవంతమైన దేవతా మూర్తులు! వాటిని మరచిపోగలమా? ఎవరైనా మహా ప్రభు జగన్నాథుని రథయాత్రను మరచి పోగలరా? శ్రీ క్షేత్రలో ఏడాదిలోని పన్నెండు నెలల్లో పదమూడు ఉత్సవాలు జరుగుతాయి. కానీ రథయాత్ర వైభవం మాత్రం అద్వితీయం. మహాప్రభు దర్శనంకోసం ఏడాది పొడవునా భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారు. కానీ ఏడాదికోసారి మహాప్రభువే ఆలయాన్ని వదలి విశాల పథంలో గుండిచా ఆలయానికి చేరుకొని భక్తు లకు దర్శన మిస్తారు. మూడు అద్భుతమైన రథాలపై చక్రరాజ సుదర్శనునితో పాటు ముగ్గురు దేవతా మూర్తులు గుండిచా ఆలయానికి చేరుకుంటారు. అక్కడే ఏడురోజులు ఉండి, ఆ తర్వాత తిరుగుప్రయాణమవుతారు. అత్యంత వైభవోపేతమైన ఈ మహాప్రభు ఉత్సవానికి సాటి




లేదు. చిన్నతనం నుంచి మహాప్రభు జగన్నాథుని భక్తురాలిని. నేను అత్యంత భక్తిభావంతో కొలిచే దైవం ఆయన. నా జీవితంలో ఒడిదొడుకులను నిర్ణయించేది ఆయనే. నా సుఖ దుఃఖాలకు ఆయనే మూలం. నా జీవితంలో ఎన్నోకష్టాలను ఎదుర్కొన్నాను. ఆ సమస్యలన్నింటి నుంచి మహాప్రభు నన్ను బయటకు తీసుకొచ్చారు. ఎంతైనా నేను ఆయన బిడ్డనే కదా. భారత రాష్ట్రపతి పదవికి నన్ను అభ్యర్థిగా ప్రకటించినప్పుడు.. నేను భక్తిపూర్వకంగా మహా ప్రభుని తలచుకున్నాను. నన్ను ఇంత పెద్దస్థాయికి తీసుకెళుతున్నావు. నన్ను ముందుకు నడిపించు. ఎప్పుడూ నాతోనే ఉండు అని ప్రార్థించాను. ఆయన నా మొర ఆలకించారు. నా ప్రార్థనకు ఆయన ఎప్పుడూ స్పందిస్తారు. నేను రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తరుణంలో.. రథయాత్ర ఉత్సవం జరిగింది. నేను అప్పుడు ఢిల్లీలోనే ఉండాల్సి వచ్చింది. పూరీ వెళ్లడం సాధ్యం కాలేదు. రథయాత్ర రోజు ఉదయమే నేను ఢిల్లీలోని హౌజ్‌ఖాస్‌లో ఉన్న శ్రీజగన్నాథుని ఆలయానికి వెళ్లాను. మహా ప్రభు దర్శనం చేసుకున్నాను. నా హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. ఆయన నాపై తన ఆశీస్సులను కురి పించారు.పూర్తి విశ్వాసంతో నేను నామినేషన్ దాఖలు చేశాను. అత్యంత ఉత్సాహంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాను. 2022 జులై 25న రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేయడానికి పార్లమెంట్ సెంట్రల్ హాలుకి వెళుతూ..దారిలో నేను మహాప్రభు జగన్నాథుని స్మరి స్తూనే ఉన్నాను. ఆయన ఆశీస్సులతో, కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. రాష్ట్రపతిగా నేను మొదటిసారి ప్రసంగించినప్పుడు ఆయన నాతోనే ఉన్నట్టు అనిపించింది. అయినప్పటికీ.. మహాప్రభు దర్శనం కోసం నా హృదయం పరితపించింది. రోజులు గడచిపోతున్నాయి కానీ పూరీ వెళ్లడం సాధ్యం కాలేదు. ఆయన అనుమతిస్తేనే తప్ప ఎవరికైనా ఆయన దర్శనం ఎలా లభిస్తుందని నాకు అని పించింది. మహాప్రభూ! నేనేదైనా తప్పు చేసి ఉంటే నన్ను క్షమించండి. దయచేసి నన్ను పూరీకి పిలిచి.. మీ దర్శన భాగ్యం ఇవ్వండి అనిమౌనంగా ప్రార్థించాను. భావాలకు లేదా భావోద్వేగాలకు కూడా ఆయనే మహాప్రభు. నా ఆలోచనలను ఆయన ఎలా అర్థం చేసుకోకుండా ఉంటారు? అనతి కాలంలోనే పూరీ పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. ఆ రోజు 2022 నవంబరు 10. పూరీకి చేరుకున్న తర్వాత వాహన శ్రేణి శ్రీ మందిర్ దిశగా ముందుకు వెళుతోంది. పూరీలోని బడదాండ వద్దకు చేరుకోగానే అనిర్వచనీయమైన అనుభూతి నన్ను ముంచెత్తింది.బడదాండ శ్రీజగన్నాథునిది. ఇక్కడ ప్రొటోకాల్ పాటించాల్సిన అవసరం ఉందా? అన్ని పుణ్య క్షేత్రాల్లోనూ క్షేత్ర రాజంగా పూరీ ప్రసిద్ధి చెందింది. దేవుళ్లకే దేవుడు మహాప్రభు. ఎలాంటి ఆలోచనలు లేకుండా నా కారుని ఆపించాను. నా కారు ఆగగానే వెనుక వస్తున్న కార్లనీ కూడా ఆగిపోయాయి. ఏం జరుగుతుందో మిగిలిన వారికి అర్థమయ్యేలోపే.. చెప్పులు లేకుండా బడ దాండపై నడవడం మొదలుపెట్టా ను. అక్కడికి శ్రీ మందిర్ రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆలయ శిఖరం మీద ఉన్న నీలచక్రం, పతిత పావన ధ్వజం మీదే నా దృష్టిని సారించి ముందుకు సాగాను. ముందుకు నడుస్తూనే.. రోడ్డుకిరువైపులా ఉన్న బాలలు,మహిళలు, యువత, పెద్దలకు నమస్కరిస్తూనే ఉన్నాను. కానీ నా దృష్టి మాత్రం మహాప్రభు మీదే ఉంది. ఆలయ సింహద్వారానికి చేరుకొనే సరికి.. నేను స్థిమితంగా ఉండలేకపోయాను. అప్పటికే నన్ను నేను మరచిపోయాను. బడ దాండ మీద దుమ్ములోనే సాష్టాంగ నమస్కారం చేసి ఆ మహాప్రభుకి నా ప్రణామాలు అర్పించాను. ఆ తర్వాత నేను గుడిలోకి వెళ్లాను. గర్భగుడికి చేరుకొని నలుగురు దేవతామూర్తులను దర్శనం చేసుకుని, దైవికానందంతో ఉప్పొంగిపోయాను. ఈ విశ్వానికి రక్షకుడు మహాప్రభువే. అందరూ వదిలేసిన వారికి కూడా ఆయనే రక్షకుడు. లోకం లోని జనుల కష్టాలను తీర్చేందుకు ఆయన ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటారు. అందుకే ఆయన విశాలమైన గుండ్రటి నేత్రాలు ఎప్పుడూ రెప్ప వాల్చవు. ఆయనకి పెద్దాచిన్నా తారతమ్యం లేదు. ఆయన దృష్టిలో అందరూ సమానులే. సమానత్వమే ఆయన మంత్రం. ఆయన దీవెనలతోనే.. సమాజంలోని ప్రతి వర్గానికి సేవ చేసేందుకు నన్ను నేను అంకితం చేసుకున్నాను. గుండ్రని కన్నులతో ఉన్న మహాప్రభు జగన్నాథుని చూస్తూ.. ఓ మహాబాహూ! ప్రజలకు సేవ చేయాలనే నా అంకితభావం కొనసాగేలా ఆశీర్వదించు. ఓ కృపానిధీ! నా దేశాన్ని, ఈ ప్రపంచాన్ని రక్షించు అని చేతులు జోడించి ప్రార్థించాను. ఇలా చెబుతూ భక్తిభావంలో లీనమైపోయాను. ●

# చిత్త భ్రమలో కుటుంబాలు చిత్తు!


జీవితాలు క్షణ భంగురాలే. కానీ కొన్ని జీవితాలు తమకే తెలియని అసంకల్పిత చర్యల్లో అన్యాయంగా వేరొకరి క్రూరత్వానికి బలైపోవడం ఈ మధ్యనే చూస్తున్నాం. ఎన్నో కాపురాలు కూలిపోవడం ఒకనాటి మాట. తాజాగా భార్య భర్తల్లో ఎవరో ఒకరి క్రౌర్యానికో, తొందరపాటు ఆలోచనలకో, అనుమానాలకో కుటుంబాలు కుటుంబాలే బలైపోతున్నాయి. తన తర్వాత తమ బిడ్డలనెవరు సాకుతారన్న కారణంతో తానేకాక తన పిల్లల్ని కూడా చంపి ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన ఓ తల్లిదో తండ్రిదో అయినప్పుడు ఆ కుటుంబం భూస్థాపితమే. ఆయా కుటుంబాలలో ఒకరి పగకో, ప్రతీకారానికి కుటుంబం యావత్తూ బలైపోయిన సంఘటనలు, ఉదంతాలు వినిపిస్తున్నాయి. అదేదో కాల మహిమ అని సరిపెట్టుకోలేం. సమాజం ఎటువైపు వెళ్తోందో అర్థం కాని పరిస్థితి, అర్థం చేసుకోలేని పరిస్థితి ఎదురౌతోంది. ఇలాంటి సంఘటనల్లో భాగస్వాములైన వారి మానసిక పరిస్థితి ఎలాంటిదో కూడా గమనించాల్సి ఉంది. తల్లి కానీ, తండ్రి కానీ పిల్లలను హతమార్చి తానూ ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు తరుచుగా వార్తల్లో చూస్తున్నాము. ప్రతి సంఘటన చర్చనీయాంశమే కానీ ఆ తర్వాత పాతబడిపోతుంది. మరో సంఘటన వెలుగు చూస్తుంది. ఎప్పటి సంఘటన అప్పటి తర్వాత పాతదైపోతున్నా అందుకు సంబంధించిన కారణాలు సజీవంగానే ఉంటాయి. అటువంటి మరో సంఘటనకు పురికొల్పే అంశాలను ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాల్సి ఉంది. వీలైతే ఇలాంటి సంఘటనల ప్రభావం మరి కొందరిపై పడకుండా చూసుకోవాలి. అది మన బాధ్యతే. అవన్నీ ఆర్థిక సంబంధాలుగా కానీ వ్యక్తిగత ఆలోచనలుగా కానీ కొట్టిపడేయలేం. భారతీయకుటుంబ వ్యవస్థకు ఎన్నో కట్టుబాట్లు ఉన్నాయి. వాటన్నిటినీ విడిచి విధ్వంసపు ఆలోచనలు వస్తున్నాయంటే కుటుంబ వ్యవస్థ సరిగ్గా నడవనట్లు అనిపిస్తుంది. కుటుంబ సభ్యుల మానసిక ఆరోగ్య అవగాహన కూడా ప్రధాన పాత్ర వహిస్తుంది. మొన్నామధ్య ఓ తండ్రి తాను లేకుంటే తన బిడ్డలను చూసే వారుండరు కనుక వారినిలా వదిలేయడం కన్నా తనతో తీసుకెళ్లడం మంచిదనే ఆలోచనతో వారిని ముందుగానే హత్య చేసి తాను చనిపోవాలని ప్లాన్ వేసుకుంటాడు. వారిలో ఏ ఒక్కరు బయటపడినా వారి పోషణ, వ్యక్తిగత జీవితం దుర్భరమౌతుంది. తన కడుపున పుట్టిన బిడ్డలే అయినా మరో ప్రాణం తీసే హక్కు వారికి లేదు. అదొక తీవ్రమైన నేరం. పిల్లల్ని కనిపెంచి విద్యాబుద్ధులు నేర్పిన తల్లిదండ్రులు, వారి ప్రాణాలను తీసే హక్కు తమదేనన్నట్లు ప్రవర్తించకూడదు. వీటన్నిటికే సామాజిక మాధ్యమాల్లో కనిపించే ఆర్భాటపు శైలి. డిప్రెషన్, ఇతరత్రా ఒత్తిడిలు, భావోద్వేగాలు వారిని ఆలోచించుకోనివ్వవు. అందుకే వాటిని ముందుగా గుర్తించుకుని మానసిక ఆరోగ్య సేవల కోసం డాక్టర్లను సంప్రదించాలి. తాజాగా జరిగిన ఒక దుర్ఘటనలో నెల్లూరుజిల్లా తోటపల్లి గూడురుకుచెందిన హరికృష్ణ అనే వ్యక్తి మంగళవారం సింగరాయకొండ రైల్వే స్టేషన్‌లో తన భార్య ఇద్దరు పిల్లల్ని ఎదురొస్తున్న ట్రైన్‌కు బలిఇచ్చాడు. తన బావ హత్యకేసులోనింది తుడుగా ఉన్న హరికృష్ణ తనకు ఆత్మహత్యే శరణ్యమని భావించాడు. దాంతో ఏ పాపం తెలియని భార్యాబిడ్డల్ని సైతం రైలు కిందకు తోసి వారిచావుకు కారకుడయ్యాడు. తానూతనువు చాలించాడు. ఆర్థిక ఇబ్బందులోఉన్నవారు, వైవాహిక జీవితంలో విఫలమయిన వారు,జీవిత భాగస్వాములపై సందేహాలున్న వారు ఇలాంటి దుష్కర్మలకు ఒడిగడుతుంటారు. మరో ఉదంతంలో తల్లిదండ్రులు పేచీ పడుతుంటే 'నా వల్లనే కదా మీా మధ్య గొడవ,అమ్మా నాన్నా నే చచ్చిపోతున్నాన'ని వారి కళ్లెదుట ఆత్మహత్య చేసుకుంటున్న కొడుకును వాళ్లు ఆపలేకపోయారు.ఇలాంటి మరో విషాదం చోటు చేసుకోకుండా ప్రభుత్వాలు గ్రామస్థాయి నుంచి పట్టణాలలోని ప్రతిఒక్కరికి మానసిక ఆరోగ్య సేవలు అందించాల్సిన అవశ్యకత ఉంది. వ్యక్తులలో తీవ్ర నిరాశ, అకస్మాత్తుగా ఇతర బాంధవ్యాలను తెంచుకోవడం లాంటి చర్యలు చేసేవారిని పరకాయిస్తుండాలి. కుటుంబ సంబంధ బాంధవ్యాలు క్షీణిస్తున్న దశలో ఇలాంటి వాటిపై సాటి కుటుంబ సభ్యులే శ్రద్ధ చూపించాలి. అందరికీ విద్యలాగే అందరికీ మానసిక ఆరోగ్య సేవలు వంటి కార్యాచరణకుప్రభుత్వాలు నడుం కట్టాలి. ఇక బతికి లాభం లేదు. నాతోపాటే నా కుటుంబమూ చావుఅంచుల్ని చూడాలనే ఆలోచన ఏ ఒక్కరిలోనూ రానీయరాదు. కుటుంబ సభ్యుల్లో కానీ, స్నేహితుల్లో కానీ ఒంటరిజీవితాన్ని అనుభవిస్తున్న వారిలో అసాధారణ ప్రవర్తన వంటి సంకేతాలు కనిపిస్తేవాటిని తేలికగా తీసుకోకూడదు. అలాంటి వారిపట్ల సానుభూతి చూపడం, సంయమనంతో మాట్లాడడం బాధ్యతగా తీసుకోవాలి. కుటుంబపరంగా ఆసహానానికి లోనయ్యే వారు, సమాజం పట్ల బాధ్యతగా ప్రవర్తించలేనివారిని సైతం అక్కున చేర్చుకుని వారి సమస్యను పరిష్కరించే ఆలోచన ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి. విచిత్రమైన సామూహిక ఆత్మహత్యల్లో తొలిసారిగా మానసిక ఆరోగ్యం,మూఢనమ్మ కాలపై చర్చకు దారితీసిన ఢిల్లీ బురారీ కేసు2018లో నమోదైంది. ఒకే కుటుంబానికి చెందిన 11మంది అనుమానాస్పదపరిస్థితుల్లో సామూహిక ఆత్మహత్యకు పాల్పడ్డారు.2021లో హైదరాబాద్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు కుటుంబ సమస్యలు, మానసిక ఆరోగ్యకారణాలతో ఆత్మహత్యచేసుకున్నారు. తెలంగాణ, కర్ణాకలో ఇలాంటివి వెలుగు చూస్తున్నాయి. 2024లో దేశవ్యాప్తంగా 116కుటుంబపు సామూహిక ఆత్మహత్యల కేసులు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో 11కేసులు నమోదవగా దేశం మొత్తంమీద 270మంది ఇలాంటి ఆత్మహత్యలు చేసుకుని ప్రాణం తీసుకున్నారు. కుటుంబ కౌన్సిలింగ్,డిప్రెషన్‌లో ఉన్నవారికి ఉచిత కౌన్సిలింగ్‌లు చేపట్టాల్సిన బాధ్యత కేంద్రఆరోగ్యశాఖ చేపట్టాలి.

విధి అంటూ ఎవరూ సృష్టించలేదు.
మనకు మనమే సృష్టించుకున్నాం.
మన మాట, ఆలోచన, ప్రవర్తన వల్ల
మన జీవితానికి మనమే బాధ్యులం.



డబ్ల్యు ఎమర్సన్

ఏ దేశం అభివృద్ధి చెందిందన్నా
అద్దాల మేడలు, రంగు గోడలు
అని కాదు అర్థం. పౌరుల
నైతికాభివృద్ధి.



మహాత్మా గాంధీ

# అవగాహనే కల్తీకి అసలైన అడ్డుకట్ట

డాక్టర్. వై. సంజీవ కుమార్

నేటి సమాజంలో కల్తీ అనేది కేవలం ఆహార పదార్థాలకే పరిమితం కాలేదు. మనం తినే ఆహారం నుంచి, తాగే నీరు వరకు, వాడే మందుల నుంచి, రోజువారీ వినియోగ వస్తువుల వరకు అనేక రంగాల్లో నాణ్యతలేని ఉత్పత్తులు విస్తరిస్తున్నాయి.ఫలితంగా ప్రజల ఆరోగ్యం,ఆర్థిక పరిస్థితి, పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటున్నాయి. నేటి సామాన్యుడు పెరుగుతున్న ధరలతో ఇప్పటికే కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నాడు. సంపాదన తక్కువ, ఖర్చులు ఎక్కువ. అలాంటి పరిస్థితుల్లో 'తక్కువ ధరకు వస్తే చాలు' అనే ఆలోచనతో వస్తువులను కొనుగోలు చేస్తున్నాడు.కానీతక్కువ ధర కోసం తీసుకున్న ఆ నిర్ణయమే కొన్నిసార్లు జీవితాంతం బాధను మిగులుస్తోంది. ఆహారంలో నాణ్యత లేకపోవడం వల్ల చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు అనేక రకాల అనారోగ్యసమస్యలు ఎదురవుతున్నాయి.కల్తీపాలు,నూనెలు, మసాలా దినుసులు, తీపి పదార్థాలు, పండ్లు, కూరగాయలు, తేనె వంటి అనేక ఆహారపదార్థాల్లో కల్తీ పెరుగుతోంది. ఇవి శరీరంలో నెమ్మదిగా విషంలా పనిచేసి క్యాన్సర్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ తాను సంపాదించిన డబ్బును వైద్య ఖర్చులకే వెచ్చించాల్సి వస్తోంది. చివరికి తక్కువ ధరకు కొన్నవస్తువు వల్ల ఎక్కువ నష్టాన్ని చవిచూస్తున్నాడు. ప్రజల ఆర్థిక బలహీనతను కొందరు వ్యాపారులు అవకాశంగా మలుచుకుంటున్నారు. నాణ్యత లేని ముడిపదార్థాలతో వస్తువులు తయారు చేసి, ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో మార్కెట్లో విక్రయిస్తూ అధిక లాభాలు పొందుతున్నారు. కొందరు నకిలీ బ్రాండ్ పేర్లతో ప్రజలను మోసం చేస్తున్నారు. నిజాయితీగా వ్యాపారంచేసే వారు నష్టపోతుండగా,అక్రమంగా సంపాదించే వారికి అవకాశాలు పెరుగుతున్నాయి. కల్తీని పూర్తిగా అరికట్టడం కష్టమే కావచ్చు. కానీ కఠినమైన చట్టాల అమలు, నిరంతర తనిఖీలు, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించే విధానం, నేరస్థులకు వేగవంతమైన శిక్షలు ఉంటే పరిస్థితిలో గణనీయ



మైన మార్పుతీసుకురావచ్చు. అలాగే వినియోగదారుల్లో అవగాహన పెరగడం కూడా అత్యంత అవసరం. ప్రజలు కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. కొనుగోలు చేసే వస్తువుల తయారీ తేదీ, గడువు తేదీ,నాణ్యత గుర్తులు, తయారీదారు వివరాలు పరిశీలించాలి. అనుమా నాస్పదమైన వస్తువులను కొనకుండా ఉండాలి. బిల్లు తప్ప నిసరిగా తీసుకోవాలి. కల్తీ లేదా నాణ్యతలేని వస్తువులు కనిపిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. వినియోగదారుల హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలి. ప్రభుత్వ శాఖలు, ఆహార భద్రత అధికారులు, వినియోగదారుల సంఘాలు,మీడియా, స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. కల్తీ ఉత్పత్తులను కొంతవరకైనా అరికట్టాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం. అందుకోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ఎవరైనా ఆహార పదార్థాలు, మందులు లేదా ఇతర వస్తువుల నాణ్యతపై అనుమానం వ్యక్తం చేస్తే, వెంటనే ఆ యాప్‌ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం ఉండాలి. ఆ యాప్‌లో వస్తువు ఫొటోలు, వీడియోలు, కొనుగోలు చేసిన బిల్లు,దుకాణం పేరు, చిరునామా, కొనుగోలు చేసిన తేదీ, లొకేషన్ వంటి వివరాలను నమోదు చేసే సౌకర్యం కల్పించాలి. ఫిర్యాదు నమోదైన వెంటనే అది సంబంధిత ఆహార భద్రత, వినియోగదారుల పరిరక్షణ లేదా ఇతర తనిఖీ అధికారులకు చేరేలా వ్యవస్థ రూపొందించాలి. ప్రతి ఫిర్యాదుకు ఒక ప్రత్యేక ట్రాకింగ్ నంబర్ ఇచ్చి,దాని పురోగతిని ఫిర్యాదు చేసిన వ్యక్తి యాప్‌లోనే తెలుసుకునే అవకాశం కల్పించాలి. ఫిర్యాదు నిజమని తేలితే సంబంధిత వ్యాపార సంస్థపై వెంటనే తనిఖీలు నిర్వహించి, అవసరమైతే వస్తువులను స్వాధీనం చేసుకోవడం, భారీ జరిమానాలు విధించడం, లైసెన్స్ రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలి. అదే విధంగా, ఒకే దుకాణం లేదా తయారీ సంస్థపై పదేపదే ఫిర్యాదులు వస్తే వాటిని ప్రత్యేకంగా గుర్తించి కఠిన పర్యవేక్షణలో ఉంచాలి. తప్పుడు ఫిర్యాదులు తగ్గించేందుకు ఆధారాలతో కూడిన ఫిర్యాదులకే ప్రాధాన్యత ఇవ్వాలి. ●

# ప్రజాస్వామ్య దిశానిర్దేశకుడు ఓటరే..

ఫిరోజ్ ఖాన్

రాజకీయ సభల్లో హాజరైన జనసందోహమే ప్రజాభిప్రాయం కాదు. సోషల్ మీడియాలో వైరల్ అయ్యే ప్రచారమే ఓటర్ల తుది నిర్ణయమూ కాదు. చివరకు ఎన్నికలఫలితాన్ని నిర్ణయించేది మౌనంగా ఉండే ఓటరేనా? ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఎక్కువగా చర్చకు వస్తున్న ప్రశ్న ఇదే. రాష్ట్రంలో 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మార్పు చోటుచేసుకుంది. ఎన్నికల ముందు వెలువడిన వివిధ రాజకీయ విశ్లేషణలు, సర్వేలు, ప్రజా చర్చలతో పోలిస్తే తుది ఫలితాలపై భిన్న వ్యాఖ్యానాలు వ్యక్తమయ్యాయి. దీంతో 'సైలెంట్ ఓటర్' పాత్రపై మరోసారి చర్చ ప్రారంభమైంది. భారత ఎన్నికల సంఘం అధికారిక గణాంకాల ప్రకారం, గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 71 శాతం పోలింగ్ నమోదైంది. ఇది ప్రజాస్వామ్య భాగస్వామ్యం బలంగా కొనసాగుతోందని సూచిస్తుంది. మరోవైపు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రతి అర్హుడైన పౌరుడికి సార్వత్రిక ఓటు హక్కును కల్పిస్తే, 2013లో 'పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పీయూసీఎల్) వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో రహస్య ఓటు ప్రజాస్వామ్య సమగ్రతకు కీలకమైన అంశమని సుప్రీంకోర్టు పేర్కొంది. అందువల్ల ఓటరు తన రాజకీయ అభిప్రాయాన్ని బహిరంగంగా వెల్లడించకపోయినా, పోలింగ్ కేంద్రంలో తీసుకునే నిర్ణయమే ప్రజాస్వామ్యానికి అసలు నిర్వచనంగా నిలుస్తుంది. సైలెంట్ ఓటర్‌ను ఒకే కులం, ఒకే మతం, ఒకే వర్గం లేదా ఒకే పార్టీతో ముడిపెట్టడం ప్రజాస్వామ్య వాస్తవాలను అతిగా సరళీకరించినట్లే అవుతుంది. భారత ఎన్నికల సంఘం విడుదల చేసే పోలింగ్ శాతం, ఓటరు జాబితా సవరణలు, ఓటర్ల గణాంకాలు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని మాత్రమే అందిస్తాయి. కానీ ఓటరు ఎందుకు ఒక నిర్ణయం తీసుకున్నాడో చెప్పవు. సీఎస్‌డీఎస్ (సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్-లోక్‌నీతి) వంటి సంస్థలు నిర్వహించిన ఎన్నికల అనంతర అధ్యయనాలు, ఓటర్ల నిర్ణయాన్ని ఒక్క అంశంతో వివరించడం సాధ్యం కాదని, అనేక సామాజిక, ఆర్థిక, స్థానిక అంశాలు కలిసే ప్రభావం చూపుతాయని సూచిస్తున్నాయి. పాలనపై అభిప్రాయం, స్థానిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, రైతు సమస్యలు, మహిళల భద్రత, ధరల పెరుగుదల, సంక్షేమ పథకాల అమలు,అభ్యర్థి విశ్వసనీయత, ప్రాంతీయ సమస్యలు ఇలాంటి అనేక అంశాలు కలిసి ఓటరు నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. తెలంగాణలో పట్టణ-గ్రామీణ ప్రాంతాల అవసరాలు, ప్రాధాన్యతలు భిన్నంగా ఉండటంతో రాజకీయ స్పందన కూడా ఒకేలా ఉండదు. అందుకే ప్రతి రాజకీయ పార్టీ వివిధ సామాజిక



వర్గాలతో నిరంతర సంబంధం కొనసాగించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజమైన రాజకీయ ప్రక్రియ. అయితే తుది నిర్ణయం మాత్రం ఓటరు స్వతంత్ర అభిప్రాయం, వ్యక్తిగత అనుభవం, విశ్వాసంపైనే ఆధారపడి ఉంటుంది. రాజకీయ కమ్యూనికేషన్ గత దశాబ్దంలో గణనీయంగా మారిపోయింది. ఒకప్పుడు బహిరంగ సభలు, పోస్టర్లు, సంప్రదాయ ప్రచారమే ప్రధాన సాధనాలు కాగా, ఇప్పుడు సోషల్ మీడియా, డిజిటల్ ప్రచారం, డేటా ఆధారిత వ్యూహాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అదే సమయంలో సమాచార వేగం పెరిగిన కొద్దీ వాస్తవ నిర్ధారణ అవసరమూ పెరిగింది. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ ప్రజలతో మమేకం కావడానికి విభిన్న పద్ధతులను అనుసరిస్తున్నాయి. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజమైన పోటీ. అయితే ప్రచార తీవ్రత ఒక్కటే ప్రజాభిప్రాయాన్ని కొలిచే ప్రమాణం కాదని రాజకీయ విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు. ఓటరు తన కుటుంబ ఆర్థిక పరిస్థితి, స్థానిక మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సేవల అనుభవం, ప్రజాప్రతినిధు ల అందుబాటు, భవిష్యత్‌పై నమ్మకం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటాడు. అందువల్ల రాజకీయ సైకాలజీ అంటే భావోద్వేగాలను ప్రభావితం చేయడం మాత్రమే కాదు, ప్రజల్లో విశ్వాసాన్ని నిర్మించడం, నిలబెట్టుకోవడం, విశ్వసనీయతను సంపాదించడం కూడా అంతే కీలకమైన అంశంగా మారింది. డిజిటల్ ప్రచారం ఎంత విస్తరించినా, ఓటరు వ్యక్తిగత అనుభవం, స్థానిక వాస్తవాలు, పాలనపై తన అంచనాలే చివరికి అతని నిర్ణయాన్ని ప్రభావితం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రాజకీయ పార్టీలు వ్యూహాలు రూపొందించడం, ప్రజలను ఆకర్షించే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజం. అదే సమయంలో ప్రతి పార్టీ తన విధానాలు, పనితీరు, నాయకత్వాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లే హక్కు కూడా కలిగి ఉంటుంది. కానీ ఆ ప్రయత్నాలన్నింటికీ తుది తీర్పు ఇచ్చేది ఓటరే. అందుకే 'సైలెంట్ ఓటర్' అనేది ఏ ఒక్క పార్టీకి చెందిన రాజకీయ పదం కాదు. అది భారత ప్రజా స్వామ్య స్వేచ్ఛకు ప్రతీక. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రచారం దృష్టినిఆకర్షించవచ్చు, రాజకీయ నినాదాలు చర్చను సృష్టించవచ్చు, డిజిటల్ ట్రెండ్లు అభిప్రాయాలను ప్రభావితం చేయవచ్చు. కానీ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునేది పారదర్శక పాలన, జవాబుదారీతనం,అభివృద్ధి, రాజ్యాంగ విలువలపట్ల నిబద్ధత మాత్రమే. చివరికి ఎన్నికల ఫలితాలు ఏపార్టీ విజయాన్ని మాత్రమే కాదు, మౌనంగా తన నిర్ణయాన్ని వ్యక్తపరిచిన లక్షలాది ఓటర్ల సమిష్టి తీర్పు ను కూడా ప్రతిబింబిస్తాయి. అందుకే రాజకీయాలను అర్థం చేసుకోవాలంటే నాయకుల ప్రసంగాల కంటే ప్రజల జీవితా లను, ప్రచారాల కంటే ప్రజల అనుభవాలను, నినాదాల కంటే ప్రజల విశ్వాసాన్ని వినడం అవసరం. ప్రచారం ప్రజల దృష్టిని ఆకర్షించవచ్చు, కానీ ప్రజాస్వామ్యానికి దిశను నిర్దేశించేది చివరికి ఓటరే. ●

# ప్రజావాక్కు



### అత్యవసర సాగునీటి ప్రణాళికలు అవసరం

దక్షిణ భారత వ్యవసాయానికి నైరుతిరుతుపవనాలు జీవనాధారం. అయితే ఈ ఏడాది తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో నమోదవుతున్న వర్షాభావం రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఖరీఫ్ సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ, ఆశించినస్థాయిలో వర్షాలు లేకపోవడంతో పంటల ఎదుగుదలపై అనిశ్చితి నెలకొంది. ఇప్పటికే అనేక మండలాల్లో వర్షపాతం లోటు నమోదవగా, జలాశయాల్లోనూ నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేకపోవడంపరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోంది. వాతావరణమార్పుల ప్రభావంతో వర్షాల స్వభావంలో వస్తున్న మార్పులు వ్యవసాయ రంగానికి కొత్తసవాళ్లను విసురుతున్నాయి. విత్తనాలు వేసిన రైతులు మళ్లీ విత్తాల్సిన పరిస్థితులు ఏర్పడితే పెట్టుబడి భారం పెరిగే ప్రమాదం ఉంది. వర్షాలపై ఆధారపడిన చిన్న, సన్నకారు రైతులే ఈ పరిస్థితికి ఎక్కువగా నష్టపోతారు. ఇది రైతుల ఆదాయంపైనే కాకుండా, ఆహార భద్రతపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది.ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి రెండు తెలుగురాష్ట్రాల ప్రభుత్వాలు ముందస్తుచర్యలు చేపట్టాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వ్యవసాయ బావులు తవ్వించాలి

గతంలో ప్రభుత్వం సన్న, చిన్న కారు రైతులకు. ఎస్సి, ఎస్టీ, రైతులకు పంట పొలాలకు సాగు నీరు అందించడంకోసం వ్యవసాయంకొరకు బావులు అవసరం ఉంది. వివిధ కార్పొరేషన్‌ల వార్షిక బడ్జెట్‌లో నుండి రైతు లకు బావులు త్రవించాలి. ఉపాధి హామీ పథకం కూలీల సహాయంతోతవ్వించాలి. దీంతో ఉపాధి హామీ కూలీలకు ఉపాధి కల్పించినట్లు అవుతుంది. రైతులకు పుష్కలంగా సాగు బడి కోసం నీరు అందుతుంది. చెరువులు, కెనాల్ కాలువలలో నీటి సామర్థ్యం పెరుగుతుంది. కనుక ప్రభుత్వం వ్యవసాయ బావులు తవ్వించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

### ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వ ఆఫీసులలో నెలల తరబడి దరఖాస్తులు అయిన కళ్యాణలక్ష్మి ‚ రేషన్ కార్డు, తదితర దరఖాస్తులను ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించాలి. వివిధ పనుల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న ప్రజలకు సకాలంలో అందాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారులు వీలై నంత తొందరగా పరిష్కరించాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ఏటిఎంలలో నగదు కొరత!

ఒకప్పుడు బ్యాంకు ఖాతాదారులు తమ బ్యాంకు శాఖలకు నేరుగా వెళ్లి నగదు తీసుకునే పరిస్థితి వుండేది. ప్రస్తుతం దేశమంతటా ఏటిఎంలు రావడంతో ఖాతాదారుడు బ్యాంకు శాఖలకు వెళ్లి నగదు తీసుకునే శ్రమ చాలా వరకూ తప్పింది. దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకుల శాఖలు తమ ఖాతాదారులకు ఏటిఎం కార్డుల సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే దేశవ్యాప్తంగా ఇప్పుడు కొన్ని నగరాల్లోని ఏటిఎంలలో బ్యాంకులు సరిపడా నగదునిల్వలు ఉంచడం లేదు. గత మూడు నాలుగు నెలలుగా ఈ సమస్య మరింత ఎక్కువగా వుంటుంది. చిన్న చిన్న నగరాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా వుండటంతో బ్యాంకు ఖాతాదారులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈవిషయంలో భారత రిజర్వు బ్యాంకు అన్ని బ్యాంకుల శాఖలకు దిశానిర్దేశం చేసి ఏటిఎంలలో నగదు నింపే విధంగా చర్యలు తీసుకోవాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### ఆరోగ్యంగా ఎదగాలి

ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు ఇడ్లీ, రైస్‌సాంబర్ లేదా ఇతర బలమైన ఆహారంతో మెత్తగా కలిపి తినిపించడం చూస్తుంటాము. ఇకచాలు అన్నాకూడావినకుండా చందమామ, కాకమ్మ కథలు చెబుతూ బలవంతంగా ముద్దనోట్లో కుక్కుతుంటారు. ఇలా చేయడం వల్ల ఒక్కోసారి అజీర్తి, వాంతులు చేసుకొని ఏడుస్తుంటారు. దాంతో కన్నవాళ్లకు ఆందోలన కలగడం సహజం. ఇది ఏమాత్రం బిడ్డ ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యనిపుణులు చెబుతుంటారు. చిరుతిళ్లు తినే పిల్లలకు ఆకలి మందగించడం వల్ల ఫుడ్ సరిగ్గా తినరు. కావున వీలైనంతవరకు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచాలి.ఎదిగే పిల్లలకు వెరైటీగా రాగిజావ, ఉడికించిన కూరగాయలు, అన్నంలో కలిపి పెట్టాలి. అలాగే ఫ్రూట్ సలాడ్స్ అందించాలి.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### పెరుగుతున్న లింగ వివక్ష

గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయక పురుషాధిక్య ధోరణులు, బాల్యవివాహాలు,చదువు ఆపివేయడం వంటి సమస్యలు ఉన్నాయి. వ్యవసాయరంగంలో సమానంగా శ్రమిస్తున్నప్పటికీ మహిళా కూలీలకు తక్కువ వేతనాలు ఇస్తున్నారు. భూమిపై యాజమాన్య హక్కులు లేకపోవడం వల్ల మహిళలు ఆర్థిక స్వయంప్రతిపత్తి సాధించలేకపోతున్నారు. పట్టణ ప్రాంతాలలో కార్పొరేట్ సంస్థల ఉన్నత పదవులలో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉంది.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# సెమీకాన్ 2.0కు గ్రీన్‌సిగ్నల్




● రూ.1.28 లక్షల కోట్లు కేటాయింపు ● భారత్‌లో ఫోన్ల తయారీకి రూ.62.500 కోట్లు ● వారణాసిలో 2 మెగా ఎలివేటెడ్ కారిడార్లకు ఓకే ● రైల్వే విస్తరణ, ఎరువుల ఉత్పత్తి తదితర 7 కీలకప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ ఆమోదం ● వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ, జులై 15:** మౌలిక సదుపాయాలు, సెమీకండక్టర్లు, మొబైల్ తయారీ, రైల్వేలు, యూరియా తదితర రంగాలకు సంబంధించిన 7 కీలక ప్రతిపాదనలకు బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిర్వహించిన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం రూ.2,19,353 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులు భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపనున్నాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధికి అవసరమైన కీలకరంగాల్లో పెట్టుబడులను పెంచడం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం ఈ నిర్ణయాల ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. సెమీకండక్టర్ రంగానికి సంబంధించిన కీలక కార్యక్రమాన్ని విస్తరిస్తూ రూ. 1.28 లక్షల కోట్ల (రూ.1,27,500 కోట్లు) అదనపు నిధులను కేటాయించేందుకు, అలాగే మొబైల్ ఫోన్ తయారీకోసం రూ. 62,500 కోట్ల వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. కేబినెట్ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ, భారతదేశంలో సెమీకండక్టర్ డిజైన్, తయారీ వ్యవస్థ (ఎకోసిస్టమ్) అభివృద్ధి కోసం ప్రభుత్వం "సెమీకాన్ 2.0 కార్యక్రమానికి ఆమోదం తెలిపిందని వైష్ణవ్ చెప్పారు. సెమీకాన్ 2.0 కార్యక్రమం ఆరు ప్రధాన అంశాల (స్తంభాల) ఆధారంగా రూపొందించబడుతుందని వైష్ణవ్ పేర్కొన్నారు. 1.చిప్ డిజైన్, 2. యంత్రాలు- ముడి పదార్థాలు, 3. కొత్త సెమీకండక్టర్ తయారీ కేంద్రాల ఏర్పాటు, 4.అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్. అలాగే అవుట్‌సోర్స్ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్ట్ ప్యాకేజింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం. 5. పరిశోధన, అభివృద్ధి. 6. నైపుణ్యాల అభివృద్ధి (టాలెంట్ డెవలప్‌మెంట్). ఈ కార్యక్రమం మొదటి దశ అయిన 'సెమీకాన్ 1.0 విజయవంతమైందని పేర్కొన్న వైష్ణవ్, ఇప్పటికే మూడు ప్లాంట్లలో చిప్ ఉత్పత్తి ప్రారంభమైందని తెలిపారు. "ఇది ఒక వ్యూహాత్మక పరిశ్రమ. ప్రపంచంలోని అతికొద్ది దేశాలు దీనిని ఇప్పటికే వ్యూహాత్మక పరిశ్రమగా ప్రకటించాయి. సెమీకాన్ 1.0 కింద ఆమోదించబడిన 12 సెమీకండక్టర్‌ప్లాంట్లలో, మూడు ప్లాంట్లలో వాణిజ్య పరమైన ఉత్పత్తి ఇప్పటికే ప్రారంభమైంది అని ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న వైష్ణవ్ అన్నారు. రాబోయే ఐదేళ్లలో రూ.62,500 కోట్ల బడ్జెట్ కేటాయింపుతో 'మొబైల్ ఫోన్ తయారీ పథకాన్ని ప్రకటించినట్లు కేంద్ర మంత్రి వైష్ణవ్ తెలిపారు. ఉత్పత్తిని పెంచడానికి, దేశీయ విలువ జోడింపును మరింతగా పెంపొందించడానికి, సరఫరా గొలుసు స్థితిస్థాపకతను బలోపేతం చేయడానికి, 'మేడ్ ఇన్ ఇండియా' మొబైల్ ఫోన్ల ప్రపంచ పోటీతత్వాన్ని మెరుగుపరచడానికి ఈ నిధులను వినియోగిస్తామని పేర్కొన్నారు. ఈ పథకం కింద, భారతదేశంలో మొబైల్ ఫోన్ తయారీకి సంబంధించిన అర్హత గల అమ్మకాలపై ప్రభుత్వం 2.25 శాతం నుండి 5 శాతం వరకు వేర్వేరు రేట్లలో ప్రోత్సాహకాలను అందిస్తుంది. అలాగే,కీలకమైన భాగాలు, సబ్‌అసెంబ్లీల దేశీయ సేకరణను అనుసంధానంగా 1.5 శాతం వరకు అదనపు ప్రోత్సాహకాన్ని కూడా అందిస్తుంది. భారతీయ బ్రాండ్‌లను నిర్మించే లక్ష్యంతో ఉత్పత్తి రూపకల్పన, ఆర్ డి కోసం అర్హత గల అమ్మకాలపై ప్రభుత్వం 3 శాతం అదనపు ప్రోత్సాహకాన్ని అందిస్తుంది. వారణాసికి వేగంగా పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు రెండు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. మొదటి ప్రాజెక్టుగా వరుణా నది వెంట 6/4 లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. దీనికి రూ.10,998 కోట్ల వ్యయం అవుతుంది. వారణాసి రింగ్ రోడ్డును జాతీయ రహదారి31తో అనుసంధానం చేసే ఈ ప్రాజెక్టు మొత్తం 43.21 కిలో మీటర్ల మేర నిర్మించబడుతుంది. రెండో ప్రాజెక్టుగా గంగా నది వెంట 6 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.14,448 కోట్లుగా అంచనా వేశారు.

**రైల్వే రంగానికి మరో రెండు ప్రాజెక్టులు**

దేశంలో సరుకు రవాణా, ప్రయాణికుల రాకపోకలను మరింత వేగవంతం చేసేందుకు కేంద్రం రెండు కీలక రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఒడిశాలోని పరదీప్ హరిదాస్‌పూర్ రైల్వే మార్గం డబ్లింగ్ పనులకు రూ.2,542 కోట్ల వ్యయాన్ని ఆమోదించింది. దీంతో పోర్టు ప్రాంతాల నుంచి సరుకు రవాణా మరింత సులభతరం కానుంది. అలాగే దంగోపోసింగ్ ఖర్సవాన్ మధ్య నాలుగో రైల్వే లైన్ నిర్మాణానికి రూ.1,365 కోట్ల పెట్టుబడికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే తూర్పు భారతదేశంలో రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగనుంది.

## టిఎంసిలో ఎమ్మెల్యే రాజీనామా

### కేసులభయంతో రెబెల్ శిబిరంలోకి మదన్ మిత్రా



**కోల్‌కతా,జులై 15:** పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)లో అంతర్గత విభేదాలు మరింత ముదురుతున్నాయి. సీనియర్ టిఎంసి ఎమ్మెల్యే మదన్ మిత్రా బుధవారం ప్రతిపక్ష నేత రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు శిబిరంలో చేరడం పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ వర్గానికి మరో రాజకీయ షాక్‌గా మారింది. తాను ఇప్పటికీ టిఎంసి సభ్యుడినేనని మదన్ మిత్రా స్పష్టం చేశారు. కమర్హాటి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మదన్ మిత్రా, మమతా బెనర్జీ వర్గానికి చెందిన "కాళీఘాట్ టిఎంసి" జాతీయ, రాష్ట్ర స్థాయి అన్ని సంస్థాగత కమిటీలకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో పార్టీ చీఫ్ విప్ పదవికి కూడా తక్షణమే రాజీనామా చేశారు. అసెంబ్లీలో రితబ్రత బెనర్జీని ఆయన కార్యాలయంలో కలిసి అనంతరం మీడియాతో మాట్లాడిన మదన్ మిత్రా, నేను ఇల్లు మార్చలేదు.. కేవలం గది మాత్రమే మార్చాను. నేను ఇప్పటికీ తృణమూల్ కాంగ్రెస్‌లోనే ఉన్నానని వ్యాఖ్యానించారు. తెల్లటి కుర్తా, తన ప్రత్యేకమైన నల్లటి కళ్లద్దాలతో రితబ్రత బెనర్జీ పక్కన కూర్చున్న మదన్ మిత్రా, మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గంలో ఇకపై ఎలాంటి సంస్థాగత బాధ్యతలు చేపట్టబోనని, అయితే టిఎంసి ఎమ్మెల్యేగా కొనసాగుతానని వెల్లడించారు. కాళీఘాట్ టిఎంసికి చెందిన జాతీయ, రాష్ట్ర కమిటీలన్నింటి నుంచి రాజీనామా చేస్తున్నాను. అలాగే చీఫ్ విప్ పదవినీ వీడుతున్నాను. కానీ నేను టిఎంసి ఎమ్మెల్యేగానే కొనసాగుతానని ఆయన తెలిపారు. టిఎంసిలో సంస్థాగత విభజన బహిర్గతమైన తర్వాత తిరుగుబాటు శిబిరంలో చేరిన అత్యంత ప్రముఖ నేతగా మదన్ మిత్రా నిలిచారు. దీంతో మమతా బెనర్జీ వర్గం ఎదుర్కొంటున్న రాజకీయ సంక్షోభం మరింత తీవ్రమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. టిఎంసిలో ప్రజాదరణ కలిగిన కీలక నాయకుడిగా, మమతా బెనర్జీకి సుదీర్ఘకాలం అత్యంత సన్నిహిత సహచరుడిగా పేరుగాంచిన మదన్ మిత్రా, ఇటీవల పార్టీ నాయకత్వంలోని కొన్ని వర్గాలపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. అయినప్పటికీ పార్టీని వీడే ఉద్దేశం లేదని పలుమార్లు స్పష్టం చేశారు.అయితే ఇప్పుడు రితబ్రత బెనర్జీ శిబిరానికి మద్దతు ప్రకటించడం ద్వారా తిరుగుబాటు వర్గానికి ఇప్పటివరకు లభించిన అత్యంత ప్రముఖ రాజకీయ ముఖచిత్రంగా మారారు.

## గల్ఫ్‌నౌకల్లో ఉన్న ప్రతి భారతీయ నావికుడి వివరాలు ప్రత్యేక నమోదు

### కేంద్ర షిప్పింగ్ శాఖ తాజా ఆదేశాలు

**న్యూఢిల్లీ,జులై 15:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ గల్ఫ్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ప్రతి భారత నావికుడి వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. నౌక ఏ దేశ జెండాతో ప్రయాణిస్తున్నా అందులో పనిచేస్తున్న ప్రతి భారతీయుడిపై పూర్తి సమాచారం ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్‌కు కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ఆదేశాలు జారీ చేశారు. పర్షియన్ గల్ఫ్, హార్మూజ్ జలసంధి, ఒమన్ గల్ఫ్‌లో ప్రయాణిస్తున్న ప్రతి నౌకపై ప్రత్యేక ఆపరేషనల్ డ్యాష్‌బోర్డ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ డ్యాష్‌బోర్డ్‌లో నౌక ఉన్న ప్రాంతం, యాజమాన్యం, సరకు వివరాలు, సిబ్బంది సంఖ్య, భారతీయ నావికుల సంక్షేమం, భద్రతా పరిస్థితి, ప్రయాణ మార్గం, చేరాల్సిన పోర్టు, అందుబాటులో ఉన్న సౌకర్యాల వంటి సమాచారం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటుంది. వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులను భారత్ తీవ్రంగా ఖండించిందని సోనోవాల్ తెలిపారు. ఈ దాడుల్లో భారత నావికులు ప్రాణాలు కోల్పోవడం, మరికొందరు గాయపడటం తీవ్ర వేదన కలిగించిందని చెప్పారు. ప్రపంచ సరఫరా వ్యవస్థ కొనసాగడంలో కీలక పాత్ర పోషిస్తున్న భారత నావికులపై ఇలాంటి దాడులు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఇరాన్, ఒమన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని భారత రాయబార కార్యాలయాలు, విదేశాంగ శాఖతో సమన్వయం పెంచాలని అధికారులను మంత్రి ఆదేశించారు. నౌకాయాన భద్రత, ప్రత్యామ్నాయ పోర్టులు, వైద్య సాయం, తరలింపు, స్వదేశానికి పంపే ఏర్పాట్లు, దర్యాప్తు పురోగతిపై ఎప్పటికప్పుడు ధ్రువీకరించిన సమాచారం సేకరించాలని సూచించారు. అలాగే గల్ఫ్ ప్రాంతంలో భారతీయ నావికులను నియమించిన షిప్పింగ్ కంపెనీలు, నౌకల నిర్వహణ సంస్థలు, రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు వెంటనే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పూర్తి సమాచారం, భద్రత, అవసరమైన సాయం లేకుండా ఏ భారతీయ నావికుడినీ విధులకు పంపొద్దని స్పష్టం చేశారు.




## 19 యేళ్ల తర్వాత కోల్‌కతాకు తిరిగి వస్తున్న తస్లీమా నస్రీన్

### రాజకీయ వివాదానికి దారితీసిన పర్యటన

**కోల్‌కతా, జులై 15:** బంగ్లాదేశ్‌కు చెందిన ప్రవాస రచయిత్రి, మానవ హక్కుల కార్యకర్త తస్లీమా నస్రీన్ దాదాపు రెండు దశాబ్దాల అనంతరం కోల్‌కతాకు తిరిగి రానున్నారు. ఆమె రచనలపై గతంలో తీవ్ర నిరసనలు చెలరేగడంతో 2007లో నగరాన్ని విడిచిపెట్టాల్సి వచ్చిన సంగతి తెలిసిందే.63 యేళ్ల తస్లీమా నస్రీన్ రాసిన ఆత్మకథాత్మక గ్రంథం"ద్విఖండితో పై దైవదూషణ ఆరోపణలు రావడంతో అప్పటి సిపిఎం ప్రభుత్వం ఆ పుస్తకాన్ని నిషేధించింది. 2004 నుంచి 2007 వరకు కోల్‌కతాలో నివసించిన ఆమె ప్రస్తుతం దీర్ఘకాలిక నివాస అనుమతితో ఢిల్లీలో ఉంటున్నారు.ఈ నేపథ్యంలో 2026 ఆగస్టు 1న రబీంద్ర సదన్‌లో నిర్వహించనున్నమౌలికవాద వ్యతిరేక కార్యక్రమానికి ఆమె హాజరుకానున్నారు. 2007 తర్వాత కోల్‌కతాకు ఇది ఆమె తొలి పర్యటన. మూడు సంస్థల సంయుక్త ఆహ్వానం మేరకు ఆమె ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తస్లీమా నస్రీన్ కొన్ని కవితలు పఠించడంతో పాటు చర్చలో పాల్గొననున్నారు. ఆమె గౌరవార్థం పౌర సత్కారం కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి సువేందు అధికారి, రాష్ట్ర ఆర్థిక మంత్రి స్వపన్ దాస్‌గుప్తా, ప్రముఖ రచయిత శీర్షేందు ముఖోపాధ్యాయ్ హాజరయ్యే అవకాశ ముందని నిర్వాహకులు వెల్లడించారు.అయితే ఆమె పర్యటన ఇప్పటికే రాజకీయ వివాదానికి దారి తీసింది. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య మాట్లాడుతూ, తస్లీమా నస్రీన్ స్వరాన్ని ఎందుకు అణచివేయాలి, బంగ్లాదేశ్‌లో హిందూ కుటుంబం ఎదుర్కొన్న హింసను లజ్జాలో ఆమె రాశారు. గత వామపక్ష ప్రభుత్వం ఆమె రచనలను నిషేధించింది. కోల్‌కతాకు ఆమె రావడాన్ని మేము స్వాగతిస్తున్నామన్నారు. బంగ్లాదేశ్‌లో ఇప్పటికీ నిషేధంలో ఉన్న లజ్జా నవలలో అక్కడి హిందువులు, ఇతర మతపు మైనారిటీలపై జరిగిన అవమానం, హింసను చిత్రీకరించారు.మరోవైపు తృణమూల్ ఎమ్మెల్యే అఖ్రుజ్జమాన్ స్పందిస్తూ, తస్లీమా నస్రీన్ తరచూ ముస్లింలపై విమర్శలు చేస్తారని, అందుకే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఆమెను గౌరవిస్తోందని ఆరోపించారు.

## మోస్ట్‌వాంటెడ్ జాబితాలో గ్యాంగ్‌స్టర్ నితీశ్ కౌశల్



**వాషింగ్టన్,జులై 15:** అగ్ర రాజ్యం అమెరికాలో అంతర్జాతీయ నేర ముఠాలపై ఎఫ్‌బీఐ చర్యలను వేగవంతం చేసింది. తాజాగా భారత మూలాలున్న నితీశ్ కౌశల్‌ను మోస్ట్ వాంటెడ్ నేరస్థుల జాబితాలోచేర్చింది. హత్యలు, కిడ్నాప్‌లు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వసూళ్లు, ఆయుధాల అక్రమ రవాణా, మనీ లాండరింగ్, మానవ అక్రమ రవాణా వంటి నేరాల్లో అతనికి ప్రమేయం ఉన్నట్లు ఎఫ్‌బీఐ ఆరోపించింది. నితీశ్ కౌశల్‌కు జగ్గు భగవాన్‌పురియా ఆర్గనైజ్డ్ క్రిమినల్ గ్రూప్‌తో సంబంధాలు ఉన్నాయి. పంజాబ్‌లో ప్రారంభమైన ఈ ముఠా అమెరికాలోని కాలిఫోర్నియా సెంట్రల్ జిల్లా సహా పలు ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి.

## ఆ ముగ్గురికి క్లీన్‌చిట్ ఇవ్వడమా?

### చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట కేసులో కాంగ్రెస్ సర్కార్‌పై అశోక్ తీవ్ర విమర్శలు




**బెంగళూరు, జులై 15:** గత యేడాది బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయిన కేసులో ముగ్గురు సీనియర్ ఐపిఎస్అధికారులకు కర్ణాటక ప్రభుత్వం క్లీన్ చిట్ ఇవ్వడంపై రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు అశోక్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బాధ్యులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.జూన్ 4, 2025న జరిగిన ఈ విషాద ఘటనకు సంబంధించి సీనియర్ ఐపిఎస్ అధికారులు బి. దయానంద, వికాస్ కుమార్ వికాస్, శేఖర్ హెచ్. తెక్కన్నవర్‌లపై ప్రారంభించిన శాఖాపరమైన విచారణలను ప్రభుత్వం ఉపసంహరించుకోవడాన్ని ప్రశ్నించిన అశోక్ ఈ ఘటనకు అసలు బాధ్యులు ఎవరో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. బిడ్డలను కోల్పోయిన తల్లిదండ్రుల కన్నీళ్లు, వారి శాపం ఈ హంతకకాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టదని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 11 మంది అమాయక యువతకు న్యాయం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అశోక్ ఆరోపించారు. ఈ విషాదాన్ని ప్రభుత్వ ప్రాయోజిత హత్యగా అభివర్ణిస్తూ, బాధ్యులను రక్షించడమే ప్రభుత్వ లక్ష్యంగా మారిందని విమర్శించారు. చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన భయానక తొక్కిసలాటలో 11 మంది అమాయక యువతీయువకుల మరణాలకు నిజమైన బాధ్యులు ఎవరు ఈ ప్రభుత్వ ప్రాయోజిత విషాదానికి న్యాయం ఎక్కడని ఆయన ప్రశ్నించారు.అప్పటి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఒకే రోజు రెండు వేదికల్లో ఐపీఎల్ విజయోత్సవాలకు అనుమతి ఇచ్చారని, అదే సమయంలో అప్పటి ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ విషాద పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఆర్సీబీ జెండాతో ఫోటోలకు పోజులిచ్చారని అశోక్ ఆరోపించారు.అలాగే పోలీసులు ముందుగానే హెచ్చరించినప్పటికీ, అప్పటి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ (డీపీఏఆర్) కార్యదర్శి సత్యవతి విధానసౌధ ముందు కార్యక్రమం నిర్వహించాలంటూ పట్టుబట్టారని, మొత్తం పరిపాలనా యంత్రాంగాన్ని అప్పటి ప్రధాన కార్యదర్శి షాలిని రజనీష్ పర్యవేక్షించారని పేర్కొన్నారు. ఇప్పుడు సిద్ధరామయ్యకు తప్పులేదు, డి.కె. శివకుమార్ అమాయకుడు, ప్రధాన కార్యదర్శికి ఎలాంటి బాధ్యతలేదు, డిపిఏఆర్ కార్యదర్శి నిర్దోషి, ఇప్పుడు పోలీసు అధికారులూ నిర్దోషులయ్యారు.మరి ఆ 11మంది అమాయకుల మరణాలకు బాధ్యులు ఎవరు వాళ్లు తమంతట తామే చనిపోయారా అంటూ ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం నియమించే ప్రతి విచారణ కూడా నిజాలను వెలికితీయడానికి కాకుండా కేసును పూడ్చిపెట్టడానికేనని అప్పుడే చెప్పానన్నారు. కాగా, జూన్ 4, 2025న జరిగిన చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట కేసులో సీనియర్ ఐపిఎస్ అధికారులు బి. దయానంద, వికాస్ కుమార్ వికాస్, శేఖర్ హెచ్. తెక్కన్నవర్‌లపై ప్రారంభించిన శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలను కర్ణాటక ప్రభుత్వం మంగళవారం అధికారికంగా విరమించుకుంది. అఖిల భారత సర్వీసుల (క్రమశిక్షణ, అప్పీల్) నిబంధనలు1969 ప్రకారం ప్రారంభించిన విచారణలను సంబంధిత అధికారుల వివరణలు, పరిపాలనా శాఖ అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం మూసివేస్తున్నట్లు డిపిఏఆర్ (సర్వీసెస్4) శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది.2025 జూన్ 4న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబి) తొలి ఐపిఎల్ టైటిల్ విజయోత్సవాల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వెలుపల భారీ సంఖ్యలో అభిమానులు గుమిగూడడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో అధికారిక లెక్కల ప్రకారం 11 మంది మృతి చెందగా, కనీసం 56 మంది గాయపడ్డారు.

## సుప్రీంకోర్టులో హంగామా చేసిన ఇద్దరు న్యాయవిద్యార్థుల అరెస్టు

**న్యూఢిల్లీ,జులై 15:** సుప్రీంకోర్టులో న్యాయ విచారణకు అంతరాయం కలిగించడంతో పాటు భద్రతా సిబ్బందిపై దాడి చేసిన ఇద్దరు న్యాయ విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిపై పలు సెక్షన్లకింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఎటావా జిల్లాకు చెందిన, లక్నో విశ్వవిద్యాలయంలో మూడో సంవత్సరం న్యాయ విద్యార్థి అయిన 24 ఏళ్ల ప్రబల్ ప్రతాప్ సింగ్, రాయ్‌బరేలికి చెందిన రెండవ సంవత్సరం న్యాయ విద్యార్థి 23 ఏళ్ల చందర్ భాన్ కలిసి జులై 10న సుప్రీంకోర్టులో హంగామా చేశారు. ప్రబల్ ప్రతాప్ సింగ్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయ స్థానంలో విచారణ జరుగుతుండగా కోర్టు కార్యకలాపాలకు అంతరాయం కలిగించారు. పిటిషనర్ అయిన ప్రబల్ ప్రతాప్ స్వయంగా కోర్టుకు హాజరై గందరగోళం సృష్టించాడు. న్యాయమూర్తులను దుర్భాషలాడటంతో పాటు కోర్టు హాలులో కాగితాలు విసిరేశాడు. అదుపు చేసేందుకు జోక్యం చేసుకున్న భద్రతా సిబ్బందిపై న్యాయ విద్యార్థులు దాడిచేసి వారి విధులను అడ్డుకున్నారు. మరో వైపు సుప్రీంకోర్టు భద్రతా సిబ్బంది ఫిర్యాదుపై ఢిల్లీ పోలీసులు స్పందించారు. ఇద్దరు న్యాయ విద్యార్థులను అరెస్ట్ చేశారు. వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుల ప్రవర్తనపై సుప్రీంకోర్టు సూచనల మేరకు వైద్య పరీక్షల కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవియర్ అండ్ అలైడ్ సైన్సెస్‌కు తీసుకువెళ్లారు. అయితే ఇద్దరు న్యాయ విద్యార్థుల మానసిక ఆరోగ్యం బాగానే ఉన్నట్లుగా వైద్యులు నిర్ధారించారని పోలీస్ అధికారి తెలిపారు. దీంతో నిందితులిద్దరినీ రెండు రోజుల పోలీస్ కస్టడీకి తరలించినట్లు చెప్పారు. వారి వద్ద ఉన్న అభ్యంతరకర విషయాల కరపత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

## భారీ వర్షాల మధ్య కూడా చార్‌ధామ్ యాత్ర..

### 14 లక్షలు దాటిన యాత్రికుల సంఖ్య



**డెహ్రాడూన్, జులై 15:** ఉత్తరాఖండ్‌లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ, ప్రతిష్ఠాత్మక చార్‌ధామ్ యాత్రకు భక్తుల రద్దీ ఏమాత్రం తగ్గడం లేదు. ప్రతిరోజూ వేలాది మంది భక్తులు బద్రీనాథ్, కేదార్‌నాథ్ సహా పవిత్ర క్షేత్రాలను దర్శించుకుంటూ యాత్రను కొనసాగిస్తున్నారు.ప్రతికూల వాతావరణ పరిస్థితులు, భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదాలు ఉన్నప్పటికీ భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదని అధికారులు తెలిపారు.అధికారుల వివరాల ప్రకారం, ప్రతిరోజూ 6 వేల మందికి పైగా భక్తులు శ్రీ బద్రీనాథ్ ధామ్‌ను దర్శించుకుంటున్నారు. ఇక ప్రస్తుత యాత్రా సీజన్‌లో కేదార్‌నాథ్ ధామ్‌ను దర్శించిన భక్తుల సంఖ్య ఇప్పటికే 14 లక్షలు దాటింది. అయితే నిరంతర వర్షాల కారణంగా ఉత్తరాఖండ్‌లోని అనేక ప్రాంతాల్లో రహదారులు దెబ్బతినడం, కొండచరియలు విరిగిపడటం, ట్రెక్కింగ్ మార్గాలు జారుడుగా మారడంవంటి సమస్యలు ఎదురవుతున్నాయని అధికారులు తెలిపారు. అందువల్ల యాత్రికులు అత్యంత అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు.భారత వాతావరణ శాఖ (ఐఎండీ) రాష్ట్రంలోని చమోలి, రుద్రప్రయాగ్, పౌరీ గఢ్వాల్ తదితర కొండ ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో భారీనుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, యాత్రికులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ బద్రీనాథ్‌కేదార్‌నాథ్ ఆలయ కమిటీ, జిల్లా యంత్రాంగంకలిసి యాత్ర సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. యాత్రికుల భద్రత, సౌకర్యాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.బద్రీనాథ్ దర్శనం అనంతరం ఓ భక్తుడు మాట్లాడుతూ, తాము మొదట హేమకుండ్ సాహిబ్‌ను దర్శించేందుకు వచ్చామని, అక్కడ ప్రార్థనలు చేసిన తర్వాత బద్రీనాథ్ ధామ్‌ను కూడా సందర్శించాలని భావించి ఇక్కడికి వచ్చామని చెప్పారు. ఇక్కడి అనుభవం ఎంతో అద్భుతంగా ఉందని, అన్ని ఏర్పాట్లు బాగున్నాయని, ప్రతి ఒక్కరూ ఈ పవిత్ర క్షేత్రాన్ని దర్శించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని సూచించారు.మరో భక్తుడు కూడా వర్షాలు కొనసాగుతున్నప్పటికీ యాత్ర కోసం చేసిన ఏర్పాట్లను ప్రశంసించారు.

ప్రతికూల వాతావరణం ఉన్నా యాత్ర ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తయిందని తెలిపారు. రుద్రప్రయాగ్ జిల్లా కలెక్టర్ విశాల్ మిశ్రా మాట్లాడుతూ, మొన్నటి సాయంత్రం వరకు అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం కేదార్‌నాథ్ ధామ్‌ను దర్శించిన భక్తులసంఖ్య 14 లక్షలు దాటిందన్నారు. ప్రస్తుతం మాన్సూన్ కారణంగా వాతావరణ పరిస్థితులే ప్రధాన సవాలుగా మారాయని చెప్పారు.వర్షాల సమయంలో రహదారులు తరచూ మూసివేయబడుతున్నాయని, కొండచరియలు విరిగిపడే ప్రమాదం అధికంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఎత్తైన ప్రాంతాల్లో యాత్ర సాగుతుండటంతో కొంతమంది భక్తులు ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా గుండెపోటు వంటి కారణాలతో కొందరు మృతి చెందిన ఘటనలు చోటుచేసుకున్నాయని, అనారోగ్యానికి గురైన పలువురిని సకాలంలో రక్షించి వైద్య చికిత్స అందించామని వెల్లడించారు.

## సంక్షిప్త వార్తలు

### హార్మూజ్‌కు ప్రత్యామ్నాయంగా పుజైరా పోర్టు



**అబూదాబి,జులై 15:** పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో నెల కొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో, వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన హార్మూజ్ జలసంధికి ప్రత్యామ్నాయ మార్గాన్ని అభివృద్ధి చేయడంపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఎఇ) ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా, దుబాయ్‌కి చెందిన ప్రముఖ పోర్ట్స్ ఆపరేటర్ డిపి వరల్డ్, దేశ తూర్పుతీరంలోని ఫుజైరాలో కొత్తమల్టీపర్పస్ పోర్టు, కంటైనర్ టెర్మినల్ నిర్మాణ పనులను వేగవంతం చేసింది. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే, నౌకలు ప్రమాదకరమైన హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణించాల్సిన అవసరంలేకుండానే నేరుగా యూఎఇకి సరుకు రవాణాచేసే వెసులుబాటు కలుగుతుంది.

### పాక్‌లో ఘోర ప్రమాదం: నలుగురు మృతి

**కాబూల్,జులై 15:** పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో బుధవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు.స్థానిక మీడియా కథనాల ప్రకారం, షేక్‌పురా జిల్లాలోని మురిద్కే ప్రాంతంలో కలా ఖతాయ్ రోడ్ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సైద్‌వాలాలో నిర్వహించిన ఓమతపరమైన కార్యక్రమానికి హాజరై లాహోర్‌కు తిరిగి వస్తున్న ప్రయాణికులతో బస్సు ప్రయాణిస్తోంది. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించేందుకు బస్సు డ్రైవర్ ఒక్కసారిగా వాహనాన్ని మలుపు తిప్పడంతో అదుపుతప్పి బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సంఘటనా స్థలంలోనే నలుగురు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

### అయోధ్య ట్రస్టు సిఇఒ పోస్టుకు వెయ్యికిపైగా దరఖాస్తులు



**అయోధ్య,జులై 15:** రామమందిరం నిర్వహణ కోసం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నూతనంగా ప్రకటించిన ప్రధాన కార్య నిర్వహణాధికారి (సిఇఒ) పోస్టుకు అనూహ్య స్పందన లభిస్తోంది. నోటిఫికేషన్ విడుదలైన రెండు రోజుల్లో వెయ్యికిపైగా దరఖాస్తులు ట్రస్టుకు అందడం విశేషం. ఆలయ పరిపాలన, ఆర్థిక వ్యవహారాలను మరింత క్రమబద్ధీకరించి, వృత్తిపరమైన ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ట్రస్ట్ ఈ సిఇఒపదవిని సృష్టించింది. అభ్యర్థులలో అత్యధికులు విశ్రాంత బ్యూరోక్రాట్లు, మాజీ సీనియర్ పరిపాలనాధికారులు ఉండటం గమనార్హం.

### అంతరిక్షంలోకి భారతసంతతి వ్యోమగామి అనిల్‌మీనన్



**ఆస్తానా, జులై 15:** భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి అనిల్ మీనన్ తన తొలి అంతరిక్ష యాత్రను విజయవంతంగా ప్రారంభించారు. రష్యాకు చెందిన సోయజ్ ఎంఎస్29 వ్యోమనౌకలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ఆయన సురక్షితంగా చేరుకున్నారు. దాదాపు ఎనిమిది నెలలపాటు సాగే ఈమిషన్‌లో ఆయన కీలకమైన శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ప్రయోగాలు చేపట్టనున్నారు. కజకిస్థాన్‌లోని బైకనూర్ కాస్మోడ్రోమ్ నుంచి సోయజ్ ఎంఎస్ 29 వ్యోమనౌకలో అనిల్ మీనన్, రోస్‌కాస్మోస్ వ్యోమగాములు ప్యోటర్ డుబ్రోవ్, అన్నా కికినాలతో కలిసి బయలుదేరారు. కేవలం మూడు గంటల ప్రయాణం తర్వాత వారి వ్యోమనౌక ఐఎస్ఎస్‌లోని ప్రిచల్ మాడ్యూల్‌తో విజయవంతంగా అనుసంధానమైంది.

### ఇవి ఛార్జింగ్‌తో మంటలు.. ఇద్దరు మృతి

**లక్నో,జులై 15:** ఛార్జింగ్ చేస్తున్న ఎలక్ట్రిక్ వాహనంలో మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న వాహనాలకు మంటలు వ్యాపించడంతో బిల్డింగ్ అంతా పొగలు కమ్ముకున్నాయి. ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలు అదుపుచేశారు. ఈ అగ్నిప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. 50 కుటుంబాలకు చెందిన వారిని కాపాడారు. దేశ రాజధాని ఢిల్లీ శివారు ప్రాంతమైన ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఈ సంఘటన జరిగింది. బుధవారం సెక్టార్ 66లోని మమురా విలేజ్ ప్రాంతంలోని ఒక బిల్డింగ్‌లో అగ్నిప్రమాదం సంభవించింది.



బుధవారం హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న తెలంగాణ నిరుద్యోగ జెఏసి నేతలు

## జీఓ 46ను తక్షణమే రద్దు చేయాలి

### తెలంగాణ నిరుద్యోగ జెఏసి ఆధ్వర్యంలో నిరుద్యోగ రణభేరి

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూలై 15, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 46ను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఖాళీలన్నింటినీ వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ రణభేరి పేరుతో పెద్ద ఎత్తున ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంకు నవజవాన్ భారత్ సభ, దిశ విద్యార్థి సంఘం నేతలతో పాటు పలువురు రాజకీయనాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మోతీలాల్ నాయక్, వినోద్‌లు మాట్లాడుతూ 20వేల పోస్టులతో పోలీస్ మెగా నోటిఫికేషన్ విడుదల చేయాలని, జీవో నెంబర్ 87ను సవరించి, ఎస్ఐ వయోపరిమితి 38ఏళ్లకు, కానిస్టేబుల్ వయోపరిమితిని 36 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. దిల్‌సుఖ్‌నగర్, అశోక్‌నగర్ నిరసనల్లో విద్యార్థులు, నిరుద్యోగులపై పెట్టిన అక్రమ కేసులను భేషరతుగా ఎత్తివేయాలని, ఉపాధి హక్కును ప్రాథమిక హక్కుగా మార్చి భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని ఆమోదించాలని, లేనిపక్షంలో నెలకు పది వేల రూపాయల నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి వెంటనే నోటిఫికేషన్‌లు జారీ చేసి పరీక్ష ఫలితాలు ప్రకటించిన ఆరు నెలల్లోగా నియామక పత్రాలు జారీ చేయాలని తప్పనిసరిగా చేయాలని, ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగనాయకులు చైతన్య కుమార్, వేముల కార్తిక్, మహిపాల్, రోహిత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.


బుధవారం విజ్ఞాన్ సేతు సైన్స్ సెంటర్ ప్రారంభ సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

## విద్యకు అధిక ప్రాధాన్యం: మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్(అల్వాల్), జులై 15 ప్రభాతవార్త:** విద్య, ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఐటి పరిశ్రమలు శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. బుధవారం ఓల్డ్ అల్వాల్‌లోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలోని ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డిఆర్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజ్ఞాన్ సేతు సైన్స్ సెంటర్‌ను మంత్రితో పాటుగా పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, రాజ్యసభ సభ్యుడు విజయేంద్ర ప్రసాద్‌లు సం యుక్తంగా ప్రారంభించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పాఠాలు బట్టీపట్టే కంటే శాస్త్రీయ దృక్పథం ద్వారా ఆలోచింపచేసే శక్తి మెరుగవుతుందని పేర్కొన్నారు. ఒకనాడు దిగుమతులుపై ఆధారపడిన దేశం ఎగుమతులు చేసే స్థాయికి వెళ్ళడం శాస్త్రవేత్తల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. ఎఫ్‌డిఆర్ ఆధ్వర్యంలో బాలికల పాఠశాలలో సైన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం మంచి పరిణామమని ఆయన తెలిపారు. మేదస్సు వికాసం ద్వారానే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజజేందర్ పేర్కొన్నారు. విద్య మీద ఖర్చు చేసే ప్రతి పైసా భవిష్యత్తుకు పెట్టుబడి లాంటిదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ సెంటర్‌ల ఏర్పాటును మరింత విస్తృత పరుస్తామని ఎఫ్‌డిఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ్ పేర్కొ న్నారు. పాఠ్య పుస్తకాలు పఠనం ద్వారా మేదా శక్తిని పెంపొందించుకోవచ్చని పేర్కొన్న ఆయన ఆవిష్కరణలు ద్వారా ఉన్నతమైన స్థితికి చేరుకుంటారని వివరించారు. సినిమా, సైన్స్‌కు విడదీయరాని బంధం ఉందని రాజ్యసభ సభ్యుడు విజయేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. శాస్త్రీయ దృక్పదం లేకుండా సినిమా తీయలేమని తెలిపారు. విద్యార్థులు థామస్ అల్వా ఎడిసన్‌లా పోరాడి గెలవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా విద్యాధికారిణి రేణుక దేవి, ఆర్డీఓ శ్యామ్ ప్రకాష్, జిల్లా సైన్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, ఎంఇఓ మురళి క్రిష్ణ మూర్తి, పాఠశాల ప్రధానో పాధ్యా యురాలు శకుంతల, రాష్ట్రపతి నిలయం మేనేజర్ రజని ప్రియ తదితరులు పాల్గొన్నారు.



బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న జాన్‌వెస్లీ

## ఉపాధి కల్పనను ప్రాథమిక హక్కుగా మార్చాలి

### ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలి

### సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగుల మహాధర్నాలో పలువురు నేతల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జులై 15, ప్రభాతవార్త:** అందరికీ తిండి, చదువు, వైద్యంతో పాటు ఉపాధి కల్పనను ప్రాథమిక హక్కుగా మార్చాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో పెద్ద ఎత్తున నిరుద్యోగుల మహాధర్నా నిర్వహించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు టి. జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాకు సీపీఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పోతినేని సుదర్శన్‌రావు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా బి.వి.రాఘవులు మాట్లాడుతూ నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగులు చేస్తున్న పోరాటాలకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. నీట్ పరీక్షా పత్రం లీకై 25లక్షల మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందని, దీనిపై ఢిల్లీలో వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోతోందని, మనిషి పనిని సులభతరం చేసేలా యంత్రా లు ఉండాలి కానీ, ఉపాధిని దెబ్బతీసే విధంగా ఉండకూడదని అన్నారు. దేశ అవసరాలకు వాడాల్సి న సహజవనరులను అంబానీ, ఆదానీ లాంటి సంస్థలకు మోదీ సర్కార్ కట్టబెడుతోందని ఆరోపించారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదాలతో సాధించుకున్న తెలంగాణలో ఆ హామీలను నెరవేర్చటంలో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా రెండు లక్షలఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని కాంగ్రెస్ బుట్ట దాఖలు చేసిందని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా స్పందించి, నోటిఫికేషన్లువిడుదల చేయాలని, లేని పక్షం పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్.వీరయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం వచ్చాక దేశంలోనే నెలసరి వేతనం పొందే వారి సంఖ్య వేగంగా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, ఓయూ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ ఆర్ఎల్ మూర్తి, నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ ఆర్ఎల్ మూర్తి, డి.ఉపేందర్, కొడంగల్ రవి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్, మల్లు లక్ష్మి, బండారు రవి, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం

### గురుకుల సీట్ల కేటాయింపులో నిర్లక్ష్యం వద్దు

### సంస్థ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై15:** పేద, దళిత, గిరిజన విద్యార్థుల విద్యాభివిష్యత్తును తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ఒక్క విద్యార్థి కూడా గురుకుల విద్యకు దూరం కాకుండా అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో, ఆ లక్ష్యాలను అనుగుణంగా అధికారులు మరింత మానవీయ దృక్పథంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. బుధవారం డీఎస్ఎస్ భవన్‌లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) కార్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రం లోని వివిధ జిల్లాల నుంచి తమ పిల్లలకు గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలని వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల నుంచి మంత్రి స్వయంగా వినతిపత్రాలు స్వీకరించారు. ఒక్కొ క్కరి సమస్యను ఓపికగా వింటూ వారి కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు, పిల్లల చదువుపై ఉన్న ఆశయాలను అడిగి తెలుసుకున్నారు. దూర ప్రాంతాలు, మారుమూల గ్రామాల నుంచి వచ్చిన పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలకు సమీప జిల్లాల్లో సీట్లు కేటాయించాలని, ఇతర జిల్లాల్లో చదివించడం వల్ల రవాణా, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రికి వివరించారు. వారి సమస్యలను విన్న మంత్రి స్పందిస్తూ, పేద కుటుంబాలకు చెందిన అర్హులైన విద్యార్థులకు సాధ్యమైనంత మేరకు వారికి అనుకూలమైన జిల్లాల్లో సీట్లు కేటాయించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గురుకుల విద్యాలయాల సంస్థ జాయింట్ సెక్రటరీ (అడ్మినిస్ట్రేషన్) సక్రు నాయక్కు మంత్రి పలు కీలక సూచనలు చేశారు. సీట్ల కేటాయింపు ప్రక్రియలో పారదర్శకత, మానవీయ దృక్పథం, విద్యార్థుల సంక్షేమం ప్రధాన ప్రమాణాలుగా ఉండాలని, ప్రతి అర్జీని నిబంధనల పరిధిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి విద్యార్థికి న్యాయం చేయాలని ఆదేశించారు. అలాగే మారుమూల గ్రామాలు, దూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చే తల్లిదండ్రులు, సంరక్షకులు, బంధువులతో అధికారులు, సిబ్బంది అత్యంత మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. వారికి స్పష్టమైన సమాచారం అందిస్తూ, అవసరమైన మార్గదర్శకత్వం ఇవ్వాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురి చేయరాదని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దళిత, గిరిజన విద్యార్థుల విద్యా అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ భారీ స్థాయిలో నిధులు కేటాయించి గురుకుల విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్న సమయంలో, క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం లేదా అలసత్వానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ లక్ష్యాలను ప్రతి అధికారి తన బాధ్యతగా భావించి పనిచేయాలని, ప్రజల పట్ల సానుభూతితో వ్యవహరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, ఆధునిక మౌలిక వసతులు, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆ లక్ష్యాల సాధనలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

## రాష్ట్రంలో పడిపోయిన ఉద్యాన సాగు

**1.72 లక్షల ఎకరాల్లో పంటల కోత**
**9,51,134 ఎకరాలకు మాత్రమే పరిమితం**
**కూరగాయల సాగు 34,146 ఎకరాలకు తగ్గుదల**
**గత యేడాది కంటే 2 లక్షల ఎకరాల్లో తగ్గిన విస్తీర్ణం**
**రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యాన శాఖ నివేదిక**

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు తెలంగాణలో ఆహార, వాణిజ్యపంటలతో పాటు, ఉద్యాన పంటల సాగుపైనా తీవ్ర ప్రభావం చూపాయి. గతఏడాది కంటే ఈ సారి పంటల సాగు పడిపోయింది. రాష్ట్రంలో ఈసారి వర్షా భావం కారణంగా వరి సాగు తగ్గుతుందని, దాని స్థానంలో ఉద్యాన పంటల విస్తీర్ణం పెరుగుతుందని రైతులు, అధికారులు భావించారు. అయితే దానికి భిన్నంగా వ్యవసాయ పంటలతో పాటు, ఉద్యాన పంటల సాగుకూడా భారీగా తగ్గుదల చోటు చేసుకుంది. రాష్ట్రంలో గత ఏడాది ఇదే సమయానికి 11,24,001 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేయగా, ఈ ఏడాది అది 9,51,134 ఎకరాలకు మాత్రమే పరిమితమైంది. ఈ మేరకు దీనికి సంబంధించి ఉద్యాన శాఖ బుధవారం ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో వెల్లడించింది. దీంతో మొత్తం 1,72,867 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు తగ్గినట్లు స్పష్టమైంది. కూరగాయలు, పసుపు, మిర్చి తదితర పంటల సాగు గణనీయంగా తగ్గిపోవడం ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా అధికారులు పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం పెరగడం వల్ల 2023 నుంచి 2025 వరకు ఉద్యాన పంటల సాగు క్రమంగా తగ్గుతూ వచ్చింది. సాధారణంగా తెలంగాణలో ఏప్రిల్ నుంచి జులై వరకు ఉద్యాన పంటల ప్రధాన సాగు సీజన్‌గా ఉంటుంది. ఈ సయంలో 2023లో 12,03,380 ఎకరాలు, 2024లో 11,39,832 ఎకరాలు, 2025లో 11,24,001 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యాయి. ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో ప్రస్తుతం కేవలం 9,51,134 ఎకరాల్లోనే ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. పంటల వారీగా సాగు పరిస్థితి నివేదికలో పేర్కొన్నట్లుగా గత ఏడాది ఇదే సమయానికి టమాటా, బెండ, బీరతో పాటు ఇతర కూరగాయలు, ఆకుకూరలు కలిపి 53,405 ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి అవి 19,259 ఎకరాలకు పరిమితమయ్యాయి. దీంతో కూరగాయల సాగు 34,146 ఎకరాలు తగ్గింది. పసుపు, మిర్చి, అల్లం, వెల్లుల్లి, ఉల్లి, ఇతర మసాలా దినుసుల సాగు కూడా భారీగా క్షీ ణించింది. గత ఏడాది 1,81,735 ఎకరాల్లో సాగు చేసిన ఈ పంటలు ప్రస్తుతం 41,395 ఎకరాల్లో మాత్రమే ఉన్నాయి. అంటే ఈ విభాగంలోనే 1,40,340 ఎకరాల సాగు తగ్గింది. అలాగే మామిడి, నిమ్మ, దానిమ్మ, జామ వంటి పండ్ల తోటల విస్తీర్ణంలో మాత్రం స్వల్ప తగ్గుదల నమోదైంది. గత ఏడాది 4,52,921 ఎకరాల్లో ఉన్న ఈ తోటలు ప్రస్తుతం 4,52,104 ఎకరాల్లో కొనసాగుతున్నాయి. ఇక ఆయిల్‌పాం సాగు మాత్రం పెరుగుదల నమోదు చేసింది. గత ఏడాది 3,10,776 ఎకరాల్లో సాగు చేసిన ఆయిల్‌పాం, ఇతర సంబంధిత పంటలు ఈసారి 3,20,111 ఎకరాలకు చేరాయి. దీంతో కొత్తగా 9,335 ఎకరాల్లో ఈ పంటల సాగు పెరిగింది.

అయితే పూల పంటలు, ఔషధ మొక్కల సాగు కూడా ఈసారి గణనీయంగా తగ్గినట్లు ఉద్యాన శాఖ నివేదికలో పేర్కొంది. రాష్ట్రంలో వర్షపాతం పరిస్థితులు మెరుగుపడితే రానున్న రోజుల్లో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశముందని నివేదికలో అధికారులు స్పష్టం చేశారు.

## పసుపు యంత్రాల సబ్సిడీకై దరఖాస్తుల ఆహ్వానం


### నిజామాబాద్ పసుపు బోర్డు నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని నిజామాబాద్‌లోని జాతీయ పసుపు బోర్డు, ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను తన అభివృద్ధి కార్యక్రమాలను అధికారికంగా ప్రారంభించినట్లు ప్రకటించింది. పసుపు పంట కోత అనంతరం అవసరమైన వివిధ రకాల యంత్రాలను కొనుగోలు చేయడానికి, ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక సహాయం (సబ్సిడీ) కోరుతూ అర్హులైన రైతులు, భాగస్వాముల నుండి పసుపు బోర్డు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. కోత అనంతర యాంత్రీకరణకు ఆర్థిక రాయితీ కల్పించడం ద్వారా, మార్కెట్‌లో పసుపు నాణ్యతను పెంచడం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ పసుపు ఉత్పాదకతను, పోటీతత్వాన్ని గణనీయంగా పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. పసుపు పంట కోత అనంతరం అవసరమైన వివిధ రకాల యంత్రాలను కొనుగోలు చేయడానికి, ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక సహాయం (సబ్సిడీ) కోరుతూ అర్హులైన రైతులు, భాగస్వాముల నుండి బోర్డు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ వ్యూహాత్మక చొరవ ప్రత్యేకంగా పసుపు పండించే రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, రైతు సంఘాలు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఎంతో మేలు చేకూర్చనుందని బోర్డు అధికారులు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 22వ తేదీ నుండి ప్రారంభంకానున్న దరఖాస్తు ప్రక్రియ దాన్ని సమర్పించడానికి ఈ నె 31, సాయంత్రం 5.30 గంటల వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. పూర్తి చేసిన దరఖాస్తులను, దానికి జోడించాల్సిన అన్ని నిర్దేశిత పత్రాలతో పాటు, నిర్ణీత గడువు ముగిసేలోపు నిజామాబాద్‌లోని జాతీయ పసుపు బోర్డు కార్యాలయంలో స్వయంగా సమర్పించాల్సి ఉంటుంది. కాగా ఈ పథకం కింద దరఖాస్తులను ముందుగా వచ్చిన వారికి ముందుగా ప్రాధాన్యత ప్రాతిపదికన మాత్రమే పరిగణించనున్నారు. అందువల్ల అర్హులైన ఆసక్తి గల రైతులు, సంస్థలు వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## పామాయిల్‌కు ప్రోత్సాహం

### రాష్ట్రంలో సాగుకు ఊతం

### ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శం



**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త :** నూనెగింజలు, పామాయిల్‌కు కేంద్రం ప్రోత్సాహం తెలంగాణకు ఊతమిచ్చింది. నూనెగింజలు, పామా యిల్ సాగుపై కేంద్రం దృష్టి సారించడం తెలంగాణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి, పంటల వైవిధ్యీకరణ కు తోడ్పడుతుందని వ్యవసాయ శాఖ భావిస్తోంది. అధికారవర్గాలు వెల్లడించిన వివరాలు ప్రకారం జాతీయ ఆహార భద్రతా మిషన్ (నూనెగింజలు), జాతీయ వంట నూనెల మిషన్-ఆయిల్ పామ్ (ఎన్ఎమ్ఇఒ-ఒపి) కింద నూనెగింజలు, వంట నూనెలపై కేంద్రం పునరుద్ధరించిన దృష్టి, ముఖ్యంగా పామ్ సాగు వేగంగా విస్తరిస్తున్న జిల్లాల్లో తెలంగాణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిస్తుందని భావిస్తున్నారు. భారీ స్థాయిలో సాగు విస్తీర్ణం పెరగడం, రైతుల బలమైన భాగస్వామ్యంతో ఆయిల్ పామ్ మిషన్ కింద తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని ఇటీవలి ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. ప్రస్తుతం జాతీయ ఆహార భద్రత మరియు పోషకాహార మిషన్‌గా పునర్వ్యవస్థీకరించబడిన జాతీయ ఆహార భద్రతా మిషన్, మెరుగైన విత్తనాలు, వ్యవసాయ పద్ధతులు, రైతు సహాయం ద్వారా నూనెగింజలతో సహ కీలక పంటలలో ఉత్పాదకతను పెంచడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. జాతీయ వంట నూనెల మిషన్-ఆయిల్ పామ్ కింద, తోటల పెంపకానికి మద్దతు, విత్తన తోటలు, ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాలు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో పామాయిల్‌ను దీర్ఘకాలిక ఆదాయ వనరుగా ప్రోత్సహిస్తున్నారు. తెలంగాణ ఇప్పటికే తన లక్ష్యంలో గణనీయమైన భాగాన్ని అధిగమించి, సాగు విస్తీర్ణాన్ని పెంచు తూనే ఉంది. రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణకు ఇస్తున్న ప్రోత్సాహానికి ఈ మిషన్ అనుగుణంగా ఉందని, ఇది రైతులకు హామీతో కూడిన నీటిపారుదల, మార్కెట్ సౌకర్యం, ప్రాసెసింగ్ మద్దతును అందిస్తుందని అధికారులు తెలిపారు. ఈ రెండు పథకాలను జాగ్ర త్తగా అమలు చేస్తే, మెట్ట, నీటిపారుదల వ్యవసాయ రంగాల రూపు రేఖలను మార్చగలవని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాఘవరావు అన్నారు. నూనెగింజల పంటకు దిగుబడి మెరుగుదల అవసరం కాగా, పామాయిల్‌కు ఓపిక, ప్రాసెసింగ్ మద్దతు కావాలి. ధరలు, నీటిపారుదల,కొనుగోలు వ్యవస్థలు నమ్మదగినవిగా ఉన్నప్పుడు రైతులు త్వరగా స్పందిస్తారు కాబట్టి తెలంగాణ మంచి స్థితిలో ఉందన్నారు. వైవిధ్యీక రణను నీటి వినియోగం, ముడిసరుకుల ఖర్చులు, మార్కెట్ స్థిరత్వంతో సమతుల్యం చేసుకోవడం చాలా కీలకమని ఆయన హెచ్చరించారు. నారు మొక్కలు, విస్తరణ సేవలు, హామీతో కూడిన అమ్మకాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం చేసుకుంటే, తెలంగాణ చూపిన మార్గం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవగలదని ఆయన అన్నారు.

## అయోధ్య విరాళాల దుర్వినియోగంపై విచారణ చేయాలి

### బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ డిమాండ్


బుధవారం హైదరాబాద్‌లో మాట్లాడుతున్న బసవరాజు శ్రీనివాస్, నందిగామ లక్ష్మీనారాయణ, ఎం.వి శాస్త్రీ తదితరులు

**హైదరాబాద్,జూలై 15,ప్రభాతవార్త:** ఉత్తరప్రదేశ్ లోని శ్రీరామ జన్మభూమి అయోధ్య ట్రస్టులో విరాళాల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రిని డిమాండ్ చేసింది.

ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో బాస్ చైర్మన్, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, కార్యదర్శి నందిగామ లక్ష్మీనారాయణ మాట్లా డారు. దేశవ్యాప్తంగా రామభక్తులు అందజేసిన విరాళాలలో లెక్క చూపకుండా వాడు కుంటు న్నారని వార్తలు రావడం విచారకర మన్నారు. తిరుపతి తిరుమల దేవస్థా నంలో ఏవిధంగానైతే ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేసి నిర్వహణ చేస్తున్నారో ఆ విధంగానే అయోధ్య రామాల యంలో ట్రస్ట్ బోర్డ్‌ను ఏర్పాటు చేసి నిర్వహించాలని సూచించారు.

ఈ సమావేశంలో ఎం.విశాస్త్రీ, గోపీకృష్ణ , కైలాష్, వై శ్రీనివాస్, జనగామ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రూ.2,500 కోట్ల రుణ సమీకరణ

### ఈ ఆర్థికంలో రూ.31,400 కోట్లకు చేరిన రుణం

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో రూ.2,500 కోట్ల మేర రుణాన్ని సేకరించింది. రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన బహిరంగ వేలంలో ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టడం ద్వారా ఈ రుణాన్ని సమీకరించింది. ఈ మొత్తంలో 7.70 శాతం వార్షిక వడ్డీకి 11 ఏండ్ల కాలపరిమితితో రూ.1,000 కోట్లు, 7.75 శాతం వార్షిక వడ్డీకి 29 ఏండ్ల కాలపరిమితితో మరో రూ.1,500 కోట్లు తీసుకుంది. దీంతో ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ నుంచి తీసుకున్న రుణాలు రూ.31,400 కోట్లకు చేరాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి జూన్ నెలాఖరు వరకూ కలిగిన తొలి త్రైమాసికంలో రూ.18,900 కోట్ల రుణ సమీ కరణ చేసింది. అలాగే జూలై నుండి సెప్టెంబర్ వరకూ రెండో త్రైమాసికం(క్యూ2)లో రూ.21,000 కోట్లు రుణం కోసం రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రతిపాదనలు పంపింది. గత 2025-26 వార్షిక బడ్జెట్ అంచనాల్లో రుణ సమీకరణను రూ.54,009 కోట్ల లోపే ప్రతిపాదించినా, అంతకు మించి ఒక్క రిజర్వ్ బ్యాంక్ నుంచే రూ.85,840 కోట్లు రుణ సౌకర్యాన్ని పొందింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.80వేల కోట్ల రుణ సమీకరణ చేస్తామని అంచనా బడ్జెట్‌లో ఆర్థిక శాఖ ప్రతిపాదించింది.

## దేశంలోనే తెలంగాణలో అత్యధిక ద్రవ్యోల్బణం

### జూన్ నెలలో 6.36 శాతం నమోదు

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** మార్కెట్లో మళ్లీ నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. జాతీయ గణాంకాల కార్యాలయం తాజాగా విడుదల చేసిన వినియోగదారు ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం డేటా దీనికి అద్దం పడుతోంది. 2024 ను బేస్ ఇయర్‌గా తీసుకొని ఈ ఏడాది జనవరిలో ప్రారంభించిన కొత్త సిరీస్‌లో ద్రవ్యోల్బణం 4 శాతం దాటడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. మే నెలలో 3.93 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నాటికి 4.38 శాతానికి ఎగబాకింది. జూన్ నెలలో నమోదైన ద్రవ్యోల్బణం ఏకంగా 18 నెలల గరిష్ఠ స్థాయి కావడం ఆందోళన కలిగిస్తోంది. గ్రామీణ ద్రవ్యోల్బణం 4.74 శాతంగా ఉండగా, పట్టణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 3.92 శాతంగానే ఉంది. రాష్ట్రాల వారీగా చూస్తే దేశంలోనే అత్య ధికంగా తెలంగాణలోనే అత్యధికంగా ద్రవ్యో ల్బణం నమోదు కావడం గమనార్హం. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే నిత్యావసర వస్తువులు, సేవల ధరలు చాలా వేగంగా పెరుగుదల చోటు చేసుకుంది. రాష్ట్రంలో రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నెలలో 6.36 శాతంగా ఉండగా ధరలు ఇక్కడ చాలా ఎక్కువగా ఉన్నాయని చెప్పొచ్చు. అత్యల్పంగా ద్రవ్యోల్బణం మిజోరంలో (1.63 శాతం) నమోదై ధరలు తక్కువగానే ఉన్నాయి.

## రూ.20,457 కోట్లతో 1600 మెగావాట్ల థర్మల్ ప్రాజెక్టు

### ఎన్టీపిసి బోర్డు ఆమోదం

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను అధిగమించేందుకు థర్మల్ ప్రాజెక్టుల విస్తరణ నిమిత్తం ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. లారా సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు మూడవ దశ (2x800 మెగావాట్లు) కోసం రూ.20,456.70 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ప్రతిపాదనలకు బోర్డు ఆమోదించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో దీంతో ఈ ప్రాజెక్టు కింద ఆమోదించబడిన మొత్తం సామర్థ్యం 1600 మెగావాట్లకు చేరుతుంది. రాబోయే రెండు దశాబ్దాలల్లో నిర్మించాలను కుంటున్న 30 గిగావాట్ల అణు విద్యుత్ సామర్థ్యానికి అవసరమైన ఇంధన సరఫరాను మరింత సురక్షితం చేసుకునేందుకు ఎన్టీపీసీ విదేశీ యూరేనియం గనుల్లో కూడా పెట్టుబడి పెట్టాలని ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించింది.

# గిడ్డంగుల సామర్థ్యం 5 లక్షల టన్నులకు పెంపు

## వ్యవసాయ మంత్రి తుమ్మల



బుధవారం అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త :** రాష్ట్రంలో గోదాముల సౌకర్యాన్ని మరింత విస్తరించేందుకు వచ్చే రెండేళ్లలో అదనంగా మరో 5 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో పెరుగుతున్న వ్యవసాయ ఉత్పత్తులకు అనుగుణంగా గోదాముల సామర్థ్యాన్ని విస్తరిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో బుధవారం ఒక సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం 48 కొత్త గోదాముల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోందన్నారు. మొత్తంగా రాష్ట్రంలో సుమారు 15 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని కల్పించేలా ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. మొదటి దశలో నిర్మిస్తున్న 2.12 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యంతో 17 గోదాములను వచ్చే జనవరి నాటికి, రెండో దశలో 3.66 లక్షల టన్నుల సామర్థ్యం కలిగిన 31 గోదాములను 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు. అదనంగా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని 3.25 లక్షల టన్నుల సామర్థ్యం కలిగిన ఇంకో 32 గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. కొత్తగా నిర్మించే ప్రతి గోదాముపై తప్పనిసరిగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుతం వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఆధీనంలో 6 లక్షల టన్నుల సామర్థ్యం కలిగిన 52 స్వంత గోదాములు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం ఈ గోదాముల్లో 104 శాతానికి పైగా ఆక్యుపెన్సీ నమోదై 6.33 లక్షల టన్నుల ఉత్పత్తులు నిల్వ ఉన్నాయని వెల్లడించారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెట్ యార్డులు, పీఏసీఎస్, [illegible] గోదాములను, అద్దె వాటితో కలిపి మొత్తం 524 గోదాములను ప్రస్తుతం వినియోగిస్తున్నామని వివరించారు. గోదాముల అవసరాలకు కావలసిన విద్యుత్‌ను స్వయంగా ఉత్పత్తి చేసుకోవడంతో పాటు మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి అదనపు ఆదాయం సమకూర్చుకునే విధంగా రెడ్కోతో చర్చించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, హాకా, వేర్‌హౌసింగ్ ఆధీనంలో ఉన్న గోదాములన్నింటినీ ఒకే సమన్వయ వ్యవస్థ కింద నిర్వహించే అవకాశాలను పరిశీలించాలన్నారు. దీంతో నిర్వహణ వ్యయాలు తగ్గడంతో పాటు ప్రభుత్వ వనరులను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అవసరం లేకుండా ప్రైవేట్ గోదాములను అద్దెకు తీసుకోవడం వల్ల అదనపు ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు.



ప్రసంగిస్తున్న హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

# కార్మికుల సామాజిక భద్రతకు అంతర్జాతీయ ఐక్యత అవసరం

## ముగిసిన బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సదస్సు

### హాజరైన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు సుంకరి మల్లేశం

**హైదరాబాద్ , జూలై 15 ప్రభాతవార్త:** భవిష్యత్ ఉద్యోగ వ్యవస్థ, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధి మరియు అంతర్జాతీయ కార్మిక సహకారం వంటి రంగాలలో కార్మికుల ప్రయోజనాల రక్షణే ధ్యేయంగా బ్రిక్స్ దేశాలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. బుధవారం బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణమండపంలో 15వ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సమిట్ 2026లో భాగంగా కార్మికుల సదస్సు అత్యంత జరిగింది. ఈ సదస్సులో బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల కార్మిక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హర్యానా పూర్వ గవర్నర్, మాజీ కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ తన పదవీకాలంలో దేశంలోని సుమారు 60.5 శాతం మంది కార్మికులకు సామాజిక భద్రతను కల్పించేలా అనేక కీలక సంస్కరణలను అమలు చేశామని గుర్తుచేశారు. ప్రసూతి ప్రయోజనాల చట్టాన్ని మరింత బలోపేతం చేయడం, గ్రాట్యుటీ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచడం, కనీస వేతనాన్ని డియర్నెస్ అలవెన్స్ తో కలిపి రూ. 10,000 నుండి రూ.18,000కు పెంచినట్లు వివరించారు. అలాగే, బోనస్ అర్హత పరిమితిని రూ.3,500 నుంచి రూ.7,000కు పెంచడంతో పాటు, కార్మిక సంక్షేమం, శ్రమ చట్టాల ఆధునీకరణ కోసం చారిత్రాత్మకమైన నాలుగు లేబర్ కోడ్స్‌ను ప్రవేశపెట్టామని ప్రస్తావించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సమిట్ చైర్మన్, బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు సుంకరి మల్లేశం మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా అంతర్జాతీయంగా కార్మికుల ఐక్యత మరింత బలోపేతం కావాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక వర్గాల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి భారతీయ మజ్దూర్ సంఘ్ నిరంతరం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. బీఎంఎస్ అఖిల భారత సంస్థాగత కార్యదర్శి, బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ ప్రధాన సమన్వయకర్త బి. సురేంద్రన్ మాట్లాడుతూ.. వలస కార్మికుల సంక్షేమం కోసం ఎక్కడైనా ఉపయోగపడేలా పోర్టబుల్ సామాజిక భద్రతను తీసుకురావాలన్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు వినియోగంలో కార్మికుల ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నాలుగు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ల సిఫారసులతో రూపొందించిన 136 అంశాల 'బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ప్రకటన'ను హైదరాబాద్‌లో త్వరలో జరగబోయే బ్రిక్స్ కార్మిక, ఉపాధి మంత్రుల సమావేశానికి సమర్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. సదస్సులో బెలారస్, ఈజిప్ట్, దక్షిణాఫ్రికా దేశాల ప్రతినిధులు పాల్గొని.. మహిళల ఆర్థిక సాధికారత, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక వృద్ధి, పునరుత్పాదక ఇంధనాల ప్రోత్సాహం మరియు అంతర్జాతీయ సహకారం ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. బీఎంఎస్ తెలంగాణ రాష్ట్రప్రధాన కార్యదర్శి రాంరెడ్డి సదస్సుకు విచ్చేసిన ప్రతినిధు లకు, కార్మిక సంఘాల నాయకులకు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు.

# అంగన్వాడీలకు నాసిరకం సప్లై చేస్తే బ్లాక్ లిస్ట్

## ఆగస్టు 15 నుండి రాష్ట్రంలో బ్రేక్‌ఫాస్ట్ పథకం

### మహిళా, శిశు సంక్షేమ మంత్రి సీతక్క



**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:** అంగన్వాడీ లకు నాసిరకం సరుకులు సరఫరా చేస్తే సంబంధిత కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రి ధనసరి అనసూయ అన్నారు. బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది అని, వారికి పోషకాహారం, విద్య, సంరక్షణ అందిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని స్పష్టం చేశారు. హైదరాబాద్ సచివాలయంలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల మేధాశక్తిని పెంచేలా సేవలు ఉండాలన్నారు. మారుమూల చివరి గ్రామంలోని కేంద్రాన్ని కూడా అధికారులు సందర్శించాలని సూచించారు. నాణ్యతను పరిశీలించేందుకు తరచూ కేంద్రాల్లో భోజనం చేయాలని చెప్పారు. గుడ్లు, పప్పు, పాలు, ఇతర పోషకాహార పదార్థాల ఇండెంట్, సరఫరాలో నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఒకటి రెండు అంగన్వాడీ కేంద్రాల్లో నాసిరకం కోడి గుడ్లు సరఫరా చేసినట్లు వచ్చిన ఆరోపణలపై అధికారులు సమగ్ర నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు. వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా బ్రేక్‌ఫాస్ట్ ఈ పథకాన్ని అమలు చేసేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం ద్వారా పిల్లల సంఖ్య ఎంత మేర పెరిగిందో జిల్లాల వారీగా నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన 2,500 నూతన అంగన్వాడీ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరో 2,500 నుంచి 3 వేల భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. వలస కార్మికుల పిల్లల కోసం మిగిలిన ప్రాంతాల్లోనూ అవసరమైన మొబైల్ అంగన్వాడీలను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని వెల్లడించారు. ఇప్పటికే 12 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ చేసి దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోందని, ఒకటి రెండు రోజుల్లో మిగిలిన జిల్లాల్లోనూ నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు. నియామకాలు ఎలాంటి వివాదాలకు తావులేకుండా, పూర్తి పారదర్శకంగా, మెరిట్ ప్రాతిపదికన జరగాలని స్పష్టం చేశారు. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణ నిలవాలని స్పష్టం చేశారు. శిశు సంరక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు దత్తత ప్రక్రియను వేగవంతం చేసి ప్రత్యేక దత్తత సంస్థల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన ఆహారం,సురక్షితమైన మెడిసన్ లక్ష్యం

## ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై15:** ప్రజలకు నాణ్యమైన ఆహారం, సురక్షితమైన మెడిసిన్ అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రజారోగ్యానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి రాజీ ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. ఆహార భద్రత విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని, ఫుడ్ సేఫ్టీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వేర్వేరుగా పనిచేస్తున్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రి బుధవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం రెండు విభాగాల పని తీరు, అమలులో ఎదురవుతున్న సమస్యలు, ప్రజారోగ్య పరిరక్షణలో ఉన్న సవాళ్లను అధికారులు మంత్రికి వివరించారు. ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ విభాగాలు ఒకే లక్ష్యంతో పనిచేస్తున్నప్పటికీ విడివిడిగా ఉండటం వల్ల సమన్వయం పరిమితంగానే ఉంటోందని తెలిపారు. సిబ్బంది కొరత, తనిఖీల నిర్వహణలో ఇబ్బందులు, ప్రయోగశాలల సామర్థ్యాన్ని మరింత పెంచాల్సిన అవసరం, కేసుల విచారణ, చట్టపరమైన చర్యలు వేగంగా పూర్తయ్యేలా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. రెండు విభాగాలను ఇంటిగ్రేట్ చేయడం ద్వారా తనిఖీలు, శాంపిల్ సేకరణ, ల్యాబ్ పరీక్షలు, ఇంటెలిజెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, చట్టపరమైన చర్యలు మరింత వేగంగా, సమర్థవంతంగా చేపట్టే అవకాశం ఉంటుందని అధికారులు తమ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కల్తీ ఆహారం, నాసిరకం, నకిలీ మెడిసిన్స్ తయారీ, నిల్వ, విక్రయాలపై మరింత కఠినంగా చర్యలు తీసుకునేందుకు ఈ విధానం ఉపయోగపడు తుందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో అమలులో ఉన్న విధానాలను కూడా మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి రాజీ ఉండబోదన్నారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం, సురక్షితమైన మెడిసిన్ అందించాలంటే ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల మధ్య మరింత సమన్వయం అవసరమన్నారు. ప్రస్తుతం రెండు విభాగాల ఇంటిగ్రేషన్‌కు సంబంధించి అధికారులు సమర్పించిన ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించి, తెలంగాణకు అనువైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని మంత్రి ఆదేశించారు. పరిపాలనా, చట్టపరమైన, సాంకేతిక అంశాలను అధ్యయనం చేసి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు.

# మేడిగడ్డపై శిఖండి రాజకీయం వద్దు, కన్నెపల్లి పంపులు ఆన్ చేయాలి: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై15:** తెలంగాణలో రాజకీయ పరిస్థితులపై ఢిల్లీలో కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మా రక్తం కావాలని అడిగితే.. సూర్యాపేటలోని మారుమూల గిరిజన తాండాలలో రైతులు తమ పంట పొలాల మీద రక్తం చల్లుతూ నిరసన తెలుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "మా రక్తం తీసుకోండి కానీ మా పొలాలకు నీళ్లు ఇవ్వండి" అని రైతులు రక్త తర్పణం చేస్తుంటే, ఈ రక్త పిశాచి లాంటి కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ బిడ్డల రక్తాన్ని దశాబ్దాలుగా కళ్ళజూస్తున్న కాంగ్రెస్ పాలన స్పందించడం లేదని మండిపడ్డారు. హిట్లర్‌ని ఆదర్శంగా తీసుకునే ఈ బట్లర్ ముఖ్యమంత్రి ఇప్పటికైనా కళ్లు తెరిచి రైతుల ఆవేదనపై స్పందించాలని, దాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని పేర్కొన్నారు. మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టుల వివాదంపై స్పందిస్తూ.. ఎన్డిఎస్ఏకి వెళ్తారా అని అడిగిన ప్రశ్నకు ఇది చాలా సింపుల్ విషయమని సమాధానమిచ్చారు. ఎన్డిఎస్ఏ అనేది కేవలం ఒక అడ్వైజరీ, రెగ్యులేటరీ బాడీ మాత్రమేనని, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను శాసించే సంపూర్ణ అధికారాలు దానికి ఏమాత్రం లేవని స్పష్టం చేశారు. మేడిగడ్డను అస్సలు ముట్టకుండానే పక్క నుంచి నీళ్లివ్వొచ్చని తాము సాంకేతికంగా, అలాగే డ్యూటీలో ఉన్న ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఇంజనీర్లు, రిటైర్డ్ ఇంజనీర్లు చెప్తుంటే.. ముఖ్యమంత్రి మాత్రం ఎన్డిఎస్ఏ ని అడ్డం పెట్టుకుని శిఖండి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత ఎల్ నినో, తీవ్ర కరువు పరిస్థితుల నుంచి తెలంగాణను కాపాడే అవకాశం ఇంకా ఉన్నప్పటికీ, ప్రభుత్వ ఉద్దేశపూర్వక నిరక్ష్యం (క్రిమినల్ నెగ్లిజెన్స్) వల్లే రైతులకు ఈ భారీ నష్టం జరుగుతోందన్నారు. సీఎం ఇప్పటికైనా తన బేషజాలను వీడి వెంటనే కన్నెపల్లి పంపులను ఆన్ చేసి, నీళ్లిచ్చి పంటలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఎస్సీ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కేంద్రం అండ: కేంద్ర మంత్రి రాందాస్

## రూ.300 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ పై కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేసిన సంక్షేమ మంత్రి అడ్లూరి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై15:** తెలంగాణలో షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదల, సంక్షేమ విద్యాసంస్థలు, వసతి గృహాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి శ్రీ రామ్‌దాస్ అథవాలే భరోసా ఇచ్చారు. రాష్ట్రానికి పెండింగ్‌లో ఉన్న నిధుల నుంచి తక్షణమే రూ.150 కోట్ల విడుదలకు సానుకూలంగా స్పందించినట్లు, అలాగే షెడ్యూల్డ్ కులాల సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్ల అభివృద్ధికి ప్రతిపాదించిన రూ.300 కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీపై వచ్చే నెలలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా బుధవారం టూరిజం ప్లాజాలో కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలేను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు.

# యోగితారాణాకు పిఆర్‌టియుటిఎస్ అభినందన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై15:** తెలంగాణ రాష్ట్రం విద్యా ప్రమాణాల్లో 29వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరడంలో కృషి చేసిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాను బుధవారం పిఆర్‌టియుటిఎస్‌అభినందించింది. ఇటీవల విడుదలైన విద్యా ప్రమాణాల మూల్యాంకనంలో తెలంగాణ రాష్ట్రం 29వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరుకోవడం రాష్ట్ర విద్యారంగానికి గర్వకారణం. ఈ విజయానికి కృషి చేసిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాను ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి సారథ్యంలో పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షంగౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విద్యా ప్రమాణాలను మెరుగుపరచేందుకు విద్యాశాఖ పకడ్బందీ ప్రణాళికతో పనిచేసి, ఈ మెరుగైన స్థానం లభించడం అభినందనీయమని పేర్కొన్నారు.

# కాపు నేత ముద్రగడకు కన్నీటి వీడ్కోలు

## పెరట్లోనే అంత్యక్రియలు

### అధికార లాంఛనాలను తిరస్కరించిన కుటుంబ సభ్యులు

### కడసారి చూపునకు నోచుకోని కుమార్తె క్రాంతి



బుధవారం కిర్లంపూడిలో ముద్రగడ పాడె మోస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై15,ప్రభాతవార్త :** కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ పిఏసి సభ్యుడు ముద్రగడ పద్మనాభం భౌతికకాయానికి గురువారం ఆయన స్వగ్రామమైన కాకినాడ జిల్లా కిర్లంపూడిలో అంత్యక్రియలు ముగిశాయి. సుదీర్ఘ ప్రజాప్రస్థానానికి ముగింపు పలుకుతూ ముద్రగడ అనంత లోకాలకు తరలిపోవడంతో కిర్లంపూడి జనసముద్రమైంది. అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు భారీ ఎత్తున తరలివచ్చారు. ముద్రగడ పద్మనాభం చివరి కోరిక మేరకు, ఆయన కుటుంబ సభ్యులు ప్రభుత్వ అధికారిక లాంఛనాలను సున్నితంగా తిరస్కరించారు. కిర్లంపూడిలోని ఆయన స్వగృహ ఆవరణలోనే (పెరట్లో) హిందూ సాంప్రదాయపద్ధతిలో అత్యంత నిరాడంబరంగా అంత్య క్రియలు నిర్వహించారు. తనకు ఎంతో ఇష్టంగాభావించే ఇంటిఆవరణలోని మామిడి చెట్టు వద్ద పాతిపెట్టారు. **కన్నీటి పర్యంతమైన కుటుంబం.. ఓదార్చిన జగన్..**
మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి కిర్లంపూడి విచ్చేసి ముద్రగడ భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం తీవ్ర విషాదంలో ఉన్న ముద్రగడ కుమారుడు గిరిబాబు, కుటుంబ సభ్యులను వైఎస్ జగన్ దగ్గరకు తీసుకుని ఓదార్చారు.

# బ్రిక్స్ దేశాల మంత్రుల విందులో పాల్గొన్న సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై15:** ఫలక్‌నూమా ప్యాలెస్‌లో బ్రిక్స్ దేశాల మంత్రుల బృందానికి ఏర్పాటు చేసిన విందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దక్షిణాఫ్రికా, ఇండోనేషియా, చైనా, రష్యా, ఇరాన్, ఇథియోపియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బ్రెజిల్ దేశాల మంత్రులను సిఎంమర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి ఈ విందులో పాల్గొన్నారు. హైదరాబాద్ నగరంలో జరుగుతున్న బ్రిక్స్ కార్మిక, ఉపాధి మంత్రుల సదస్సు, బ్రిక్స్ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సమ్మిట్-2026ల నేపథ్యంలో బ్రిక్స్ మంత్రులకు కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖఅధికారికంగా ఈ విందును ఏర్పాటు చేసింది. ఈ విందు కార్యక్రమంలో సిఎం ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీధర్, డీజీపీ సీవీ ఆనంద్, కార్మికశాఖ కార్యదర్శి హరిచందన,ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


AU SMALL FINANCE BANK

నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, జైపూర్, రాజస్థాన్, ఇండియా- 302001
www.au.bank.in

**బంగారం పై రుణం "ఎక్కడ ఉందో అలాగే" అనే ప్రాతిపదికన వేలం నోటీసు**

AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ("బ్యాంక్") నుండి పొందిన బంగారు సౌకర్యాలపై రుణానికి సంబంధించివారి బకాయి మొత్తాలను చెల్లించమని క్రింద పేర్కొన్న రుణగ్రహీతలకు నోటీసులు జారీ చేయబడ్డాయి. రుణగ్రహీత/లు వారి బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, దిగువ పేర్కొన్న శాఖలలో 17 Aug 2026 ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 3:00 (సమయం) మధ్య పేర్కొన్న పద్ధతి ప్రకారం తాకట్టు పెట్టిన బంగారు వస్తువులు/ వస్తువుల వేలం నిర్వహించాల్సి ఉంటుంది. మరణించిన రుణగ్రహీతల విషయంలో, అన్ని షరతులు చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి. పైన పేర్కొన్న వేలం విఫలమైతే, ముందస్తు సమాచారం లేకుండా మరొక వేలం నిర్వహించే హక్కు బ్యాంకుకు ఉందని దయచేసి గమనించండి.

**ప్రత్యక్ష వేలం శాఖ వివరాలు**

Thorrur -L25660001972498 L25660001622718 L25660001770368 L25660001650875| Mehboobnagar -L25660001596775 L25660001766876 L26660000750642 L25660001727971 L25660001653039 L25660001766656 L26660000634371| HanamkondaÂ Warangal -L25660001685198 L26660000464880 L25660002193626 L26660000658406 L26660000470078 L25660001578500 L25660001579118 L26660000513229 L25660001635654 L25660001631151| Karimnagar -L26660000478544 L25660001660585 L25660001625313 L25660001704345 L25660001704785 L26660000593496 L25660001703666| MANTHANI -L25660001666255 L25660000559784| Wanaparthy -L25660001796849 L25660000558705 L25660001793395 L25660001759230| Vemulawada -L26660000102043 L25660001723818 L25660001771656 L25660002276491 L26660000185695 L25660001757634 L25660001622588 L25660001602226 L25660001668201 L25660001230935| Narsampet -L25660001661724 L25660000522124 L26660000496129 L25660001673701| MOTHKUR -L25660001687803 L25660002098345|Jagtial -L25660001731833 L25660001603895 L25660001636262 L25660001592093 L26660000737857 L25660001704715 L25660000503040 L25660001688653 L25660001800974 L25660001770768|GHANPUR -L25660001613885 L25660001604643 L25660001605311|PARKAL -L25660001620602 L26660000320672 L25660001574887 L25660001605361 L26660000756651 L25660001792266 L25660001787786 L25660001035533 L25660001030682 L25660001781537 L25660001175318 L25660001783194 L25660001678852 L25660002005583 L25660001640914 L25660001969955 L25660001696607 L25660001665476 L26660000704270|NARAYANAPET -L25660001741514 L25660001785860 L26660000646768 L25660001695219 L26660000719052 L26660000741849 L26660000660791|MAHABUBABAD -L25660001771476 L26660000503408 L25660001730655 L25660000525598 L25660001705843 L26660000623742 L25660002029327 L25660001735645 L25660001730445 L25660001700642 L25660001801682 L26660000762269| Huzurabad Karimnagar -L25660001795731 L25660001613725 L25660001795001 L25660001573209 L25660001657762 L25660001733889 L25660001854191 L25660001796659| Khammam -L25660001574627 L25660000526056 L26660000570900 L26660000570850 L26660000385458| Dharmaram -L25660001763802 L25660001761285| ACHAMPET -L25660001629585 L26660000471616 L26660000660401 L25660001683382 L25660001579098 L25660001620362| Kamareddy -L25660001901384 L25660001637780 L25660001575125 L25660001770978 L25660001611799 L25660001712199|SHADNAGAR -L25660000513471 L25660001741374 L25660001676935 L25660001792776| Siddipet -L25660001622378 L25660001635574 L25660001740795 L25660001656314| Road No.1 Banjara Hills -L9001090156485432 L25660001724036 L25660002160328| KONDA MALLEPALLI -L25660001798445| Kataram -L25660001602666 L25660001630603|Peddapalle -L25660001789813 L25660001624295 L25660001721102| Medak -L25660001728249 L25660001731633 L25660001666845|Sangareddy -L25660001687635 L25660001639676| VANASTHALIPURAM -L26660000610786 L26660000773518| Jogipet -L25660001722690 L25660001734857 L25660001727461 L25660001066284| CHOUTUPPAL -L25660001742252 L26660000773278 L25660001733209 L25660001734847| Miriyalguda -L26660000607523 L26660000902977 L26660000583826 L26660000228816| Nagarkurnool -L25660001749529 L26660000166641 L25660001650185 L25660001680817| Nakkalagutta Warangal -L26660000603860 L25660001769401 L25660000411403 L25660001768033| Nalgonda -L26660000693668 L26660000744764|Kodad -L25660001637590 L25660001707399 L25660001604523|Banswada -L25660001616300 L26660000438590 L26660000671900|Narayankhed -L25660001645315 L25660001747783 L25660001726893 L25660001657262| Madhira -L25660001763452 L25660001732411|MANUGURU -L26660000647786| Sathupalli -L25660001793265| Mulugu -L26660000774166 L26660000537584| Palwancha -L25660001728279| BODHAN -L25660001828851 L26660000663636| Gadwal -L25660001579298| Suryapet -L25660001798225 L25660001646083 L25660001734037 L25660001573759|Jangaon -L26660000493405|THALLADA -L25660002002118| Gajwel -L25660001659408 L25660001754679|KORUTLA -L25660001655935 L25660001627749|YADADRI BHONGIR -L25660001642530| HUSNABAD -L26660000547735.

గమనిక: 1. భౌతిక వేలం విఫలమైతే, https://gold.samil.in అనే వెబ్ లింక్ ద్వారా ఇ-వేలం నిర్వహించబడుతుంది.
2. ఒకవేళ ప్రతిపాదిత వేలం విఫలమైతే, ఈ నోటీసును తదుపరి వేలం కోసం ముందస్తు నోటీసుగా పరిగణించగలరు.
3. వేలం బిడ్ ఫారంలో పేర్కొన్న కొన్ని నిబంధనలు మరియు షరతులకు లోబడి ఉంటుంది, ఇది వేలం ప్రారంభానికి ముందు అందుబాటులో ఉంచబడుతుంది.

సం/-మేనేజర్,
AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్



AU SMALL FINANCE BANK

**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)**

నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001, రాజస్థాన్, (ఇండియా) (CIN:L36911RJ1996PLC011381)

అనుబంధం IV-A (నిబంధన 8 (6) చూడండి)

**స్థిరాస్తుల యొక్క విక్రయం కొరకు విక్రయ ప్రకటన**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002" మరియు 'సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002' లోని రూల్ 8(6) నిబంధనల ప్రకారం, స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకానికి సంబంధించిన నోటీసు ఇది. రుణగ్రహీత, సహరుణగ్రహీత, హామీదారు మరియు తాకట్టుదారులకు అలాగే సాధారణ ప్రజలకు తెలియజేయడమేమిటంటే, 'సెక్యూరిటీ ఇంట్రెస్ట్' కలిగిన రుణదాత వద్ద తాకట్టు పెట్టబడిన మరియు "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్' ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ ఇకపై AUSFBగా పేర్కొనబడుతుంది యొక్క అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్న స్థిరాస్తులు కింద వివరించబడినవి వేలం వేయబడుతున్నాయి. కింది పట్టికలో పేర్కొన్న బకాయి మొత్తాన్ని, అలాగే AUSFBకి చెల్లించాల్సిన అదనపు వడ్డీ, ఖర్చులు మరియు ఇతర వ్యయాలను వసూలు చేయడానికి, ఈ ఆస్తులను "ఉన్నది ఉన్నట్లుగా" అనే ప్రాతిపదికన ఇ-వేలం ద్వారా విక్రయించడం జరుగుతుంది. https://sarfaesi.auctiontiger.net అనే వెబ్‌సైట్ ద్వారా ఈ బహిరంగ ఇ-వేలం నిర్వహించబడుతుందని మీకు తెలియజేస్తున్నాము.

| ఖాతా నెం. మరియు రుణగ్రహీత, సహరుణగ్రహీత, తాకట్టుదారులు, హామీదారుల పేరు | సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు ప్రకారం తేదీ మరియు మొత్తం; అలాగే భౌతిక స్వాధీనం తేదీ మరియు నాటికి ఉన్న మొత్తం (తేదీ) | రిజర్వ్ ధర, బయానా బిడ్ పెంపు మొత్తం (రూపాయలలో) | ఇ-వేలం తేదీ మరియు సమయం, EMD సమర్పణకు చివరి తేదీ, బిడ్‌లు మరియు డాక్యుమెంట్లు సమర్పించాల్సిన ప్రదేశం, ఇన్‌స్పెక్షన్ తేదీ |
| --- | --- | --- | --- |
| (Loan A/c No.) 2221261245188414 & 9001231631102611, M/S KRS గ్రూప్ ద్వారా దాని పార్ట్‌నర్స్ శ్రీ శ్రీనివాస హర్ష జమ్ము మరియు శ్రీ రవి కిరణ్ క్రొవ్విడి (రుణగ్రహీత/తాకట్టుదారు) Mr. శ్రీనివాస హర్ష జమ్ము S/o Mr. దుర్గా రవీంద్రనాథ్ జమ్ము (హామీదారు) శ్రీ రవి కిరణ్ క్రొవ్విడి S/o శ్రీ రామ మోహన్ క్రొవ్విడి (హామీదారు) శ్రీమతి జమ్ము సుజాత W/o శ్రీ దుర్గా రవీంద్రనాథ్ జమ్ము ((హామీదారు/తాకట్టుదారు) | 13(2) నోటీసు జారీ తేదీ: 17/11/2025 రుణ ఖాతా నం. 2221261245188414కు సంబంధించి 15-11-2025 నాటికి బకాయి మొత్తం రూ. 3,67,25,471/- (మూడు కోట్ల అరవై ఏడు లక్షల ఇరవై ఐదు వేల నాలుగు వందల డెబ్బై ఒక్క రూపాయలు మాత్రమే). రుణ ఖాతా నం. 9001231631102611కు సంబంధించి 15-11-2025 నాటికి బకాయి మొత్తం రూ. 17,40,287/- (పదిహేడు లక్షల నలభై వేల రెండు వందల ఎనభై ఏడు రూపాయలు మాత్రమే). 15-11-2025 నాటికి మొత్తం కలిపి బకాయి మొత్తం రూ. 3,84,65,758/- (మూడు కోట్ల ఎనభై నాలుగు లక్షల అరవై ఐదు వేల ఏడు వందల యాభై ఎనిమిది రూపాయలు మాత్రమే). భౌతిక స్వాధీనం జరిగిన తేదీ: 11-05-2026. రుణ ఖాతా నం. 2221261245188414కు సంబంధించి 06 జూలై 2026 నాటికి బకాయి మొత్తం రూ. 4,13,88,428/ (నాలుగు కోట్ల పదమూడు లక్షల ఎనభై ఎనిమిది వేల నాలుగు వందల ఇరవై ఎనిమిది రూపాయలు మాత్రమే). రుణ ఖాతా నం. 9001231631102611కు సంబంధించి 06జూలై 2026 నాటికి బకాయి మొత్తం రూ. 21,52,226/- (ఇరవై ఒక లక్షల యాభై రెండు వేల రెండు వందల ఇరవై ఆరు రూపాయలు మాత్రమే). 06 జూలై 2026 నాటికి మొత్తం కలిపి బకాయి మొత్తం రూ. 4,35,40,654/- (నాలుగు కోట్ల ముప్పై ఐదు లక్షల నలభై వేల ఆరు వందల యాభై నాలుగు రూపాయలు మాత్రమే); దీనికి అదనంగా భవిష్యత్తు వడ్డీ మరియు ఇతర ఛార్జీలు వర్తిస్తాయి. | రిజర్వ్ ధర రూ. 2,03,00,000/- (రూపాయల రెండు కోట్ల మూడు లక్షలు మాత్రమే) బయానా రూ. 20,30,000/- (రూపాయల ఇరవై లక్షల ముప్పై వేలు మాత్రమే) బిడ్ పెంపు మొత్తం రూ. 10,000/- (రూపాయలు పది వేలు మాత్రమే) | 20 ఆగస్టు 2026 ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు ఐదు నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో బిడ్ సమర్పణకు చివరి తేదీ: 19 ఆగస్టు 2026, సాయంత్రం 05:00 గంటల వరకు AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, శాఖ: గ్రౌండ్ ఫ్లోర్, ఇంటి నం. 25/A, వెంగళరావు నగర్ కాలనీ, హైదరాబాద్, తెలంగాణ 500038 ఇ-మెయిల్ ఐడి: bhanu.singh3@aubank ఇన్‌స్పెక్షన్ తేదీ: 28&29 జూలై 2026 |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ

తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, అన్నారం గ్రామ పంచాయితీ పరిధిలోని అన్నారం గ్రామంలో ఆదిత్య ఫెర్టిలైజర్ సమీపంలో, సర్వే నంబర్ 182/Aలో ఉన్న 4840 చదరపు గజాల విస్తీర్ణం గల పారిశ్రామిక స్థలం మరియు దానిపై ప్రస్తుతం ఉన్న మరియు భవిష్యత్తులో నిర్మించబడే నిర్మాణాలు. ఈ ఆస్తి M/S. KRS గ్రూప్ యాజమాన్యంలో ఉంది. దీని సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి:
తూర్పు: సర్వే నంబర్ 180, పడమర: రామేశ్వరం నుండి కిషన్‌నగర్ వెళ్లే రోడ్డు, ఉత్తరం: సర్వే నంబర్ 182 మరియు చంద్రశేఖర్ రెడ్డి గారి భూమి, దక్షిణం : సర్వే నంబర్ 182లో విక్రేతకు చెందిన భూమి. వాస్తవ నిర్మాణ విస్తీర్ణం సుమారు 2100 చదరపు అడుగులు.

గమనిక: స్వాధీనం చేసుకునే సమయంలో తాకట్టు ఉంచిన ఆస్తి వద్ద ఉన్న సరుకు, గోడకు శాశ్వతంగా బిగించిన ఫర్నిచర్ మరియు ఫిక్చర్లు, [illegible]

ఇ-వేలం ప్రక్రియలో పాల్గొనడానికి మరియు నిబంధనలు & షరతులతో సహా తదుపరి వివరాలను తెలుసుకోవడానికి [illegible] https://sarfaesi.auctiontiger.net [illegible] https://www.aubank.in/bank-auction [illegible] 9358002663 [illegible] bhanu.singh3 aubank.in [illegible]

ఇది 'సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002' లోని నియమం 8(6) ప్రకారం రుణగ్రహీత/తాకట్టుదారులకు జారీ చేయబడిన చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకపు నోటీసు.

ఇ-వేలం అమ్మకానికి సంబంధించిన నిబంధనలు మరియు షరతులు:

1. [illegible] AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (AUSFB) [illegible]
2. [illegible] EMD [illegible] RTGS/NEFT [illegible] "MSME AUCTION POOL ACCOUNT OF AU Small Finance Bank Limited" [illegible] Current Account No. 1921201121711599, IFSC Code: AUBL0002011 [illegible] AU SMALL FINANCE BANK LIMITED, 5th & 6th Floor, Sunny Big Junction, STC Khasra No. 64 to 67, Gram Sukhaipura, New Atish Market, Jaipur 302020 [illegible]
3. [illegible] bhanu.singh3@aubank.in [illegible] https://sarfaesi.auctiontiger.net [illegible] https://www.aubank.in/bank-auction [illegible] 9358002663 [illegible]

తేదీ: 15-జూలై-2026 ప్రదేశం రంగారెడ్డి జిల్లా, తెలంగాణ సం/- అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

# స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులు వేగవంతం

● ఎస్‌పిడిసిఎల్ మొబైల్ యాప్ సరళతరం ● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్



**తిరుపతి, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి కోరారు. తిరుపతిలోని ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం సంస్థ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ సంస్థ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, వాటర్ వర్క్స్, వీధి దీపాలు తదితర సర్వీసులతోపాటు గృహ విద్యుత్ సర్వీసులకు, ఫీడర్లకు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు మొత్తం కలిపి ఇప్పటివరకు 10.50 లక్షల స్మార్ట్ మీటర్లను అమర్చామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ విద్యుత్ సర్వీసుల విద్యుత్ వినియోగం, బిల్లింగ్‌లో పాదర్శకతను పెంపొందించేందుకు వీలుగా స్మార్ట్ మీటర్లను ప్రిపెయిడ్ స్మార్ట్ మీటర్లుగా మార్చినట్లు తెలియజేశారు. స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారులు విద్యుత్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవడం, విద్యుత్తు పొదుపు, బిల్లులో ఆదా చేసుకునేందుకు అవకాశం వుంటుందని వివరించారు.

**ఎస్‌పిడిసిఎల్ మొబైల్ యాప్ సరళతరం:** సంస్థ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సౌలభ్యం కోసం అందుబాటులో ఉన్న మొబైల్ అప్లికేషన్‌ను సరళతరం చేశామని సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ఈ యాప్ ద్వారా వినియోగదారులు విద్యుత్ బిల్లుల చెల్లింపు, పేమెంట్ వివరాలను తెలుసుకోవడంతోపాటు కొత్త సర్వీసులకు దరఖాస్తు చేసుకునే సౌలభ్యం కూడా వుందన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్స్ తోపాటు ఐఫోన్ వినియోగదారులు కూడా ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలియజేశారు.

సంస్థ పరిధిలో ఇప్పటికే మంజూరైన సబ్ స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సబ్ స్టేషన్ల నిర్మాణంలో పరికరాల నాణ్యతను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సంబంధిత కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, జె.రమణా దేవి, సిహెచ్ రామచంద్ర రావు, కె.సంపత్ కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు శ్రీనివాసులు, జగదీష్, లత పాల్గొన్నారు.

## మెరిట్ ఆధారంగానే ఎఇఇ పోస్టుల నియామకం

● 20 లోగా దరఖాస్తు చేసుకోవాలి ● ఆగస్ట్ 22 నుంచి రాతపరీక్షలు



**తిరుపతి, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎపిట్రాన్స్‌కో, ఎపిజెన్‌కో, ఎస్‌పిడిసిఎల్, ఇపిడిసి ఎల్, ఎపిసిపిడిసిఎల్ సంస్థల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా రాత పరీక్షలో మెరిట్ ద్వారానే నియామకాలను చేపట్టడం జరుగుతుందని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి బుధవారం పేర్కొన్నారు. ఎపిట్రాన్స్‌కోలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 16, టెలికామ్ 10, సివిల్ ఇంజనీర్లు 23 మొత్తం కలిపి 200, ఎపిజెన్‌కోలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 52, మెకానికల్ 21, ఎలక్ట్రానిక్స్ 7, సివిల్ ఇంజనీర్లు 20 మొత్తం కలిపి 100, ఎపిఎస్‌పిడిసిఎల్లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 125, టెలికామ్ 4, సివిల్ ఇంజనీర్లు 6 మొత్తం కలిపి 135, ఎపిఇపిడిసిఎల్లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 128, టెలికామ్ 3, సివిల్ ఇంజనీర్లు 4 మొత్తం కలిపి 135, ఎపిసిపిడిసిఎల్లో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు 56, టెలికామ్ 1, సివిల్ ఇంజనీర్లు 3 మొత్తం కలిపి 60 పోస్టుల నియామకానికి ఆయా సంస్థలు ప్రకటనను జారీ చేయడం జరిగిందన్నారు.

నియామక ప్రకటనలో పేర్కొన్న షెడ్యూల్ మేరకే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోందని, ఈ నెల 20వ తేదీ లోగా అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. షెడ్యూల్ పేర్కొన్న విధంగానే ఈ ఏడాది ఆగస్టు 22వతేదీ నుండి 29వతేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ షెడ్యూల్ తేదీల్లో ఎటువంటి మార్పు వుండబోదని స్పష్టం చేశారు.

**నియామకాల్లో అవకతవకలకు చోటు లేదు:** ఎఇఇ పోస్టుల నియామక ప్రక్రియలో ఎటువంటి అవకతవకలకు చోటులేదని, ఈ ప్రక్రియ మొత్తాన్ని పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని సిఎండి శివశంకర్ వివరించారు. ఈ ప్రక్రియకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని వెబ్సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఎఇఇ పోస్టుల నియామక అంశంలో అభ్యర్థులు దళారుల మాటలు, ఇతర అనధికారిక సామాజిక మాధ్యమాల ద్వారా వెలువడే సమాచారాన్ని నమ్మి మోసపోవద్దని సూచించారు.

## ఎక్సలెన్సీ సెంటర్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

●ప్రవేశం పొందిన విద్యార్థులకు ఇంటర్, ఐఐటి, నీట్, జెఇఇకి ఉచిత శిక్షణ

**విజయవాడ, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ప్రముఖ కోచింగ్ సంస్థల సహకారంతో నడపబోతున్న సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో, ఇంటిగ్రేటెడ్ ఐఐటి, జెఇఇ, నీట్ కోచింగ్‌తో కూడిన ఇంటర్మీడియట్ (ఎంపిసి/ బైపిసి) కోర్సులలో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మార్చి 2026లో జరిగిన ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలో ఉత్తీర్ణులై, 85శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు జూనియర్ ఇంటర్మీడియట్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. మార్చి 2026లో జూనియర్ ఇంటర్మీడియట్‌లో 75శాతం మార్కులు సాధించిన విద్యార్థులు సీనియర్ ఇంటర్మీడియట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఈ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాల ద్వారా నాణ్యమైన ఇంటర్మీడియట్ విద్యతో పాటు సమగ్రమైన ఐఐటి, జెఇఇ, నీట్ కోచింగ్, వసతి, భోజనం, స్టడీ మెటీరియల్, ఇతర విద్యాపరమైన సహాయంతో కూడిన ఉచిత గురుకుల విద్యను అందిస్తామని తెలిపారు. 17 జులై 2026 నుండి 30 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటికే ఇతర జూనియర్ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రసన్న వెంకటేష్ తెలిపారు.

## రౌడీ షీటర్‌పై పిడి యాక్ట్

**తిరుపతి, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లాలో ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగిస్తూ వరుసగా తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న రౌడీ షీటర్ కంకి వంశి(25)పై పిడియాక్టు పోలీసులు నమోదు చేశారు. ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ప్రతిపాదనతో జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పిడి యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడు సూళ్లూరుపేట, శ్రీహరికోట, తడ, నాయుడుపేట, చిట్టమూరు, కోట, వాకాడు, గూడూరు, నెల్లూరు, గుంటూరు తదితర ప్రాంతాల్లో దొంగతనాలు, దాడులు, మహిళలపై వేధింపులు, ఆయుధాలతో బెదిరింపులు, ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడినట్లు నమోదైంది. అతనిపై మొత్తం 28 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. పలుమార్లు అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నప్పటికీ అతని నేరప్రవర్తనలో మార్పు రాకపోవడంతో, ప్రజా శాంతి భద్రతలకు తీవ్ర ముప్పుగా మారినట్లు జిల్లా పోలీసు శాఖ గుర్తించింది. దీంతో జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వుల మేరకు నిందితుడిని ఈరోజు కడప సెంట్రల్ జైలుకు భద్రతా ఏర్పాట్ల మధ్య తరలించారు.

# తిరుచానూరు రోడ్ల అభివృద్ధికి టిటిడి నిధులు




**తిరుపతి, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతికి అత్యంత ప్రధాన మైన మరో పుణ్యక్షేత్రం తిరుచానూరు పరిసర ప్రాంతాల రహదారుల విస్తరణ, మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి టిటిడి నిధులు మంజూరుకు ఆమోదం లభించింది. తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు, స్థానిక ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రహదారులను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అంశంపై ప్రణాళికలు సిద్ధం చేశారు. తిరుచానూరు రోడ్ల అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ ప్రణాళికలు, బ్లూప్రింట్లను టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడుకి తుడ చైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, జిల్లా సంయుక్త కలెక్టర్,విసి గోవిందరావు వివరించారు.

బుధవారం తుడ చైర్మన్ దివాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆర్. గోవిందరావుతో కలిసి తుడా కార్యాలయంలో టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు నేతృత్వంలో జరిగిన సమావేశంలో టిటిడి పాలకమండలి సభ్యులు పనబాక లక్ష్మి, భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. తిరుచానూరు పరిసరాల్లో పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా అంతర్గత, ప్రధాన రహదారులను లింక్ చేస్తూ మాస్టర్ ప్లాన్ రోడ్లను డిజైన్ చేశామన్నారు.

భూసేకరణ ప్రక్రియ, ప్రస్తుతం ఉన్న రోడ్ల విస్తరణకు ఎదురవుతున్న సాంకేతిక సవాళ్లను అధిగమించడానికి తీసుకుంటున్న చర్యలను టిటిడి చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు.

టిటిడి, తుడ సంయుక్త భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం ద్వారా తిరుపతి నగర రూపురేఖలు మారతాయని స్పష్టంచేశారు.

తుడ అధికారులు అందించిన ప్రజెంటేషన్, ప్రణాళికలపై చైర్మన్ బి.ఆర్. నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. తిరుచానూరు రోడ్ల అభివృద్ధికి అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేసేందుకు టిటిడి బోర్డు పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నిధుల కొరత లేకుండా చూస్తామన్నారు. ఎలాంటి జాప్యం లేకుండా టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి, పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని తెలిపారు.

# నదుల అనుసంధానంతోనే కరవు నివారణ

● జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ● కేంద్ర మాజీ మంత్రి దివంగత కెఎల్ రావుకు నివాళి



**విజయవాడ, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశం కరవు విపత్తును అధిగమించాలంటే నదులను అనుసంధానం చేయడమే ఏకైక మార్గమని ఏపి జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఉద్ఘాటించారు. గంగా, మహానది, గోదావరి, కృష్ణా, కావేరి వంటి నదులు ఈ దేశానికి చాలా అవసరమని కెఎల్ రావు సూచించారని, వాటిని అనుసంధానం చేయాలన్నారు. జలవనరుల శాఖ నిపుణుడు, కేంద్ర మాజీ మంత్రి దివంగత కెఎల్ రావు 125వ జయంతి సందర్భంగా విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద ఉన్న ఆయన ఘాట్ వద్ద మంత్రి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ "కెఎల్‌రావు ఇచ్చిన స్ఫూర్తి, అప్పటి ప్రధానమంత్రి నుండి ప్రస్తుత నరేంద్ర మోడీకి స్ఫూర్తినిచ్చింది. అదేవిధంగా, చంద్రబాబు నాయుడు కూడా దీనిని అమలు చేసి, పట్టిసీమ ద్వారా గోదావరి-కృష్ణా డెల్టాలను అనుసంధానించారు. ఇది కెఎల్ రావుకు మన గొప్ప నివాళి. పట్టిసీమ ద్వారా 445 టిఎంసిలకు పైగా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించాం" అని వివరించారు. పట్టిసీమ, ఒట్టిసీమ అన్న గొడ్డలి పార్టీ నాయకుడు ఇప్పుడు ఏం చెబుతారని మంత్రి నిమ్మల రామానాయుడు నిలదీశారు. విధ్వంసపు ఆలోచనలు, పాలన అనుభవం లేకపోవడం, ముందుచూపు లేకపోవడం వల్లే గొడ్డలి పార్టీ నాయకుడు పట్టిసీమ ఎత్తిపోతల వైపు కన్నెత్తి చూడలేదని మంత్రి విమర్శించారు. కృష్ణా డెల్టాకు నీరు అందక, సాగు తాగునీరు లేక బీడుగా మారితే చూడాలన్నదే గొడ్డలి పార్టీ ఆకాంక్ష అని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దేవినేని ఉమా, కెఎల్ రావు కుమారుడు విజయరావు పాల్గొన్నారు.

మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఈ అండర్ టన్నెల్ అయినా, భవానీపురం సమీపంలోని గాంధీ హిల్ అయినా, లేదా ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిని నిల్వ చేయడం అయినా, ఈ స్ఫూర్తిని అందుకున్న ఎన్టీ రామారావు ఆ రోజుల్లో కృష్ణమ్మను తన కలంలో ఇరికించి తెలుగు గంగపై వారి మద్రాసులకు నీటిని అందించారు. అదే స్ఫూర్తితో, ముఖ్యమంత్రి పట్టిసీమ ప్రాంతంలో నదుల అనుసంధానం ద్వారా ఆ ప్రాంతానికి 445 టిఎంసిల నీటిని తీసుకువచ్చారు. 442 టిఎంసిల నీటిని వినియోగించుకొని రూ.50 వేల కోట్ల విలువైన పంటలను కృష్ణా డెల్టా రైతులు పండించారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చెప్పారు. వైఎస్సార్సీపీ కుట్రలు ఎన్ని చేసినా సిఎం చంద్రబాబు తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన తండ్రి ఆశయాలతో ముందుకు సాగుతుండటం సంతోషంగా ఉందని కెఎల్ రావు కుమారుడు విజయరావు అన్నారు.

## తిరుమల సమాచారం

### శ్రీవారి దర్శన టిక్కెట్లు, వసతి కోసం మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు

● టిటిడి అధికారిక వెబ్‌సైట్‌నే వినియోగించాలి: అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి రోజురోజుకూ రెట్టింపవుతున్న భక్తుల సంఖ్యకు తగ్గట్లు పలు రకాలుగా దళారులు భక్తులను నమ్మించి మోసం చేస్తున్నారు. వివిధ దర్శనాలు కల్పిస్తామని, గదులు ఇప్పిస్తామని నమ్మించి భారీగా డబ్బులు తీసుకుని చివరకు దగా చేస్తున్నారు. దీంతో రోజురోజుకూ భక్తుల నుండి వస్తున్న ఫిర్యాదులతో టిటిడి అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. ఓ వైపు టిటిడి విజిలెన్స్ విభాగం అధికారులు, తిరుమల పోలీసులు కేసులు నమోదు చేసి చేతులు దులుపేసుకుంటుండటంతో దళారుల మోసాలు ఎక్కువయ్యాయనే విమర్శలు లేకపోలేదు. ఇప్పుడు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కూడా మధ్యవర్తులను, దళారులను నమ్మిమోసపోవద్దని సూచించారు. టిటిడి అధికారిక వెబ్‌సైట్ ద్వారానే భక్తులు దర్శనం టిక్కెట్లు, వసతి కోసం సంప్రదించాలని తెలిపారు. శ్రీవారి దర్శనం, వసతి గదులు, ఆర్జిత సేవలు తదితర బుకింగ్‌ల కోసం భక్తులు తప్పనిసరిగా టిటిడి అధికారిక వెబ్‌సైట్ ద్వారానే బుకింగ్ చేసుకోవాలని అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి విజ్ఞప్తి చేశారు.

# కుప్పలుతెప్పలుగా విరాళాలు!

● పెరిగిన దాతల దర్శనాల ఒత్తిడి తట్టుకోలేకనే సదుపాయాలు కోత
● టిటిడి కొత్త దాతలకు జీవితాంతం నుండి పాతికేళ్లకు కుదింపు



**తిరుమల, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు... ఆపద మొక్కుల వాడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాల ప్రాధాన్యతలో దాతలు కీలకంగా మారారు. ఎన్నో ఏళ్ళనుండి ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న వివిధ ట్రస్టులు, పథకాలకు డబ్బున్న ధనవంతులు నుండి కోటీశ్వరులు కూడా దేవదేవునిపై భక్తి విశ్వాసాలతో విరాళాలివ్వడం పరిపాటిగా మారింది. ధనవంతులు, పారిశ్రామిక వేత్తలు, కోటీశ్వరులు కూడా దేవునిపై భక్తి విశ్వాసాలతోనే గాక వారి కుటుంబం తిరుమలకు వస్తే ఇష్టదైవాన్ని దగ్గరగా వీక్షించే భాగ్యం కలుగుతుందని విశ్వాసంతోనే విరాళాలు ఇస్తున్నారనేది టిటిడి వర్గాల అభిప్రాయం. ఇందులో ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.2,500 కోట్లకు పైగానే విరాళాలు రావడం విశేషం. ఆ తరువాత ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు ప్రస్తుతం విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే పలు ట్రస్టులకు దాతలు విరాళాలు ఇచ్చేందుకు టిటిడి అధికారులతో బాటు పాలకమండలి కూడా ప్రోత్సాహమిస్తోంది. టిటిడిలో దాదాపు 2లక్షల మంది దాతలు నమోదైనట్లు తెలుస్తోంది. మంగళవారం ఒక్కరోజే 96.98కోట్ల రూపాయలు వివిధ పథకాలకు విరాళాలు రావడం విశేషం. ఇందులో ఆన్‌లైన్‌ద్వారా 2,354మంది, ఆఫ్‌లైన్ ద్వారా 106మంది భక్తులు విరాళాలు అందించారు.

ఇదివరకు టిటిడి ట్రస్టులు, పథకాల్లో ఏదేని ఒక దానికి ఒక లక్ష రూపాయలు విరాళమిచ్చినా దాతలకు నిన్నటి వరకు సంవత్సరంలో మూడు సార్లు ఐదుగురికి సుపథం టిక్కెట్లు జారీచేసేవారు. నూతన దాతల పాలసీతో ఏడాదికి ఒకసారి మాత్రమే ప్రత్యేక ప్రవేశ దర్శనం (ఎస్ఇడి) టిక్కెట్లు జారీ చేస్తారు. రూ.2 లక్షలు విరాళాల దాతలకు ఏడాదికి ఒకసారి సుపథం దర్శనం టిక్కెట్లు ఇస్తారు. ఇలా రూ.3లక్షలు దాతలకు ఏడాదికి రెండుసార్లు సుపథం, రెండు సార్లు ఎస్ఇడి టిక్కెట్లు ఇస్తారు. రూ.10లక్షలు ఇచ్చిన దాతలకు సంవత్సరంలో ఒకసారి బిగినింగ్ బ్రేక్ దర్శనం సదుపాయం కల్పించారు. రూ.15లక్షలు విరాళమిచ్చిన దాతలకు ఒకసారి సుపథం, ఒకసారి బిగినింగ్ బ్రేక్ దర్శనాలు సదుపాయం కల్పించారు. రూ.20లక్షలు దాతలకు ఒకసారి సుపథం, ఒకసారి ఎస్ఇడి, రెండు సార్లు బిగినింగ్ బ్రేక్ దర్శనాలు సౌకర్యం ఉంటుంది. 25లక్షలు ఇచ్చిన దాతలకు రెండు సార్లు సుపథం, ఒకసారి ఎస్ఇడి, మూడు సార్లు విఐపి బ్రేక్ దర్శనాలు సదుపాయం ఉంటుంది. రూ.50లక్షలు దాతలకు ఏడాదికి నాలుగుసార్లు సుపథం, 2సార్లు బిగినింగ్ బ్రేక్, ఒకసారి సుప్రభాతం, 2సార్లు కల్యాణోత్సవం సేవా భాగ్యం కల్పిస్తారు.

అత్యధికంగా కోటి రూపాయలు ఇచ్చిన దాతలకు నాలుగుసార్లు సుపథం దర్శనం, 3సార్లు బిగినింగ్ బ్రేక్, సుప్రభాతసేవ దర్శనం 2సార్లు అవకాశం ఉంటుంది. ఇదివరకు ఉన్న సదుపాయాల్లో భారీగా టిటిడి కొత్తగా చేరే దాతలకు కోత విధించింది. ఇదివరకు దాతలకు జీవితాంతం సౌకర్యాలు కల్పించిన టిటిడి కొత్తవారికి 20యేళ్ళకు మాత్రమే కుదించింది. పలురకాలుగా పారిశ్రామికవేత్తలు ఇచ్చే విరాళాల దాతల సౌకర్యాలను 15సంవత్సరాలకు కుదించారు. టిటిడి గణాంకాల మేరకు రూ.10లక్షల లోపు దాతలు 1,212మంది, రూ.10లక్షల నుండి 25లక్షల వరకు 1,246మంది దాతలు, కోటి రూపాయలు విరాళాలిచ్చిన దాతలు కేవలం ఇద్దరే ఉండటం గమనార్హం. వసతి సదుపాయాల్లో కూడా వంద రూపాయలు గదుల నుండి 3వేల రూపాయల అద్దె గదుల వరకు ప్రయోజనం ఉంటుంది. టిటిడి నుండి ప్రయోజనాలను పొందడానికి దాతలు ముందుగానే తమ విరాళాలు సమర్పించారనేది అధికారుల వాదన. రూ.2 కోట్లు విరాళాలిచ్చిన దాతలకు ప్రయోజనాలు కూడా 20యేళ్ళకే కుదించారు.

ఇంకా దాతలు శ్రీవారి దర్శనాల కోసం తీసుకువస్తున్న ఒత్తిడితోనే నూతన దాతల నిబంధనల్లో మార్పుచేసి సౌకర్యాలు కుదించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ వైపు పలు పథకాలకు, ట్రస్టులకు విరాళాలివ్వాలని టిటిడి విజ్ఞప్తి చేస్తుండగా మరోవైపు ఇలా సౌకర్యాలు కుదించడంతో మరీ భక్తులైన దాతల నుండి ఏ మేరకు స్పందన ఉంటుందనేది చూడాల్సిందేనని టిటిడి ఉద్యోగ వర్గాల సమాచారం. టిటిడి అధికారులు మాత్రం సామాన్యభక్తుల దర్శనాల కోసమే దాతల ప్రయోజనాల్లో కుదింపు చేశామనేది వివరణ.

# ఆపదమొక్కులవాడికి రేపు ఆణివార ఆస్థానం



**తిరుమల, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం (రేపు) సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం జరుగనుంది. ఉదయం 7గంటలకు బంగారు వాకిలి ముందు గల ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయ దేవేరులతో మలయప్పస్వామి గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన విష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతో పాటు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు. తిరుమల పెద్దజీయ్యర్ స్వామి పెద్ద వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేస్తారు. వీటిలో నాలుగు పట్టువస్త్రాలను మూలమూర్తికి అలంకరిస్తారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామికి, మరొకటి విశ్వక్సేనులకి అలంకరిస్తారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు తలకు శ్రీవారిపాదవస్త్రంతో వరిపట్టం కట్టుకుని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి నిత్యైశ్వర్యోభం అని స్వామిని ఆశీర్వదిస్తారు. ఆ తరువాత అర్చకులు పెద్దజీయర్, చిన్నజీయర్ స్వామికి, టిటిడి ఇఒ చేతులకు లచ్చన తాళపు చెవిగుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి తగిలిస్తారు. హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసి తాళపు గుత్తిని స్వామివారి పాదాలచెంత ఉంచుతారు.

**సాయంత్రం పుష్ప పల్లకీ:** ఆణివార ఆస్థానం సందర్భంగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకీపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేస్తారు. ఆణివార ఆస్థానం కారణంగా జులై 17న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది.

# విద్య, ఆరోగ్య రంగాలకు అత్యున్నత ప్రాధాన్యం

● ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు



**తిరుమల, జులై 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడిలో విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల సమగ్ర వికాసానికి అన్ని విధాలా కృషి చేస్తున్నామని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టిటిడిలో విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. టిటిడి ఆధ్వర్యంలోని 33 విద్యాసంస్థల్లో సుమారు 20 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, వారికి నాణ్యమైన విద్యతో పాటు అత్యాధునిక మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, విలువలు, కృషిని అలవర్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. తిరుపతి మహతి కళాక్షేత్రంలో బుధవారం టిటిడి విద్యాసంస్థల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు "ప్రతిభా పురస్కారం-2026 కార్యక్రమాన్ని నిర్వహించి 147 మంది ప్రతిభావంతులను సన్మానించారు. ఇఒ ముద్దాడ రవిచంద్ర మాట్లాడుతూ విద్యే జీవితాన్ని మార్చే శాశ్వత సంపద అని, దానిని ఎవరూ హరించలేరని పేర్కొన్నారు. గ్రామీణ, రైతు కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు టిటిడి కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా టిటిడి విద్యాసంస్థలను తీర్చిదిద్దేందుకు అవసరమైన అధ్యాపక సిబ్బంది, మౌలిక సదుపాయాలు, పోషకాహార భోజనం, నాణ్యమైన బోధనను అందిస్తున్నామని తెలిపారు. జెఇఒ డాక్టర్ ఎ.శరత్ మాట్లాడుతూ టిటిడి 150 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా "ప్రతిభా పురస్కారాల్లు" అందజేయడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. రూ.162 కోట్లతో విద్యాసంస్థలను ఆధునికీకరిస్తూ డిజిటల్ క్లాస్‌రూములు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సిసిటివి వ్యవస్థలు, ఆధునిక మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యోగా, సంగీతం, నృత్యం, నైతిక విలువల బోధనకు ప్రాధాన్యం ఇస్తూ దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల సహకారంతో విద్యాసంస్థలను అత్యున్నత ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

టిటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, బోర్డు సభ్యుడు జి. భానుప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ 250 అదనపు సీట్లు, డే స్కాలర్లకు మధ్యాహ్న భోజన పథకం, కొత్త విద్యా భవనాల నిర్మాణం ద్వారా మరింత మందికి నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్వీ జూనియర్ కళాశాల, పద్మావతి మహిళా జూనియర్ కళాశాలకు చెందిన 76మంది ఇంటర్మీడియట్ విద్యార్థులతో పాటు, తిరుపతి, తిరుమలలోని వివిధ టిటిడి పాఠశాలలకు చెందిన 71మంది విద్యార్థులను సన్మానించారు. పద్మావతి మహిళ జూనియర్ కళాశాలకు చెందిన ప్రణవి, ఉత్పల, నేహశ్రీ రాష్ట్ర స్థాయిలో 99శాతం మార్కులు సాధించినందుకు చైర్మన్, ఇఒ ప్రత్యేకంగా అభినందించారు. ప్రతిభ కనబరిచిన 147 మంది విద్యార్థులకు ఐదు గ్రాముల వెండి డాలర్, మెమెంటో, శాలువా, ప్రశంసాపత్రం అందజేశారు. అనంతరం విద్యార్థులు తమ గురువులను గౌరవిస్తూ, క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు ఎన్. సదాశివరావు, సభ్యురాలు జానకి, టిటిడి డిఇఒ ఫణికుమార్ నాయుడు, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, సంక్షేమ విభాగం డిప్యూటీ ఇఒ ఆనందరాజు, విద్యాసంస్థల ప్రిన్సిపాళ్ళు, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిజిటల్ సేవలో శివయ్య దర్శనం సులభతరం

కియోస్క్ యంత్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**శ్రీకాళహస్తి, జులై 15 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో భక్తులకు అందించే సేవలలో పారదర్శకత కోసం ప్రభుత్వం అన్నిసేవలను డిజిటలైజేషన్ చేసిందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆలయంలోని నాల్గవ గేటు వద్ద భక్తుల సౌకర్యార్థం కియోస్క్ యంత్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ఆన్‌లైన్ సేవలను అమలు చేసేందుకు పైలట్ ప్రాజెక్టుగా శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని ఎంపిక చేసారన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఎన్నో సేవలున్నాయని వాటిని ఆన్‌లైన్ చేయటం ద్వారా భక్తులకు ఇబ్బంది ఉండదన్నారు. ఏ పథకమైనా ఆదిలో కొన్ని ఒడుదుడుకులు ఎదుర్కొక తప్పదన్నారు. భక్తులకు సులభతర దర్శనం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆన్‌లైన్ సేవలు అమలు చేస్తుందన్నారు. ఇందుకు భక్తులు సహకరించాలన్నారు.

డిజిటల్ పద్ధతిలో నేరుగా టోకెన్లు దర్శన టిక్కెట్లు బుక్ చేసుకునే సదుపాయం కల్పించటమే ధర్మకర్తల మండలి లక్ష్యమని ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గురప్పశెట్టి, గోపినాథ్, ఇఒ బికె వెంకటేశులు పాల్గొన్నారు.

# ఫలాహారమే ఆరోగ్య ముచ్చట !



సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారం ఎంత అవసరమో తెలియ చెప్పే ఎన్నో అధ్యయనాలు తెలుసుకుంటున్నాం. ప్రధానంగా మధుమేహం మంటే చక్కెరకు దూరంగా ఉం'టే' సరిపోతుందా? అందే కాదు. ఐనా తీపి పదార్థాలు తగ్గిస్తే ప్రమాదం తగ్గుతుందని అనుకోవడం కద్దు. సమస్య కేవలం ఏం తింటున్నామన్న దాంట్లోనే కాదు.. ఏం తినడం లేదన్న దాంట్లోనూ ఉందన్న విషయాన్ని కొన్ని అధ్యయనాలు తేటతెల్లం చేసున్నాయి. ముఖ్యంగా భారత్‌లాంటి దేశాల్లో పండ్లను తగినంతగా తీసుకోకపోవడం టైప్ 2 డయాబెటిస్ భారాన్ని మరింత పెంచుతోందని పరిశోధకులు వెల్లడించారు. ప్రపంచంలో మధుమేహంతో జీవిస్తున్న వారిలో 60 శాతానికి పైగా ఆసియాలోనే ఉన్నారని తెలిసింది. భారత్‌లోనే దాదాపు 7.7 కోట్ల మంది టైప్2 మధుమేహంతో బాధపడుతుండగా, మరో 2.5 కోట్ల మంది ప్రీడయాబెటిస్ దశలో ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఈ పరిస్థితుల్లో మధుమేహాన్ని అరికట్టాలంటే చక్కెర తగ్గించడమే కాకుండా రోజువారీ ఆహారంలో పండ్లను చేర్చుకోవాల్సిన అవసరం ఉందని పరిశోధకులు సూచిస్తున్నారు. భారత్‌తో పాటు దక్షిణాసియాలో మాత్రం పండ్ల వినియోగం పెంచడంపైనే ఎక్కువ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రపంచంలో పండ్లను తగినంతగా తినకపోవడం వల్లనే 85,960 మరణాలకు కారణమైనట్లు అధ్యయనం వెల్లడించింది. పండ్లలో ఉండే పీచు, విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు శరీర జీవక్రియను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపింది. ఇవి ఇన్సులిన్ స్పందనను మెరుగుపరచడంతో పాటు శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడంలో కూడా పండ్లలోని పోషకాలు చురుగాపనిచేస్తాయని వివరించింది. ఆగ్నేయాసియాలో తృణ ధాన్యాలు తక్కువగా తీసుకోవడం ప్రధాన సమస్యగా ఉండగా, తూర్పు ఆసియాలో మాంసం అధికంగా తినడం ఎక్కువ ప్రభావం చూపుతోంది. అధిక ఆదాయ ఆసియా, పసిఫిక్ దేశాల్లో ప్రాసెస్డ్ మాంసం ప్రధాన ప్రమాద కారకంగా గుర్తించారు. గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ స్టడీ 2023 విశ్లేషణలో భారత్‌తో పాటు దక్షిణాసియాలో టైప్2 మధుమేహానికి ప్రధాన ఆహార సంబంధిత ప్రమాద కారకం పండ్లను తక్కువగా తీసుకోవడమేనని తేలింది. చక్కెర, ప్రాసెస్డ్ ఆహారం గురించే ఎక్కువగా చర్చ జరుగు తున్న సమయంలో ఈ అధ్యయనం దృష్టిని మరో కీలక అంశంపైకి మళ్లించింది. ఆరోగ్యకర మైన ఆహారాన్ని పెంచడం కూడా మధుమేహ నియంత్రణలో అంతే ముఖ్యమని స్పష్టం చేసింది. 1990 నుంచి 2023 వరకు ఆసియాలోని 34 దేశాల సమాచారాన్ని పరిశీలించి ఈ అధ్యయనం నిర్వహించారు. ఆహార అలవాట్లు మధుమేహంపై ఎంతటి ప్రభావం చూపుతున్నాయో ఈ గణాంకాల ద్వారా తెలుసుకోవడమే కాదు పండ్లు, తృణధాన్యాల వినియోగం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం దిశగా తమ ఆహార వినియోగంలో చేర్చుకోవాల్సిన ఆవశ్యకతను తెలియ చేస్తుంది. □

**చిట్కా**: గోరువెచ్చని నీటిలో ఆరచెక్క నిమ్మరసము కలిపి పుక్కిలిస్తే నోటి దుర్వాసన రాదు. □

# వ్యథ ఆలయాలు మాస్ కౌన్సెలింగ్ కేంద్రాలు !



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

**ప్రశ్న**: మా అక్క గత ఆరు నెలలుగా దిగులుతో బాధపడుతోంది. మా బావ చేస్తున్న వ్యాపారాల్లో నష్టం రావడంతో పాటు అప్పుల సమస్య కూడా ఉంది. దీంతో ఆకలి తగ్గింది, నిద్ర సరిగా పట్టడం లేదు. కోపం, చిరాకు కూడా ఎక్కువయ్యాయి. సైకాలజిస్టు వద్ద కౌన్సెలింగ్ తీసుకుంటే మంచిదని చెప్పాను. కానీ నా మాట వినకుండా మా పురోహితుడి సూచన మేరకు 40 రోజులు శివాలయంలో ప్రదక్షిణలు చేయడానికి సిద్ధమైంది. ఈ పరిస్థితిలో ఆమెను ఎలా ఒప్పించాలి? - లావణ్య, బెంగళూరు

**జవాబు**: అమ్మా, ఆలయాలు అనేక మందికి మానసిక ప్రశాంతత, భావోద్వేగ మద్దతు, ఆత్మస్థైర్యాన్ని అందించే ఆధ్యాత్మిక వేదికలు. అందుకే వాటిని రూపకంగా 'మాస్ కౌన్సెలింగ్ కేంద్రాలు' అని పేర్కొనవచ్చు. కోట్లాది మంది ప్రజలు జీవితంలో ఎదురయ్యే ఒత్తిడులు, బాధలు, నుంచి ఉపశమనం పొందడానికి ఆలయాలను ఆశ్రయిస్తుంటారు. కౌన్సెలింగ్ సైకాలజీ దృష్టిలో చూస్తే, వ్యక్తి తన బాధలను వ్యక్తపరచడం, తనకంటే ఉన్నతమైన శక్తిపై విశ్వాసం ఉంచడం, ఆశావహ దృక్పథాన్ని పెంపొందించుకోవడం వంటి అంశాలు మానసిక ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. ఆలయాల్లోని ప్రశాంత వాతావరణం, ప్రార్థన, ధ్యానం, భజనలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు మనసును స్థిమిత పరచడంలో సానుకూల ప్రభావం చూపుతాయి. అనేక శాస్త్రీయ అధ్యయనాలు ధ్యానం, ప్రార్థన వంటి ఆధ్యాత్మిక సాధనలు ఒత్తిడి హార్మోన్ కార్టిసోల్ స్థాయిని తగ్గించడంలో, ఆందోళనను నియంత్రించడంలో, భావోద్వేగ సమతుల్యతను పెంపొందించడంలో తోడ్పడతాయని సూచిస్తున్నాయి.



ప్రశాంతమైన వాతావరణంలో కొంత సమయం గడపడం వల్ల గుండె స్పందన, రక్తపోటు వంటి శారీరక సూచికలపై కూడా అనుకూల ప్రభావం కనిపించవచ్చు. ఆలయానికి వచ్చిన వ్యక్తి తన బాధలో తాను ఒంటరివాడిని కాదనే భావనను పొందుతాడు. తనలాంటి సమస్యలతో వచ్చిన మరెందరో భక్తులను చూడటం ద్వారా ఆశ, ధైర్యం పెరుగుతాయి. దీనినే సైకాలజీలో సామాజిక మద్దతు ప్రభావంగా పేర్కొంటారు. అయితే, డిప్రెషన్, తీవ్రమైన ఆందోళన, బైపోలార్ డిజార్డర్, స్కిజోఫ్రేనియా వంటి మానసిక రుగ్మతలకు కేవలం పూజలు లేదా ఆధ్యాత్మిక కార్యక్రమాలు మాత్రమే సరిపోవు. ఇటువంటి పరిస్థితుల్లో సైకాలజిస్టు ద్వారా కౌన్సెలింగ్, అవసరమైతే సైకియాట్రిస్ట్ ద్వారా వైద్య చికిత్స తప్పనిసరి. ఆలయాలు, పూజలు వాటికి ప్రత్యామ్నాయం కావు. మీ అక్క ప్రస్తుతం మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. శివాలయానికి వెళ్లడం వల్ల ఆమెకు ప్రశాంతత, ధైర్యం లభిస్తే దాన్ని నిరుత్సాహపరచాల్సిన అవసరం లేదు. అయితే ఆకలి లేకపోవడం, నిద్రలేమి, నిరంతర దిగులు, చిరాకు వంటి లక్షణాలు కొనసాగితే సున్నితంగా ఆమెను సైకాలజిస్టు వద్ద కౌన్సెలింగ్‌కు తీసుకెళ్లండి. అవసరమైతే సైకియాట్రిస్ట్‌ను కూడా సంప్రదించాలి. ఆధ్యాత్మికత, కౌన్సెలింగ్, వైద్య చికిత్స పరస్పర విరుద్ధమైనవి కావు. అవసరాన్ని బట్టి ఈ మూడు కలిసి పనిచేస్తే వ్యక్తి మరింత మెరుగైన మానసిక ఆరోగ్యాన్ని పొందగలరు. □

# దత్తాత్రేయుడు

దత్తాత్రేయుని రూపం అపురూపమైంది. అది సచ్చిదానంద రూపం. జడలు కట్టడం, పులిచర్మాన్ని ధరించటం వైరాగ్యం, తపస్సు, ధ్యానాలకు గుర్తు, భూమాతకు, ధర్మానికి ప్రతీక అయిన గోవు ఆయనను వెన్నంటే ఉంటుంది. అటే దత్తాత్రేయుడు ధర్మరక్షకుడని, గోరక్షకుడని తేటతెల్లమవుతుంది. వారి వెంట ఉండే నాలుగు శునాకాలు చతర్వేదాలకు నిదర్శనం. అలాగే స్వామి భస్మధారణ నిరాడంబరత్వానికి, అక్షమాల జప ప్రాధాన్యానికి చిహ్నాలు. అందుకే ఆ దివ్యమూర్తిని మన మహర్షులు, భక్తులు. సకల ధర్మాలూ అడుగంటిపోయి, ఏం చేయాలో తెలియని అయోమయ స్థితి ఆవరించిన కలి యుగంలో దత్తాత్రేయుని ఆశ్రయించి శరణు వేడటమే కర్తవ్యమని గ్రహిస్తారు.



పురాణ కథను అనుసరించి ఒకసారి చతుర్ముఖ బ్రహ్మ వేదాలను మర్చిపోతే దత్తాత్రేయుడే ఆయనకు వేదదానం చేశాడు. మరొకప్పుడు జంభాసురుడనే రాక్షసుడి బాధ నుంచి దేవతలను ఆ స్వామే రక్షించాడు. కార్త వీర్యార్జునుడు దత్తుడి కోసం తపస్సు చేసి వెయ్యి చేతులు, నిత్యయౌవనం వరాలుగా పొందాడు. అదే విధంగా ప్రహ్లాదుడికి ముని రూపంలో ప్రత్యక్షమై ఆత్మజ్ఞానాన్ని బోధించాడు. ఇలా అనంత కరుణా సముద్రడై భక్తులకు జ్ఞానం, ఆనందం ప్రసాదించిందే దత్తాత్రేయ అవతారం. అందుకే అన్నమయ్య కూడా తిరుమల కొండపై ఏడుకొండల స్వామిలో దత్తాత్రేయుని దర్శించుకుని కీర్తనలతో స్తుతించాడు. దత్తాత్రేయుని రెండో అవతారం శ్రీనరసింహ సరస్వతి. అంబ అనే భక్తురాలికి కుమారుడిగా ఆవిర్భవించిన రూపమిది. ఆ మహాను భావుడి మూడో అవతారం మాణిక్‌ప్రభు. దత్తుడి మరో రెండు అవతారాలు అక్కల్‌కోట మహారాజు, శిరిడీ సాయిబాబా. ఈ రెండు అవతారాల నుంచే దత్తావతారులు అవధూత మార్గాన్ని అనుసరించటం ఆరంభ మైంది. అవధూత అంటే శరీరం మీద ఆచ్ఛాదనతో సహా లౌకిక బంధాలన్నీ వదిలిన సన్యాసి. అందుకే వీరి తల్లి దండ్రుల వివరాలు, పుట్టిన తేదీ, ప్రదేశం తదితర వివరాలు అలభ్యం. ఇది దత్తాత్రేయస్వామి అవతార లీల. □

# 'అరటి' కాయ కబాబ్

**కావలసిన పదార్థాలు**
అరటికాయ: ఒకటి, శనగపప్పు: అరకప్పు, చాట్ మసాలా: చిటికెడు, ఆమ్‌చూర్: చిటికెడు, కొత్తిమీర: కొద్దిగా, ధనియాల పొడి: అర టీస్పూన్, జీలకర్ర పొడి: అర టీస్పూన్, గరం మసాలా: పావు టీస్పూన్, కారం: పావు టీస్పూన్, నూనె: వేయించడానికి సరిపడా, ఉప్పు: తగినంత

**తయారీ విధానం:** ముందుగా, అరటికాయను ఉడికించి తొక్క తీసి, ఒక గిన్నెలో వేసి చేత్తో మెదిపి ఉంచాలి. ఉడికించిన శనగపప్పును కూడా మెత్తగా మెదిపి అందులో వేయాలి. సన్నగా తరిగిన కొత్తిమీర, చాట్ మసాలా, ఆమ్‌చూర్, గరం మసాలా, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం తో చిన్న చిన్న ఉండలు చేసుకుని.. పొడవుగా కానీ, వెడల్పుగా కానీ వత్తుకుని వేడి నూనెలో వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించుకుంటే అరటికాయ కబాబ్ రెడీ. వీటిని టమాటా సాస్, పుదీనా చట్నీతో సర్వ్ చేసుకోవాలి. □



# 'అటామిక్ అలవాట్లు'



కోపం తెచ్చుకోకుండా ఉండేం దుకు ప్రయత్నించాలి. ఇలా చెప్పుకంటూ పోవాలే కానీ ఎన్నెన్ని అలవాట్లు మన జీవనశైలిలో భాగం చేసుకోవాలని ఆలోచిస్తామో.. వీటిల్లో మొదలు పెట్టకుండా వదిలేసేవి కొన్నైతే.. ఒకటి రెండు రోజులు చేసి వదిలేసేవి మరికొన్ని. మీరే కాదు దాదాపు సగానికి పైగా మహిళలు, అమ్మాయిల పరిస్థితి ఇదే. దీనికి పరిష్కారంగానే 'అటామిక్ అలవాట్ల' పద్ధతిని ఫాలో అవుతాం అంటున్నారు ఈ తరం అమ్మాయిలు. అంటే, పరమాణువులు ఎంత చిన్నగా ఉంటాయో, మనం ప్రయత్నించే అలవాట్లు కూడా అంతే చిన్నగా ఉండాలనేదే దీని ఉద్దేశం. ఉదాహరణకు వాకింగ్ రోజులో ఒక్కసారైనా వాకింగ్ చేయాలి, నిద్రపోయే ముందు పుస్తకం చదవాలి. ప్రశాంతంగా వంట చేయాలి. చేయాలన్నదే మీ లక్ష్యం అయితే.. 10-15 నిమిషాల పాటు, కనీం వారం రోజులైనా చేయాలి. క్రమేణా అదో అలవాటుగా మారి, నడక మీ జీవితంలో భాగంగా మారుతుంది. అలానే పుస్తకం చదవాలి అనుకుంటే కనీసం 1 లేదా 2 పేజీల్ని చదవడం లక్ష్యంగా పెట్టుకోవాలి. ఇలానే ప్రతిదీ చిన్నగా మొదలుపెడితే క్రమేణా పెద్ద పెద్ద మార్పులూ, మంచి అలవాట్లూ మీ జీవితంలో భాగం అవుతాయి. ప్రయత్నించి చూడండి మరి! □

# 'జననాయగన్' 23న విడుదల



కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ నటిస్తున్న ఆఖరి చిత్రం (కెవిఎన్ 69) విడుదల తేదీ ఎట్టకేలకు అధికారికంగా ఖరారైంది. ఎన్నో వాయిదాలు, సెన్సార్ వివాదాల తర్వాత ఈ చిత్రానికి జననాయగన్ (తెలుగులో జననాయకుడు, హిందీలో జన్ నేత) అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ ఈ నెల 23న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ KVN ప్రొడక్షన్స్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. విజయ్ రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో ప్రవేశించి, సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వస్తున్న చివరి సినిమా కావడంతో దీనిపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. హెచ్. వినోద్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో విజయ్ సరసన పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుండగా, బాబీ డియోల్, మమితా బైజు, ప్రకాష్ రాజ్, ప్రియమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సెన్సార్ బోర్డ్ ఇప్పటికే A' సర్టిఫికేట్ జారీ చేసింది. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో జులై 23న విడుదల కాబోతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో విజయ్ సరసన పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుండగా, బాబీ డియోల్, మమితా బైజు, ప్రకాష్ రాజ్, ప్రియమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## తెర

# 'వదలా' ప్రీ రిలీజ్ ఈవెంట్

ప్రేక్షకులు మా చిత్రాన్ని వదలకుండా చూసి ఎంకరేజ్ చేస్తారని ఆశిస్తున్నాను 'వదలా' పీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో జగపతి బాబు.. చరిత చిత్ర బ్యానర్ మీద కిషోర్ నాయుడు చిరు మామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'వదలా' జగపతి బాబు, లయ, హృతిక శ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో ఆకెళ్ల వి కృష్ణ ఈ సినిమాని తెరకెక్కించారు. ఈ మూవీని జూలై 17న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో మంగళవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ..అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. .. తెలుగు ఇండస్ట్రీలోకి నిర్మాతగా వస్తున్న కిషోర్‌కి థాంక్స్. 'వదలా' చిత్రంతో నిర్మాత కిషోర్‌కి మంచి విజయం దక్కాలి. తమ్మారెడ్డి, జగపతి బాబు గారి మీదున్న ప్రేమ, గౌరవంతో ఇక్కడకు వచ్చాను. 'వదలా' ట్రైలర్ నాకు చాలా నచ్చింది. కాన్సెప్ట్, కథ చాలా కొత్తగా అనిపించింది. పాటలు నాకు చాలా నచ్చాయి. జగపతిబాబు మాట్లాడుతూ.. 'వదలా' లాంటి థ్రిల్లర్ మూవీని చేయడం ఆనందంగా ఉంది. ఇదొక ఫ్యామిలీ ఎమోషనల్ థ్రిల్లర్. ఈ మూవీలో విషయం ఉంది, కంటెంట్ ఉంది అని నమ్మాను. అందుకే ప్రతీ విషయంలో నేను జాగ్రత్తగా తీసుకున్నాను. ఈ 'వదలా' చిత్రాన్ని వదలకుండా నాకోసం చూడండి. నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్‌మాట్లాడుతూ.. సినిమా ఇండస్ట్రీలోకి వచ్చి యాభై ఏళ్లు అవుతోంది. ఓ పదేళ్ల క్రితం వైరాగ్యంతో సినీ సన్యాసం తీస ుకుంటే.. కిశోర్ మాత్రం 'వదలా'అనే సినిమా నిర్మించాల్సిందే అని పట్టుపట్టారు. అని అన్నారు. నిర్మాత కిషోర్ నాయుడు చిరుమామిళ్ల మాట్లాడుతూ.. మా 'వదలా' ఈవెంట్‌కు వచ్చిన అనిల్ రావిపూడికి థాంక్స్. తమ్మారెడి వల్లే నేను నిర్మాతగా నిలబడగలిగాను. ప్రతీ రోజూ సెట్‌లో 150 మందికి భోజనం పెట్టాను. అదే నాకు అదృష్టం. జగపతిబాబు , లయ, చోటా, దర్శకుడు వంశీ, వంశీశేఖర్‌ల ఆత్మీయత నాకెంతో నచ్చింది.



# 'రాజా ది రాజా' ఆడియన్స్ ఎంజాయ్ చేస్తా: రుత్విక్



రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా నటించిన రాజా ది రాజా చిత్రం థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. అనిల్ బోయిడపు దర్శకత్వంలో రూపొందిన ఈ పీరియాడిక్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్, ప్రేమ, వినోదం, యూత్‌కు సంబంధి చిన భావోద్వేగాల కలయికతో ఆకట్టుకోనుంది. .

**మీ తొలి సినిమా విడుదలకు వస్తోంది. ఎలా అనిపిస్తోంది?**

చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. అదే సమయంలో కొంచెం టెన్షన్ కూడా ఉంది. ఈ రోజు కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నాను. ఈ ప్రయాణంలో దాదాపు ప్రతి విభాగం నుంచి ఎంతో నేర్చుకున్నాను. పూర్తిగా మొదటి నుంచి ప్రారంభించాను.

**యాక్టర్ కావడానికి మీరు చేసిన గ్రౌండ్ వర్క్ ఏమిటి?**

చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తి ఉంది. స్కూల్‌లో, నాటకాల ప్రదర్శనల్లో పాల్గొనేవాడిని. షేక్స్పియర్ నాటకంలో డ్యూక్ పాత్ర కూడా చేశాను. అమెరికాలో ఫిల్మ్ కోర్స్ చదివాను. అలాగే కొన్ని షార్ట్ ఫిల్మ్స్ కూడా చేశాను. నేను చేసిన ఒక షార్ట్ ఫిల్మ్‌లో డ్యూయల్ రోల్ చేశాను.

**ఈ సినిమా చేయడానికి ముందు ఎన్ని కథలు విన్నారు?**

దాదాపు ఏడు కథలు విన్నాను. అందులో ఖిమార్షల్ ఆర్ట్స్ నేపథ్యంలో ఒక కథ వుంది. నిజానికి దాంతోనే హీరోగా పరిచయం కావాలనుకున్నాను. దాని కోసం ఏడు నెలలు ప్రిపరేషన్ కూడా చేశాను.

**తొలి సినిమాకే రెండు గెటప్స్ చేయడం ఎలా అనిపించింది?**

నాకు ఎప్పుడూ ఛాలెంజింగ్ పాత్రలు చేయడమే ఇష్టం. ఈ సినిమాలోని రెండు గెటప్స్ కోసం పూర్తిగా ప్రిపేర్ అయ్యాను. కాస్ట్యూమ్స్ కూడా స్వయంగా చూసుకున్నాను.

**సాయికుమార్ , నరేష్‌తో కలిసి నటించడం ఎలా అనిపించింది?**

నరేష్ గారు నా తండ్రి పాత్రలో కనిపిస్తారు. ఆయనతో నటించడం చాలా ఎంజాయ్ చేశాను. ఆయన నన్ను ఎంతో ప్రోత్సహించారు. సెట్స్‌లో చాలా సరదాగా ఉంటారు.

**డైరెక్టర్ అనిల్ బోయిడపు గురించి?**


తనకి సినిమా అంటే చాలా పాషన్. పలు సూపర్ హిట్ సినిమాలకు ఆయన అసోసియేట్‌గా పని చేశారు. చాలా క్లారిటీ వున్న డైరెక్టర్. చాలా మంచి డైరెక్టర్ అవుతారు.

# 'కరుణామయ' చిత్రం ప్రారంభం




చైతన్య శక్తి, స్వాతి శ్రీ జంటగా బాబీ పిక్చర్స్ మీద ప్రొడక్షన్ నెంబర్. 1గా సంకా బత్తుల నాగేశ్వరరావు నిర్మించనున్న చిత్రం 'కరుణామయ' ప్రముఖ దర్శకులు వి.వి. వినాయక్, వి.ఎన్ ఆదిత్యల చేతుల మీదుగా ఘనంగా ప్రారంభంబాబీ పిక్చర్స్ మీద ప్రొడక్షన్ నెంబర్.1గా సంకాబత్తుల నాగేశ్వరరావు నిర్మించనున్న చిత్రం 'కరుణామయ' చైతన్య శక్తి, స్వాతి శ్రీ జంటగా రాబోతోన్న ఈ సినిమాకి హర్షవర్ధన్ పారెళ్ళ దర్శకత్వం వహించనున్నారు. ఆరాధ్య హైందవి సమర్పణలో ఫ్యామిలీ ఎమోషన్స్‌తో తెరకెక్కనున్న ఈ మూవీని ఈ ఏడాది డిసెంబర్ 23న విడుదల చేయనున్నారు. నిర్మాతసంకాబత్తుల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. క్రిస్మస్ సందర్భంగా మా సినిమాని ఈ ఏడాది డిసెంబర్ 23న రిలీజ్ చేయాలని అనుకుంటున్నాం. మాకు సహకరిస్తున్న ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా కోసం వచ్చిన వి.వి.వినాయక్‌కి, వి ఆదిత్యకి ధన్యవాదాలు అని అన్నారు. దర్శకుడు హర్షవర్ధన్ పారెళ్ళ మాట్లాడుతూ ..కుటుంబ కథా చిత్రంగా మా 'కరుణామయ' తెరకెక్కబోతోంది. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన మా నిర్మాత నాగేశ్వరరావుకి థాంక్స్. హీరో చైతన్య శక్తి మాట్లాడుతూ .. 'కరుణామయ'చిత్రంలో నేను హీరోగా పని చేస్తున్నాను. ఇంత మంచి కథలో నాకు అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. మా మూవీని హిట్ చేస్తారని ఆశిస్తున్నామని అన్నారు. హీరోయిన్ స్వాతి శ్రీ మాట్లాడుతూ .. 'కరుణామయ' సినిమాలో నేను హీరోయిన్‌గా చేస్తున్నాను. నాకు అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్.

# 'ఆపరేషన్ అరుణారెడ్డి' ప్రీ రిలీజ్ ఈవెంట్



ఈ నెల 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న మూవీ..ప్రముఖ రచయిత, నటుడు పోసాని కృష్ణమురళి నిర్మిస్తూ, దర్శకత్వం వహిస్తూ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'ఆపరేషన్ అరుణారెడ్డి' ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, మాటలు, పాటలు, ఎడిటింగ్ బాధ్యతలు కూడా పోసాని కృష్ణమురళి వహిస్తుండటం విశేషం. హిందోళ చక్రవర్తి, కాజల్ శర్మ, ఆయేషా ఖాన్, బీజేపీ నేత రఘునందన్ రావు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నెల 17న 'ఆపరేషన్ అరుణారెడ్డి' సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ లో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ మహదేవ్ ఏలేందర్ మాట్లాడుతూ ఈ చిత్రాన్ని పోసాని ఎంతో ప్లానింగ్‌తో రూపొందించారు. . కథ విన్నప్పుడే ఈ సినిమా తప్పకుండా హిట్ అవుతుందని అనిపించింది. డీవోపీ సుధాకర్ మాట్లాడుతూ ఇందాక మా మ్యూజిక్ డైరెక్టర్ చెప్పినట్లు 'ఆపరేషన్ అరుణారెడ్డి' సినిమా పోసానికి 2.ఓ అవుతుంది. ఈ సినిమాకు వర్క్ చేసేప్పుడు పోసానిదగ్గర ఎంతో నేర్చుకున్నాను. హీరోయిన్ హిందోళ చక్రవర్తి మాట్లాడుతూ 'ఆపరేషన్ అరుణారెడ్డి' సినిమాలో ప్రధాన పాత్రలో నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. సెకండ్ లీడ్ రోల్ కాజల్‌శర్మ మాట్లాడుతూ 'ఆపరేషన్ అరుణారెడ్డి' సినిమాలో అరుణారెడ్డి స్నేహితురాలి పాత్రలో నటించాను. ఈ సినిమా ఈ నెల 17న రిలీజ్ కు వస్తోంది.

# 'చెన్నై లవ్ స్టోరీ' గ్రాండ్ ప్రెస్ మీట్



హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా కలర్ ఫొటో, ,బేబి వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొంద ుతున్న సినిమా 'చెన్నై లవ్ స్టోరీ' ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాకు బ్లాక్ బస్టర్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ నెల 24న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు నటి సిరి హన్మంతు మాట్లాడుతూ 'చెన్నై లవ్ స్టోరీ' మూవీలో నటించే అవకాశం దక్కడం హ్యాపీగా ఉంది. ఈ నెల 24న మీరంతా మా సినిమాతో ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీ చూడబోతున్నారు. హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ ఈరోజు బర్త్ డే జరుపుకుంటున్న కిరణ్ గారికి హ్యాపీ బర్త్ చెబుతున్నా. మా మూవీ నుంచి గ్లింప్స్ రిలీజ్ చేసి ఏడాది అవుతోంది. ఇప్పటిదాకా మీరు ఆ గ్లింప్స్ ఎంజాయ్ చేస్తూనే ఉన్నారు. కో ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ ప్రేమ అనే పదం ఒక్కో టైమ్ లో ఒక్కోలా వినిపిస్తుంటుంది. ఇప్పుడు నాకు ప్రేమ అంటే చెన్నై లవ్ స్టోరీనే. మరో నెల రోజుల వరకు ఈ సినిమానే నా ప్రేమ. అన్నారు డైరెక్టర్ రవి నంబూరి మాట్లాడుతూ మా సినిమాలో నివి, స్టీవెన్ శంకర్ క్యారెక్టర్స్ మధ్య అందమైన సంభాషణలు ఉంటాయి. ఈ రెండు పాత్రలకు టైమ్ తీసుకుని టమంచి డైలాగ్స్ రాశాం. ఆ స్వేచ్ఛను మా ప్రొడ్యూసర్స్ ఇచ్చారు.



ఫిఫా ప్రపంచకప్‌లో రెండోసారి ఫైనల్ చేరిన ఆనందంలో స్పెయిన్‌ఆటగాళ్లు

# ఫ్రాన్స్‌కు షాక్ : ఫైనల్లో స్పెయిన్

**టెక్సాస్, జులై 15:** సాకర్ వరల్డ్ కప్‌లో యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. డల్లాస్‌లో జరిగిన జరిగిన తొలి సెమీఫైనల్లో 2-0గోల్స్ తేడాతోఫ్రాన్స్‌ను ఓడించింది. ఈసారైనా కప్ సాధించాలన్న గత రన్నరప్ ఫ్రాన్స్ ఆశలపై నీళ్లు చల్లింది. ఫుట్‌బాల్ చరిత్రలో రెండోసారి ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్‌కు అర్హత సాధించింది. 2010లో మొదటిసారి ఫైనల్ చేరిన స్పెయిన్, అప్పట్లో నెదర్లాండ్స్‌ను ఓడించి విశ్వవిజేతగా నిలిచింది.

### దుర్భేధ్యమైన డిఫెన్స్

మ్యాచ్ ప్రారంభం లో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగి ఫ్రాన్ జట్టు... స్పెయిన్ పటిష్టమైన డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది. కిలియన్ ఎంబాపె, మైఖేల్ ఒలిసే, డెంబెలేలతో కూడిన బలమైన ఫ్రాన్స్ అటాకింగ్ త్రయాన్ని స్పెయిన్ డిఫెండర్లు సమర్థవంతంగా కట్టడిచేశాయి.

### పెనాల్టీ గోల్

తొలిఅర్ధభాగం 22వ నిమిషంలో స్పెయిన్ యువ సంచలనం లామిన్ యమల్‌ను ఫ్రాన్స్ డిఫెండర్ లూకాస్ దిగ్నే బాక్స్ లోపల ప్రమాదకర రీతిలో కిందపడేయడంతో స్పెయిన్‌కు పెనాల్టీ లభించింది. దీన్ని స్టార్ ఫార్వర్డ్ మికెల్ ఓయార్జబాల్ గోల్‌గా మలిచి స్పెయిన్‌కు 10 ఆధిక్యం లభించింది. ఇక ద్వితీయార్థం కొద్దిసేపటికే 58వ నిమిషంలో స్పెయిన్ మిడ్‌ఫీల్డర్ డాని ఓల్మో అందించిన అద్భుతమైన పాస్‌ను ఫుల్ బ్యాక్ ఆటగాడు పెడ్రో పోర్రో గోల్‌గా మలిచాడు. స్పెయిన్‌కు రెండో గోల్ అందించాడు.

### విఫలమైన ఫ్రాన్స్ వ్యూహాలు

మ్యాచ్ మధ్యలో ఫ్రాన్స్ జట్టుకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన డిఫెండర్ విలియం సాలిబా గాయంతో మైదానం వీడాడు. ఫ్రాన్స్ జట్టును గట్టెక్కించడానికి హెడ్ కోచ్ డిడియర్ డెషాంప్స్ వ్యూహాత్మక మార్పులు చేశారు. అడ్రియన్ రాబియోట్ స్థానంలో మను కోనేను, బ్రాడ్లీ బార్కోలా స్థానంలో డెసిరె డౌను, అలాగే రాయన్ చెర్కిలను మైదానంలోకి దించినప్పటికీ ఫలితం లేకపోయింది. స్పెయిన్ గోల్‌కీపర్ ఉనై సిమన్ చేసిన అద్భుతమైన సేవ్స్, డిఫెండర్ మార్క్ కుకురెల్లా టాకిల్స్ ఫ్రాన్స్ ఆశలపై నీళ్లు చల్లాయి.

### ఓయార్జబాల్ అరుదైన రికార్డు

ఓయార్జబాల్ తన ఫామ్‌ను మరోసారి చాటుకున్నాడు. స్పెయిన్ తరపున గత20 మ్యాచ్‌ల్లో ఇది అతనికి 18వ గోల్. ఈ గోల్‌తో అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో స్పెయిన్ తరపున 30గోల్స్ మార్కు అందుకున్న ఆరో ఆటగాడిగా రికార్డు సృష్టించాడు.ఈ జాబితాలో డేవిడ్ విల్లా (59), రావుల్ (44), ఫెర్నాండో టోరెస్ (38), అల్వారో మొరాటా (37), డేవిడ్ సిల్వా (35) వంటి దిగ్గజాల సరసన చేరాడు. ఈ విజయంతో స్పెయిన్ జట్టు అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో వరుసగా 37 మ్యాచ్‌లు ఓటమి లేకుండా గెలుస్తూ వస్తోంది. దీంతో ఇటలీ పేరిట ఉన్న చారిత్రాత్మక రికార్డును సమం చేసింది. అలాగే ఫ్రాన్స్‌పై వరుసగా ఇది స్పెయిన్‌కు మూడో విజయం.స్పెయిన్ జట్టు ఈనెల 19న న్యూజెర్సీ స్టేడియంలో జరగబోయే ఫైనల్లో కప్ కోసం ఆడనుంది.

### ఇది మా స్థాయి ఆటకాదు: ఎంబాపె

సెమీఫైనల్లో ఫ్రాన్స్ ఆటతీరుపై ఆ జట్టు స్టార్ ఆటగాడు క్లియాన్ ఎంబాపె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇది తమ స్థాయి ఆట కాదని, అనుకున్నట్లుగా ఆడలేకపోయామన్నాడు. వ్యూహాలు, సాంకేతికంగానూ ఘోరంగా విఫలమయ్యామని వాపోయాడు. మిడ్‌ఫీల్డ్‌లో 3 ఆన్ 2వ్యూహంతో బరిలోకి దిగినా. అయితే, ఆటగాళ్ల మధ్య సమన్వయలోపంతో అనుకున్న ఫలితం సాధించలేకపోయినట్లు వెల్లడించాడు. స్టారర్ ఎంబాపె కూడా ఈ మ్యాచ్‌లో గోల్ చేయలేకపోయాడు.

## జపాన్ ఓపెన్‌లో పివి సింధుపైనే ఆశలు

# తొలి రౌండ్‌లోనే లక్ష్య, ఆయుష్, ఉన్నతి ఔట్

**టోక్యో, జూన్ 15:** జపాన్ ఓపెన్‌లో రెండో రోజు భారత్‌కు నిరాశాజనకంగా నిలిచింది. భారత షటర్లు లక్ష్య సేన్, ఆయుష్ శెట్టి, ఉన్నతి హుడా తొలి రౌండ్ ఓటమితో ఇంటిదారి పట్టారు. లక్ష్యసేన్ వరుస గేమ్‌ల్లో ఓడగా, యువ షట్లర్లు ఆయుష్ శెట్టి, ఉన్నతి హుడా పోరాటపటిమను ప్రదర్శించినప్పటికీ చివరికి ఓటమి పాలయ్యారు. ఆసియా ఛాంపియన్‌షిప్స్ ఫైనలిస్ట్ ఆయుష్ మూడు గేమ్ల పోరులో థాయిలాండ్‌కు చెందిన రెండో సీడ్ కున్‌లావుత్ చేతిలో 19-21, 25-23, 15-21తో పరాజయం పొందాడు. ఈ పోరు ఏకంగా 82 నిమిషాలపాటు ఉత్కంఠగా కొనసాగింది. ఇక రెండుసార్లు ఒడిశా ఓపెన్ సూపర్ 100 ఛాంపియన్ ఉన్నతి 21-16, 16-21, 15-21 తేడాతో మరోసారి చైనీస్ తైపీ షట్లర్ హువాంగ్ యుహసున్ చేతిలో ఓడింది.

ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్స్‌లో రన్నరప్‌గా నిలిచిన లక్ష్యసేన్... స్థానిక ఫేవరెట్ కోకి వతనాబే ముందు నిలవలేకపోయాడు. కేవలం 38 నిమిషాల్లోనే 16-21, 14-21 తేడాతో పరాజయం పొందాడు. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, మిక్స్‌డ్ డబుల్స్ జోడీ ధ్రువ్ కపిల, తనిషా క్రాస్టోలే జోడీ రూపంలో ఈ టోర్నీలో భారత్ సవాల్ మిగిలివుంది. రెండో రౌండ్‌లో సింధు ఐదో సీడ్ చైనా క్రీడాకారిణి హాన్ యూతో తలపడనుండగా... ధ్రువ్, తనిషాలు టాప్ సీడ్స్ ఫెంగ్ యాన్ జె, హువాంగ్ డాంగ్ పింగ్‌లతో పోటీపడతారు.











# గోల్డెన్ బూట్ రేసులో మెస్సీ, ఎంబాపె

**టెక్సాస్, జులై 15:** ఫిఫా ప్రపంచకప్‌లో అత్యధిక గోల్స్ చేసే ఆటగాడికి ఇచ్చే గోల్డెన్ బూట్ రేసు ఆసక్తిగా మారింది. అర్జెంటీనాస్టార్ లియోనెల్ మెస్సీ, ఫ్రాన్స్ స్టార్ ఫార్వర్డ్ ఎంబాపె మధ్య పోరు నెలకొంది. సెమీస్‌లో గోల్ చేయడంలో విఫలమైనా... ఎంబాపె మాత్రం గోల్డెన్ బూట్ రేసులో నిలిచాడు. ప్రస్తుతం 8 గోల్స్, 3 అసిస్ట్స్‌తో అగ్రస్థానంలో ఉన్నాడు. అతడి తర్వాత మెస్సీ (8 గోల్స్, 2 అసిస్ట్స్), ఇర్లింగ్ హాలాండ్ (7గోల్స్)ఉన్నారు.నార్వే ఇంటిముఖం పట్టడంతో ఇర్లింగ్ హాలాండ్ ఛాన్స్ కోల్పోయాడు. మెస్సీ... ఇంగ్లాండ్‌తో సెమీఫైనల్ మ్యాచ్‌లో గోల్ సాధిస్తే గోల్డెన్‌బూట్ రేసులో ముందుకొస్తాడు. అర్జెంటీనా సెమీస్ గెలిచినా, ఓడినా మెస్సీకి మరోమ్యాచ్ ఉంటుంది. ఫ్రాన్స్ మూడో స్థానం మ్యాచ్ నేపథ్యంలో.. ఎంబాపె కూడా గోల్డెన్ బూట్ కోసం పోటీలో ఉన్నట్లే.ఇక ఇంగ్లాండ్ సంచలనాలు హ్యారీ కానే, జూడ్ బెల్లింగ్హామ్ చెరో ఆరేసి గోల్స్‌తో తరువాతి స్థానాల్లో ఉన్నారు. అర్జెంటీనాతో పాటు గెలిస్తే ఫైనల్, లేదంటే థర్డ్ ప్లేస్ మ్యాచ్ రూపంలో రెండు మ్యాచ్‌లు ఉన్నాయి. ఇందులో ఈ ఇద్దరూ మెరుగ్గా గోల్స్ సాధిస్తే మెస్సీ, ఎంబాపెను వెనక్కి నెట్టే అవకాశం ఉంది.

# జోరు మీదున్న టీమిండియా కెప్టెన్ గిల్

## వన్డేల్లో నంబర్ వన్ దిశగా



**దుబాయ్, జులై 15:** టీమిండియా వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ జోరు మీదున్నాడు. అన్ని ఫార్మాట్లలో పరుగుల వరద పారిస్తున్నాడు. ఐపీఎల్ ప్లే ఆఫ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై సెంచరీ (104) సాధించిన శుబ్ మన్ గిల్... ఆఫ్ఘనిస్తాన్‌పై ఏకైక టెస్ట్‌లో 126పరుగులతో అదరగొట్టాడు. ఇక రెండు వన్డేల్లోనూ వరుసగా 84 నాటౌట్, 154 రన్స్ సాధించాడు. ఇక ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి వన్డేలోనూ 80నాటౌట్‌తో నిలిచి జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు. మొత్తంగా బ్యాట్‌కు పనిచెబుతూ శుభ్‌మన్ గిల్ ప్రత్యర్థి బౌలర్ల వెన్నులో వణుకు పుట్టిస్తున్నాడు.

తాజాగా ఐసీసీ విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లోనూ భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రేటింగ్ పాయింట్లు పెంచుకుని ప్రపంచ నంబర్ వన్ స్థానానికి మరింత చేరువయ్యాడు. తొలి వన్డేలో 80 పరుగులు చేసిన గిల్‌కు 12 రేటింగ్ పాయింట్లు లభించాయి. ప్రస్తుతం అతను ప్రపంచ వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

అగ్రస్థానంలో ఉన్న డారిల్ మిచెల్‌ను (814) అధిగమించేందుకు గిల్‌కు (803) ఇంకా 12 రేటింగ్ పాయింట్లు మాత్రమే అవసరం. మరో మంచి ఇన్నింగ్స్ ఆడితే మిచెల్‌ను వెనక్కినెట్టి నెంబర్ వన్ ర్యాంకు సొంతమవుతుంది. తొలి వన్డేలో విఫలమైనప్పటికీ భారత స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లి (3వ స్థానం), రోహిత్ శర్మ (4వ స్థానం) తమ స్థానాలను నిలబెట్టుకున్నారు.

అజేయ అర్ధశతకం సాధించిన వాషింగ్టన్ సుందర్ బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 73వ స్థానానికి చేరుకున్నాడు. అలాగే తొలి వన్డేలో అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన అక్షర్ పటేల్ ఆల్‌రౌండర్ల జాబితాలో టాప్-10లోకి ప్రవేశించాడు. జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 24వ స్థానానికి చేరుకున్నాడు.ఇంగ్లండ్ ఆటగాళ్లకు కూడా మెరుగైన ర్యాంకులు దక్కాయి. ఇంగ్లండ్ తరఫున తొలి వన్డేలో 76 పరుగులు చేసిన జో రూట్ 12వ స్థానానికి చేరుకున్నాడు.

# స్వల్పలాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి,జులై15:**దేశీయ ఈక్విటీ మార్కెట్లు బుధవారం ప్రారంభంలో బలమైన ర్యాలీ నమోదు చేసినప్పటికీ, చివర్లో పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో రోజువారీ గరిష్ఠ స్థాయిల నుంచి లాభాలు తగ్గాయి.ఐబీఎం నిరాశపరిచే భవిష్యత్ మార్గదర్శకాలను ప్రకటించడంతో ఐటీ షేర్లపై అమ్మకాల ఒత్తిడి కనిపించింది. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 86 డాలర్ల సమీపంలో కొనసాగుతుండటంతో ప్రపంచ ఇంధన సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

బీఎస్ఈ సెన్సెక్స్ 130.49 పాయింట్లు పెరిగి 77,185.43వద్ద ముగిసింది.ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 26.45పాయింట్లు లాభపడి 24,078.50 వద్ద స్థిరపడింది.గత మూడు వరుస ట్రేడింగ్ సెషన్లలో నిఫ్టీ 1.38 శాతం, సెన్సెక్స్ 1.45 శాతం మేర నష్టపోయాయి. ఎటర్నల్ -2.80శాతం లాభం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్-0.69శాతం పెరిగితే ఐసీఐసీఐ బ్యాంక్-0.24 శాతం లాభం బీఎస్ ఈ మిడ్‌క్యాప్150 సూచీ 0.55 శాతం, స్మాల్‌క్యాప్250 సూచీ 0.69 శాతం చొప్పున పెరిగాయి.మార్కెట్‌లో మొత్తం 2,297 షేర్లు లాభపడగా, 1,974 షేర్లు నష్టపోయాయి. 178 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. విదేశీ మారకద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలహీనపడింది. రూపాయి విలువ గత ముగింపు 96.1600 తో పోలిస్తే 96.3200 వద్ద ట్రేడైంది.

ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5, 2026 డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ 0.64 శాతం తగ్గి రూ.1,41,301 వద్దకు చేరాయి.సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 89 సెంట్లు (1.05 శాతం) పెరిగి 85.62 డాలర్లకు చేరింది. ఐపీఓలో లిస్టైన కుసుమ్‌గర్‌కు భారీ ప్రీమియంకుసుమ్‌గర్ షేరు బీఎస్ఈలో తొలి ట్రేడింగ్ రోజున ఇష్యూ ధర 419తో పోలిస్తే 44.26 శాతం ప్రీమియంతో రూ.604.45 వద్ద ముగిసింది. ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్ 6.50శాతం ఎగిసింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నికర లాభం 29.57 శాతం పెరిగి రూ.5,332.30 కోట్లకు చేరడంతో షేరు 0.96 శాతం లాభపడింది. బిలియన్ బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్, తొలి త్రైమాసికంలో నికర లాభం త్రైమాసిక ప్రాతిపదికన 7.1 శాతం, వార్షిక ప్రాతిపదికన 94.28 శాతం పెరిగి రూ.735 కోట్లకు చేరడంతో షేరు 6.46 శాతం ఎగిసింది.ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 7.52శాతం లాభపడింది.స్టీల్ స్ట్రిప్స్ వీల్స్ - 5.81 శాతం పెరిగింది. ఆదిత్య బిర్లా మనీ 8.82 శాతం, గోవా కార్బన్ 7.59 శాతం, టాటా ఎఎల్‌సి 4.44 శాతం, డెన్ నెట్‌వర్క్స్ 4.42 శాతం, ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ 4.34 శాతం, బెనారస్ హోటల్స్ 1.05 శాతం నష్టపోయాయి.ఐపిఒల పరంగా ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ఐపీఓకు మంచి స్పందన లభించింది. బుధవారం సాయంత్రం 4.30 గంటల వరకు 12.45 కోట్ల షేర్ల ఆఫర్‌కు 33.44 కోట్ల షేర్లకు బిడ్లు రావడంతో ఈ ఇష్యూ 2.69 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. షేరు ధర రూ.545-574గా నిర్ణయించారు. ఆల్పైన్ టెక్స్‌వర్క్స్ ఐపీఓకు బుధవారం సాయంత్రం వరకు 1.20 కోట్ల షేర్ల ఆఫర్‌కు వ్యతిరేకంగా 94.92 లక్షల షేర్లకు బిడ్లు రావడంతో 0.79 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. ఈ ఐపీఓ కూడా ధరలు ఒక్కో షేరుకు రూ.100-105గా నిర్ణయించారు.



వాణిజ్యం


# అమల్లోకి భారత్ - బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

**న్యూఢిల్లీ,జులై 15:** భారత్‌బ్రిటన్ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం కానుండగా, వివిధ రంగాలపై భిన్నమైన ప్రభావం పడనుంది. భారతీయ ఎగుమతులకు బ్రిటన్ మార్కెట్లో భారీ ప్రోత్సాహం లభించగా, బ్రిటన్‌కు చెందిన పలు ఉత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాలను తగ్గించింది. భారతదేశం నుంచి బ్రిటన్‌కు ఎగుమతి అయ్యే దాదాపు 99 శాతం ఉత్పత్తులకు సుంక రహిత ప్రవేశం లభించనుంది. మరోవైపు బ్రిటన్ నుంచి భారత్‌కు వచ్చే పలు ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించారు.


భారత శ్రామిక ఆధారిత రంగాలకు పెద్ద ఊతంఈ ఒప్పందంతో రెడీమేడ్ దుస్తులు, పాదరక్షలు, కార్పెట్లు, ప్రాసెస్డ్ ఫుడ్, ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, చేపలు, మాంస ఉత్పత్తులు వంటి శ్రామిక ఆధారిత రంగాలకు భారీ ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటివరకు 4 శాతం నుంచి 16 శాతం వరకు ఉన్న బ్రిటన్ దిగుమతి సుంకాలు పూర్తిగా తొలగించబడటంతో ఈ ఉత్పత్తులు ఇకపై సుంకం లేకుండా బ్రిటన్ మార్కెట్లోకి ప్రవేశించనున్నాయి. ఆటోమొబైల్స్, ఆటో విడిభాగాలు, యంత్రాలు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాబ్రికేటెడ్ మెటల్ ఉత్పత్తులు, సిరామిక్స్, గాజు, రాయి, సిమెంట్ ఉత్పత్తుల ఎగుమతులకు కూడా మెరుగైన మార్కెట్ అవకాశాలు లభించనున్నాయి. భారత్‌లో తయారయ్యే ఎలక్ట్రిక్, హైబ్రిడ్, హైడ్రోజన్ ఆధారిత ప్రయాణికుల వాహనాలకు బ్రిటన్ ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది. నిర్ణయించిన కోటా పరిధిలో ఎగుమతి అయ్యే ఈ వాహనాలు ప్రస్తుతం అమల్లో ఉన్న 10 శాతం సుంకం లేకుండా బ్రిటన్‌లోకి ప్రవేశించనున్నాయి. కొన్ని ఉత్పత్తులకు సుంక రాయితీ వర్తించదుతాజా ఆపిల్స్, వాల్‌నట్స్, వే ప్రొడక్ట్స్, బ్లూవెయిన్ చీజ్, ఎంపిక చేసిన విత్తన రకాలు, బంగారు బార్లు, స్మార్ట్‌ఫోన్లు వంటి సున్నితమైన ఉత్పత్తులను భారత్ సుంక రాయితీల నుంచి మినహాయించింది.

స్కాచ్ విస్కీ, బోర్బన్, రమ్, జిన్, వోడ్కా, బ్రాండీ, టెకిలా, సాకే, సైడర్, మీడ్, లిక్కర్స్ వంటి ప్రీమియం మద్యపాన ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు తగ్గింపు ఉంటుంది. స్కాచ్ విస్కీపై ప్రస్తుతం ఉన్న 150 శాతం దిగుమతి సుంకాన్ని దశలవారీగా 40 శాతానికి తగ్గించనున్నారు. ఆటోమొబైల్ రంగంలో నిర్ణీత కోటా మేరకు దిగుమతి అయ్యే వాహనాలపై 100 శాతం సుంకాన్ని 10 శాతానికి తగ్గించనున్నారు. సౌందర్య ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న 22 శాతం వరకు సుంకాలను ఒప్పందం అమలైన తొలి రోజు నుంచే లేదా గరిష్ఠంగా 10 సంవత్సరాల వ్యవధిలో పూర్తిగా తొలగించనున్నట్లు ఇరు దేశాలు వెల్లడించాయి.

## హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ లాభం 611 కోట్లు



**ముంబై,జులై 15:**ప్రైవేట్ జీవిత బీమా సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ తొలిత్రైమాసికంలో నికరలాభం వార్షిక ప్రాతిపదికన 11.5శాతంపెరిగిరూ.611 కోట్లకు చేరుకుంది.గత ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.548 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. కంపెనీ నెట్ ప్రీమియం ఆదాయం కూడా 15.1 శాతం పెరిగి రూ.14,539 కోట్ల నుంచి రూ.16,728 కోట్లకు చేరుకుంది.ఇది బీమా వ్యాపారంలో స్థిరమైన వృద్ధిని ప్రతిబింబిస్తున్నట్లు కంపెనీ తెలిపింది.పాలసీదారుల కొనసాగింపు పరంగా కూడా కంపెనీ మిశ్రమ ఫలితాలను నమోదు చేసింది. 61 నెలల పర్సిస్టెన్సీ నిష్పత్తి గత ఏడాది 61 శాతం నుంచి 65.5 శాతానికి మెరుగుపడగా, 13 నెలల పర్సిస్టెన్సీ నిష్పత్తి మాత్రం 82.7 శాతం నుంచి 80 శాతానికి తగ్గింది.కంపెనీ సాల్వెన్సీ నిష్పత్తి గత ఏడాది 192 శాతం నుంచి ఈసారి 185 శాతానికి తగ్గినప్పటికీ, గత త్రైమాసికంలోని 177 శాతంతో పోలిస్తే గణనీయంగా మెరుగుపడింది. నియంత్రణ సంస్థ నిర్దేశించిన కనిష్ఠ స్థాయికంటే ఇది ఎంతో ఎక్కువగా ఉందని కంపెనీ పేర్కొంది. దేశ ఆర్థిక పరిస్థితులు తమ వ్యాపారానికి అనుకూలంగా ఉన్నాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లాభదాయకమైన కస్టమర్ సమీకరణ పైనే ప్రధాన దృష్టి సారిస్తామని కంపెనీ స్పష్టం చేసింది.వాల్యూ ఆఫ్ న్యూ బిజినెస్ మార్జిన్లు వచ్చే కొన్ని త్రైమాసికాల్లో ప్రస్తుత స్థాయిలోనే కొనసాగే అవకాశం ఉందని యాజమాన్యం తెలిపింది. అయితే వ్యాపార పరిమాణం పెరగడం, ఉత్పత్తుల మిశ్రమంలో మార్పులు చోటుచేసుకోవడం వల్ల దీర్ఘకాలంలో మార్జిన్లు మెరుగుపడతాయని పేర్కొంది.202627 ఆర్థిక సంవత్సరంలో మార్జిన్ల కంటే వ్యాపార విస్తరణకే అధిక ప్రాధాన్యం ఇస్తామని కంపెనీ వెల్లడించింది. నికరలాభం రూ.548 కోట్ల నుంచి 611 కోట్లకు పెరిగితే నెట్ ప్రీమియం ఆదాయం రూ.14,539 కోట్ల నుంచి రూ.16,728 కోట్లకు చేరింది.



## సెబీ బోర్డు సభ్యులకు కఠిన నియమావళి

**ముంబయి,జులై 15:** మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) తన బోర్డు సభ్యుల కోసం సమగ్ర ప్రవర్తనా నియమావళిని ఆమోదించింది. ఈ కొత్త నియమావళిలో ప్రయోజనాల సంఘర్షణ (కాన్ఫ్లిక్ట్ ఆఫ్ ఇంటరెస్ట్) నివారణకు కఠిన నిబంధనలు, పూర్తిస్థాయి సభ్యుల ప్రత్యక్షషేర్ పెట్టుబడులపై ఆంక్షలు, ఆస్తులు-బాధ్యతల వెల్లడిపై మరింత పారదర్శకత, పదవీ విరమణ అనంతర పరిమితులు వంటి అంశాలను చేర్చింది. మార్కెట్ నియంత్రణ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని సెబీ తెలిపింది. కొత్త నిబంధనల ప్రకారం సెబీ చైర్‌పర్సన్‌తో పాటు హోల్ టైమ్ సభ్యులు తమ పదవీకాలంలో వ్యక్తిగత ఈక్విటీ షేర్లు, ఈక్విటీగా మారే ఆర్థిక సాధనాలు, ఈక్విటీ మరియు కమోడిటీ డెరివేటివ్‌లలో కొత్త పెట్టుబడులు పెట్టేందుకు అనుమతి ఉండదు.అయితే మ్యూచువల్ ఫండ్లు, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు,ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు వంటి నిపుణుల నిర్వహణలో ఉండే సమిష్టి పెట్టుబడి సాధనాల్లో మాత్రం పెట్టుబడులు కొనసాగించవచ్చు. బోర్డులో చేరే సమయానికి ఇప్పటికే నిషేధిత పెట్టుబడులు కలిగి ఉన్న హోల్‌టైమ్ సభ్యులు వాటిని విక్రయించడం, పదవీకాలం ముగిసే వరకు నిలిపివేయడం (ఫ్రీజ్ చేయడం) లేదా సెబీ ఆమోదించిన విధానంలో వాటిని బదిలీ చేయడం తప్పనిసరి. అలాగే ఫ్రీజ్ చేసిన ఈక్విటీ పెట్టుబడులకు సంబంధించిన ఓటింగ్ హక్కులను వినియోగించుకునే అవకాశం కూడా ఉండదు.

కొత్త కోడ్ ప్రకారం బోర్డు సభ్యులు తమ కుటుంబ సంబంధాలు, ఆర్థిక పెట్టుబడులు, అప్పులు, స్థిరాస్తులు, వృత్తిపరమైన ప్రయోజనాలు, అద్దె ఒప్పందాలు తదితర వివరాలను సమగ్రంగా వెల్లడించాల్సి ఉంటుంది.

## స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో హెచ్‌పిసిఎల్ సిలిండర్లు



**ముంబయి,జులై 15:** క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, హెచ్‌పిసిఎల్‌తో జతకట్టి దేశంలోనే మొదటిసారిగా క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా నిత్యావసర ఎల్‌పీజీ గ్యాస్‌సిలిండర్లను ఆర్డర్ చేసిన నిమిషాల్లోనే డెలివరీ చేసే సేవలను బుధవారం ప్రారంభించింది. ప్రస్తుతం తొలి దశలో భాగంగా ఈ సేవలను కర్ణాటక రాజధాని బెంగళూరులో పైలట్ ప్రాజెక్ట్‌గా అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవడానికి ఉండే నిబంధనలవలే కాకుండా, ఈ యాప్ ద్వారా ఆర్డర్ చేయడానికి వినియోగదారులకు ముందస్తుగా ఎలాంటి డొమెస్టిక్ గ్యాస్ కనెక్షన్ ఉండాల్సిన అవసరం లేదు. ఈటైఅప్‌లో భాగంగా హెచ్‌పీసీఎల్ తన సరికొత్త 10 కిలోల హెచ్‌పీ నవ్య కాంపోజిట్ సిలిండర్లను వాణిజ్యపరంగా మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఈ సిలిండర్ల ప్రత్యేకత ఏంటంటే, ఇవి పారదర్శకంగా (ట్రాన్స్‌లూసెంట్) ఉండి, సిలిండర్‌లో ఎంత గ్యాస్ మిగిలి ఉందో బయటి నుంచే స్పష్టంగా చూసుకోవచ్చు. వీటితో పాటు సాధారణ 5 కిలోల మెటల్ సిలిండర్లు కూడా ఇన్‌స్టామార్ట్ యాప్‌లో లభిస్తాయి. ఇన్‌స్టామార్ట్ కేవలం నిత్యావసర సరుకులకే పరిమితం కాకుండా, గ్యాస్ సిలిండర్ల వంటి అత్యవసర గృహ అవసరాలను కూడా సురక్షితంగా, నమ్మకంగా ప్రజల చెంతకు చేర్చడమే లక్ష్యంగా పెట్టుకుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. గ్యాస్ సిలిండర్ల రవాణాలో భద్రత అత్యంత కీలకమైన అంశం కాబట్టి, వీటి డెలివరీ బాధ్యతలను స్విగ్గీ సాధారణ డెలివరీ బాయ్స్‌కు కాకుండా, హెచ్‌పీసీఎల్ అధికారిక గుర్తింపు పొందిన పంపిణీదారుల (డిస్ట్రిబ్యూటర్స్) నెట్‌వర్క్‌కు అప్పగించారు. యాప్‌లో వచ్చే ఆర్డర్లను స్థానిక హెచ్‌పీసీఎల్ డిస్ట్రిబ్యూటర్లకు బదిలీ చేస్తారు. వారు తమ శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా మాత్రమే వినియోగదారుల ఇళ్లకు సిలిండర్లను సురక్షితంగా చేరవేస్తారు. మొదటిసారి ఆర్డర్ చేసే వారికి కొత్త గ్యాస్ కనెక్షన్‌గా పరిగణించి గుర్తింపు కార్డులను , నివాస ధృవీకరణ పత్రాలను సేకరిస్తారు.




## హెచ్‌డిపి ఫైనాన్షియల్ లాభం 735కోట్లు

**న్యూఢిల్లీ,జులై 15:** హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. రుణాల వృద్ధి, రుణాల పంపిణీ పెరగడం, ప్రధాన రుణ వ్యాపారంలో స్థిరమైన వృద్ధి కారణంగా కంపెనీ నికర లాభం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 38శాతం పెరిగింది. త్రైమాసికంలో రుణాలపై బలమైన డిమాండ్‌తో పాటు కార్యకలాపాల్లో స్థిరమైన పురోగతి కనిపించినట్లు కంపెనీ వెల్లడించింది. త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.735 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.532 కోట్లుగా నమోదైంది. కంపెనీ మొత్తం ఆదాయం దాదాపు రూ.5,000 కోట్లకు పెరిగింది. రుణాల పోర్ట్‌ఫోలియోలో అన్ని విభాగాల్లో కొనసాగుతున్న డిమాండ్, వ్యాపార విస్తరణ ఇందుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి.త్రైమాసికంలో రుణాల పంపిణీ వార్షిక ప్రాతిపదికన 16.2 శాతం పెరిగి రూ.17,629 కోట్లకు చేరుకుంది. అలాగే కంపెనీ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ 32.4 శాతం పెరిగి రూ.1.09 లక్షల కోట్లకు చేరింది.కంపెనీ స్థూల రుణాల (గ్రాస్ లోన్స్) పరిమాణం రూ.1.14 లక్షల కోట్లకు పెరిగి, గత ఏడాదితో పోలిస్తే 17.4 శాతం వృద్ధిని నమోదు చేసింది.పోటీ తీవ్రంగా ఉన్న రుణ మార్కెట్‌లోనూ కంపెనీ స్థిరమైన విస్తరణను కొనసాగించినట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఆస్తుల నాణ్యత కూడా దాదాపు స్థిరంగానే కొనసాగింది. జూన్ చివరి నాటికి స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 2.58 శాతంగా నమోదైంది. నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.05 శాతంగా గత ఏడాదితో దాదాపు సమానంగా ఉంది. ప్రొవిజన్లకు ముందు నిర్వహణ లాభం వార్షిక ప్రాతిపదికన 20.5శాతం పెరిగి రూ.1,420 కోట్లకు చేరుకుంది.సవాళ్లు ఉన్నప్పటికీ సంస్థ కార్యకలాపాలు సానుకూల దిశలో కొనసాగుతున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.